2 ఆగస్టు 2026

# కథానిధి

# ఆదివారం కథలు

సమర్పణ:

కె.ఎ. మునిసురేష్ పిళ్లై, 99594 88088

## కథాక్రమం

మీకు నచ్చిన కథ ఉన్న వరుస మీద క్లిక్ చేయండి. నేరుగా ఆ కథ ఉన్న పేజీలోకి వెళ్లండి


| | | | |
|---|---|---|---|
| తెలుగుప్రభ | సాపేక్షం | మధురాంతకం నరేంద్ర | 98662 43659 |
| ఆదివారం ఆంధ్రజ్యోతి | ఆమెలేని వీధి | ప్రసేన్ | 70133 58154 |
| నమస్తే తెలంగాణ బతుకమ్మ | రా..బంధువు | బి.సుజిన్‌కుమార్ | 86391 61721 |
| సాక్షి ఫన్‌డే | పచ్చి గెడ్డి | మొహమ్మద్ గౌస్ | |
| విశాలాంధ్ర | భాగింపబడిన జీవితం | కొత్తపల్లి ఉదయబాబు | 95337 56075 |
| నవ తెలంగాణ సోపతి | గూటిని మోసుకెళ్లే పిట్ట | ప్రసేన్ | 70133 58154 |
| వార్త | శశిరేఖా పరిణయం | తాళ్లూరి లక్ష్మి | |
| ప్రజాశక్తి స్నేహ | ఆదర్శకుటుంబం | మనస్విని | 63094 38959 |
| సూర్య | పరివర్తన | మర్రాపు వసుంధరాదేవి | 94414 67660 |
| సాక్షి ఫన్‌డే | గుడ్డు | మల్లాది వెంకటకృష్ణమూర్తి | |
| 19.7.26 కథానిధి సమీక్ష | సామాజిక సంక్షోభాల సజీవ చిత్రణ | భూక్యా గోపినాయక్ | 99891 59196 |

మరికొన్ని బాలల కథలు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథా ప్రియులకు నమస్తే..

ఈ ఆదివారం (2 ఆగస్టు 2026) కథల సంకలనం 44 పేజీల కథానిధి పీడీఎఫ్ లో మొత్తం 10 కథలు, అదనంగా మరికొన్ని పిల్లల కథలు ఉన్నాయి. సావకాశంగా చదవండి.. రచయితలకు మీ అభిప్రాయాలు తెలియజేయండి.

**కథానిధి పాఠకులకోసం ఒక కొత్త సదుపాయం అందిస్తున్నాను. మొదటి పేజీలో కథల వరుసక్రమం, రచయిత, ప్రచురణల వివరాలు ఉంటాయి. అందులో మీకు నచ్చిన కథ ఉండే వరుస మీద క్లిక్ చేస్తే.. పీడీఎఫ్ సంకలనంలో నేరుగా ఆ పేజీ కి వెళ్లిపోవచ్చు. ఈ సదుపాయాన్ని కథాప్రియులు వాడుకోగలరు**

కథానిధి పాఠకులకు గతవారం కథల సమీక్షను కూడా అందిస్తున్నాము.
‘26 జులై 2026 కథానిధి’ కథలపై భూక్యా గోపి నాయక్ సమగ్ర సమీక్ష కోసం
ఈ కింది లింక్ లను క్లిక్ చేయండి

**adarsini.com వెబ్ సైట్లో చదవడం కోసం**

**26 జులై 2026 కథానిధి సంకలనం పీడీఎఫ్ కోసం**

కథానిధి వాట్సాప్ గ్రూపులో మీరు నేరుగా మీ మిత్రులను చేర్చవచ్చు. మీరు జాయినింగ్ లింక్ పంపితే వారు కూడా నేరుగా చేరవచ్చు.

మీ
కె.ఎ. మునిసురేష్ పిళ్లె
99594 88088

- కథలు చదవండి.
- చదివే ఆసక్తి ఉన్న మిత్రులకు ఈ పీడీఎఫ్ షేర్ చేయండి.
- కథలు నచ్చితే రచయితలకు మీ స్పందనలు తెలియ జేయండి. మెసేజీ అయినా పెట్టండి.
- కథలు చదివి వదిలే యకండి. మంచి కథల గురించి మీ మిత్రులతో కూడా ముచ్చటించండి. వారికి కూడా చదివే ఆసక్తి పుట్టవచ్చు.
- సాహిత్యప్రియులు ***https://kathavasudha.com*** లింక్ లోకి వెళ్లిగానీ, దిగువ పేజీలో ఇస్తున్న *QR code* ను స్కాన్ చేయడం ద్వారా గానీ కథావసుధ వెబ్ మేగజైన్ లోని అనువాద కథలు, అనువాద కవితలు, సాహిత్యవ్యాసాలను చదవండి.
- ఆయా దినపత్రికల సౌజన్యంతో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# సాపేక్షం

• మధురాంతకం నరేంద్ర

**తాను కూడా** కోయంబత్తూరు కొచ్చానని కావేరికి ఫోన్ చేసి చెప్పాడు జయంత్. ఆమె పెద్దగా ఆశ్చర్యపడలేదని పించగానే తడబడిపోయాడు.ఆమెను వెంటాడుతూ వచ్చానని తెలుసుకుందేమోనని కంగారుపడ్డాడు.

"ఆఫీసు పనిపైన అర్జెంటుగా రావలసి వచ్చింది. క్లయింట్ వెంటనే దొరికాడు. రెండురోజులనుకున్నపని సగం రోజులో అయిపోయింది. తిరిగి వెళ్ళడానికి రైల్లో రిజర్వేషన్ బుధ వారానికి చేయించుకున్నాను. యిప్పుడు యీవూర్లో రెండు రోజులు ఖాళీగా యేంచేయాలో తోచడంలేదు," అని సర్దుకోడానికి ప్రయ త్నించాడు. వాళ్ళింటికి ఆ హ్వానిస్తుంద నీ, కోయంబత్తూరు చుట్టూవున్న యాత్రా ప్రదేశాలకు తీసుకెళతా నంటుందనీ యెదురుచూశాడు.

"యిప్పుడు మధ్యాహ్నమే కదా! యిక్కడొక ఫంక్షన్ జరుగుతోంది. యిది సాయంకాలం దాకా కొనసా గుతుంది. బెంగుళూరులో వుండేవాళ్ళకు తమిళం కాస్తకాస్త అర్థమవక పోదు. మీకూ యిది యింట్రెస్టుగానే వుంటుంది . నేను లొకేషను పెడతాను. వచ్చేయండి , " అంది కావేరి.

ఆ లొకేషనేదో వాళ్ళ యింటికే అయివుంటుందనుకుని వెంటనే ఆటోయెక్కి బయల్దేరేసాడు జయంత్.

బెంగుళూరు ఆఫీసుకు బదిలీఅయి వెళ్లిన రెండువా రాల్లోనే రూమ్మేటు జయరాం కావేరిని గురించి తనకు చెప్పాడు. " ఆమెది మీ కులమేనని తెలుసా నీకు? మంచి పొజిషన్లో వుంది. నీకు నచ్చినట్టయితే ప్రపోజ్ చేసుకో," అని వూరించాడు.

అంతటితో ఆగకుండా కాఫ్టీరియాలో కలిసినప్పుడు, "మా జయంత్ కు కూడా మీలాగే పుస్తకాల పిచ్చి. యెప్పుడూ యేదో చదువుకుంటూ రాసుకుంటూ వుంటాడు ," అంటూ అతడ్ని కావేరికి పరిచయం చేసాడు.

ఆమె కుతూహలంగా చూసి, "మీరే భాషలో రాస్తారు?" అని అడిగింది.

జయంత్ సిగ్గుపడుతూ నవ్వి, "తెలుగులో... యేవో పిచ్చి రాతలు... యింకా యేవీప్రింట వలేదు," అని గొణిగాడు.

"మన ఐటీ వుద్యోగులు యింగ్లీషులోనే మాట్లాడుకుంటూ మనకో మాతృభాష వుందనే విషయాన్నే మరిచిపోతున్నాం ," అంటూ నవ్వేసి, " ప్రింట్ కావడం కాదు, రాయడమే ముఖ్యం. అంతకంటే చదవడం యింకా ముఖ్యం," అంది ఆమె. తరువాత యెదురైనప్పుడల్లా "యిప్పుడేం చదువుతున్నారు?" అని అడగసాగింది. పుస్తకాల గురించి మాట్లాడే మిషతో ఆమె గురించిన వివరాలు కొన్ని సేకరిం చగలిగాడు జయంత్.

కావేరికి మగస్నేహితులెవరూ లేరు. ఆఫీసూ, పీజీ హాస్టలుగది తప్ప మరెక్కడికీ పెద్దగా వెళ్ళదు .వాళ్ళ నాన్నకు కోయంబత్తూరులో యేదో వ్యాపారముంది. ఆమె రోజూ వాళ్ళ అమ్మానాన్నలతో గంటలతరబడి ఫోన్లో మాట్లాడుతూ వుంటుంది. ఆ తండ్రి ఆమెకు ఆస్తిలో సగభాగం యివ్వక పోదు.

వారం క్రితం అర్జెంటు పని పైన తాను కోయంబత్తూరు

## రచయిత



సుప్రసిద్ధ రచయిత మధురాంతకం నరేంద్ర ఐదు దశాబ్దాలకు పైగా కథలు రాస్తున్నారు. సీమ రచయితల్లో ఎన్నదగిన సృజనకారుడు. ఇతివృత్తం, కథ నడిపే శైలిలో ఆయన ముద్ర సుస్పష్టం. వందకు పైగా కథలు ఆయన కలం నుంచి వెలువడ్డాయి. తొమ్మిది కథా సంపుటాలు, తొమ్మిది నవలలు వెలువరించారు. సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవితం ఆధారంగా ఆయన రాసిన 'మనోధర్మపరాగం' నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఆజ్‌తక్ సాహిత్య జాగ్రితి సమ్మాన్ పురస్కారం సహా అనేక అవార్డులు అందుకున్నారు. పలు రేడియో నాటికలు, తెలుగు, ఆంగ్ల భాషల్లో సాహిత్య విమర్శనా వ్యాసాలు రాశారు. కొన్ని కథా సంకలనాలకు సంపాదకత్వం వహించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు.

98662 43659

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

వెళ్తున్నానని చెప్పిందామె . అంత ముఖ్యమైన పనేమిటని ఆమెను అడగడానికి జయంత్ మొహమాట పడ్డాడు. తీరా ఆమె వెళ్ళిపోయాక పెళ్ళి చూపుల కోసం వెళ్ళిందేమోనన్న అనుమానంతో కలవరపడిపోయాడు.సరిగ్గా అప్పుడే కోయంబత్తూరు క్లయింటునెవరైనా వెళ్లి కలవాలని జనరల్ మేనేజర్ అనడం తనకు వినిపించింది. వెంటనే ఆ అవకాశాన్ని లాక్కుని కోయంబత్తూరు కొచ్చేసాడు. కావేరి గురించి తెలుసుకోవడం కోసం యితరులపైన ఆధారపడ డంకంటే తానే రంగంలోకి దిగడం శ్రేయస్కరం. యిలాంటి విషయాల్లో జాగరూకత, చొరవ, ముందు జాగ్రత్త చాలా

నిలువెత్తు ఫోటోల్లోంచీ నల్లటి కోట్లు తొడుక్కుని, తలపాగాలూ, జరీ అంచు అంగవస్త్రాలూ ధరించిన ఘరానా మనుషులు ఠీవిగా పలకరిస్తున్నారు. రెండో అంతస్థు పైన్నుంచీ మంద్రంగా వినబడుతున్న తమిళ మాటల్ని ఆధారంగా చేసుకుని వరండాలోంచీ మేడపైకున్న మెట్లు నెక్క సాగాడతను.

పట్టుచీరలో మెరిసిపోతూ ద్వారం దగ్గరే కనిపించిన కావేరి. “మీ కోసమే యెదురుచూస్తున్నాను,” అంటూ ఆహ్వానించింది. “ముందుగా స్నాక్స్ తీసుకుందురుగానీ యిటు రండి,” అని పెంకుల వరండాలోకి తీసుకెళ్లింది.




అవసరం.

ఆటో నగరపు నడిబొడ్డులోని పెద్ద బజారులో ఆగినప్పుడు జయంత్ సందేహిస్తూనే కిందికి దిగాడు. రెండువైపులా ఆశ్చర్యార్థక సంజ్ఞల్లా పొడుగ్గా వున్న ఆరంతస్థుల అంగళ్ల సముదాయాల మధ్యలో ఫుల్ స్టాపు లాగున్న పాత రెండతస్తుల యింటిముందు, తమిళ అక్షరాలున్న రంగుల ఫ్లెక్సీ ఆహ్వానం పలుకుతోంది . ఫ్లెక్సీలో పుస్తకాల బొమ్మలతో బాటూ రకరకాల వయస్సులున్న మనుషుల ఫోటోలూ వున్నాయి.

చుట్టూ ఐదడుగుల యెత్తున్న ప్రహరీ మధ్యలో వెడల్పుగా వున్న పాతకాలపు మిద్దె అది. సున్నంతో కట్టినట్టున్న గోడలు బలంగా మెరుస్తున్నాయి. వరండాలో గోడలపైన పాత

పళ్లరసం తాగుతూ షామియానా కింద కుర్చీల్లో కూర్చున్న జనాలకేసి చూసాడు జయంత్. జనాల చుట్టూ నిలువెత్తు విద్యుత్ పంకాలు బుద్ధిగా శబ్దం చేయకుండా తిరుగుతున్నాయి. అటువైపు వేదిక పైన నగిషీల కుర్చీల్లో ఆరేడుమంది నడివయస్సు వాళ్ళు కూర్చుని వున్నారు. పోడియం ముందు అడ్డపంచె కట్టుకుని నిలబడిన బట్టతల పెద్దాయన నింపాదిగా మాట్లాడుతున్నాడు. శ్రోతలందరూ చెవులప్పగించి వింటున్నట్టున్నారు.

“జనం చాలామందే వున్నారు. మూడు నాలుగు వందల మంది వుండొచ్చు,” అన్నాడు జయంత్.

“స్వర్ణోత్సవమంటే మామూలు విశేషం కాదుగదా! వేరే రాష్ట్రాలనుంచీ మాత్రమే కాదు, శ్రీలంక నుంచీ, మారిషస్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

నుంచీ కూడా అతిథులు వచ్చారు," అందామె.

యెవరు, యెందుకు, యేమిటి అని అతడడిగిన తర్వాత ఆమె వివరాలన్నీ చెప్పింది.

అప్పుడక్కడ 'పుదు మయిల్' అనే తమిళ వార పత్రిక గోల్డెన్ జూబ్లీ జరుగుతోంది. కావేరి తండ్రే దాని సంస్థాపకుడూ, సంపాదకుడూ. ఆ సందర్భంలో ప్రత్యేక సంచికలూ , సావనీర్లూ ఆవిష్కరించబోతున్నారు. కావేరి కంటే నాలుగేండ్లు పెద్దవాడైన ఆమె అన్న, యింజినీరింగులో మాస్టర్ డిగ్రీచేసినవాడు , వుద్యోగం మానేసి మూడేళ్ళ క్రితం పుస్తకాల పబ్లిషింగ్ మొదలుపెట్టాడు. అతను వేసిన పుస్తకాలు కూడా కొన్ని అక్కడ ఆవిష్కరించ బోతున్నారు.



కావేరి తండ్రీ, అన్నా, మొత్తంగా వాళ్ళ కుటుంబమంతా పుస్తకాల వ్యాపారంలో వున్నట్టు తెలియగానే ' యెన్ని లక్షల సర్కులేషనో! యెన్ని లక్షల టర్నోవరో,'అనుకుని జయంత్ ఆశ్చర్యపడుతూ ముందుకు కదిలాడు.

"ముందు స్పెషల్ సీట్లున్నాయి పదండి," అని ఆమె పిలుస్తున్నా పట్టించుకోకుండా వెనక రెండో వరుసలో కూర్చుని , " మీకు చాలా పనులుంటాయి. వెళ్లి చూసుకోండి. ఆయనేం మాట్లాడుతున్నాడో విని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తాను," అన్నాడు.

ప్రేక్షకులందరూ యెందుకో పెద్దగా చప్పట్లు కొడుతున్నారు.చాలామంది మగవాళ్ళు అడ్డపంచలే కట్టుకునివున్నారు. ఆడవాళ్లు పట్టుచీరల్లో మెరిసిపోతున్నారు .పసివాళ్ళనుంచీ ముసలివాళ్ళ వరకూ అన్ని వయసుల వాళ్ళూ వున్నారు. అందరి చూపులూ వేదిక పైనే వున్నాయి. తమిళ స్నేహితుల మాటల్నివిన్న పరిజ్ఞానంతో వక్త ప్రసంగాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించాడు జయంత్ . చాలా సేపటి తర్వాత వేదిక పైన వక్త మారాడు కానీ, శ్రోతల ధ్యాస మాత్రం మారలేదు. మాటలు శబ్దాలుగా మారి వినబడుతున్నాయి కానీ, వాటి భావాలు మాత్రం అతడికి అందడం లేదు. విసుగ్గా పక్కకు తిరిగి పిట్టగోడ మీదుగా కిందున్న రోడ్డుపైకి చూపులు తిప్పాడు జయంత్.

రకరకాల కార్లూ, బస్సులూ, ఆటోలూ , జీబులతో రాకపోకల ప్రవాహం వురకలేస్తోంది. రోడ్డుకిరువైపులావున్న పెద్ద పెద్ద అంగళ్లలో బేరాలు సాగుతున్నాయి. పేవ్మెంట్లపైన నడుస్తున్నవాళ్ళుకూడా కొత్త కరన్సీనోట్లలా వెలిగిపోతున్నారు.

కాస్సేపు చుట్టూ తలతిప్పి చూసాక జయంత్ పెద్దగా నిట్టూరుస్తూ పైకిలేచి యివతలికొచ్చి మెట్లు దిగాడు. మొదటి అంతస్థు వరండాలో కొందరు మనుషులు కనిపించగానే అటుకేసి నడిచాడు. దగ్గరికెళ్ళాకగానీ అక్కడొక పుస్తకాల దుఖాణముందని తెలియలేదు. గోడపొడవునా వున్న చెక్క అలమరాల నిండా కొత్త పుస్తకాలు కొలువుతీరి వున్నాయి. కౌంటరుముందున్న యువకుడు పుస్తకాలు కొనుక్కుంటున్నవాళ్లకు బిల్లులువేసి డబ్బులు తీసుకుంటున్నాడు.

"మీరిక్కడున్నారా? వుపన్యాసాలు బోరుగొట్టాయా?" కావేరి గొంతు వినగానే తిరిగి చూసాడు జయంత్."యివన్నీ మా అన్న పబ్లిష్ చేసిన పుస్తకాలు. యివి మా పత్రిక కొత్త ఇష్యూలు, "అంటూ ఆమె ముందుకొచ్చింది. తెలుగు వార పత్రిక సైజులోనే వున్న 'పుదు మయిల్' అనే ఆ వార పత్రికను తీసి పేజీలు తిప్పిచూసాడు జయంత్. మడిలో పోసిన నారులా కాగితాలనిండా అక్షరాలున్నాయి. అటు పక్కనే వున్న మరో పుస్తకాన్ని చేతికి తీసుకున్నాడు జయంత్.

"అది పోయిన యేడాది ప్రచురించిన నవల. యిప్పటికి ఐదువేలకు పైగా అమ్ముడయింది," అంది కావేరి వుత్సాహంగా. దాని ఖరీదును చూసాక ,"మీ వీక్లీ సర్కులేషన్ యెంతుంటుంది?" అని అడుగుతూ జయంత్ పక్కకు నడిచాడు.

"పోయిన నెలలో తొమ్మిది వేలు దాటిందని మా నాన్న సంతోషంగా వున్నారు. ప్రెస్సు గ్రవుండ్ ఫ్లోర్లో వుంది. రెండో అంతస్థంతా పత్రిక ఆఫీసు," అంది కావేరి సంబరంగా.

మేడపైన్నుంచీ చప్పట్ల శబ్దం పెద్దగా వినబడింది. కావేరి హడావుడి పడుతూ మెట్లెక్కసాగింది. నీరసంగా ఆమె వెనకే మెట్లెక్కుతూ తొమ్మిది వేలు యింటూ యాభై అని మనసులోనే లెక్కలు వేయడం మొదలుపెట్టాడు జయంత్. వేదికపైని అతిధులకు దుస్సాలువలు కప్పుతున్నారు. జయంత్ వెనక కుర్చీలో అసహనంగా కూర్చున్నాడు.

సమావేశం ముగిసిన తర్వాత కూడా జనం

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

షామియానా నొదలలేమన్నట్టుగా నిలబడే మాట్లాడుకో సాగారు. వెళ్లడం యిష్టంలేనట్టుగా కొందరు మెల్లగా జట్లు జట్లుగా మెట్లు దిగసాగారు.

కావేరి కోసం కలయజూశాడు జయంత్. కుర్చీలను గుండ్రంగా వేసుకుని పరవశంగా మాట్లాడుకుంటున్న డజను మంది యువతీ యువకుల మధ్యలో ఆమె కనిపించింది. జయంత్ కు కూడా వో కుర్చీ చూపెట్టాక ఆమె అక్కడ కూర్చున్న వాళ్ళను పేరు పేరునా పరిచయం చేసింది. ఐటీ యింజినీర్లు , యూనివర్సిటీలో ప్రొఫెసర్లు, డాక్టర్లు, వాళ్ళందరూ బాగా చదువుకుని, పెద్ద వుద్యోగాలు చేస్తున్న వాళ్ళే!

జయంత్ ను తన కొలీగ్ అని పరిచయంచేసాక, " మేమంతా మాడ్రన్ తమిళ క్లాసిక్సును యింగ్లీషులోకి ట్రాన్స్ లేట్ చేసే మిషన్ లో వున్నాము. రీజనల్ లాంగ్వేజీలో రాసినారు గానీ వీళ్ళు అందురూ వరల్డ్ క్లాస్ రైటర్లు. వాళ్ళను యెప్పుడో ట్రాన్స్ లేట్ చేసుండాల్సింది. లేటయిపోయింది," అని ఆమె వాపోయింది. యింత లో ఆమెనెవరో పిలిచారు. యిప్పుడే వస్తానని అతడికి చెప్పాక ఆమె లేచివెళ్ళిపోయింది. ఆ గుంపులోనివాళ్లంతా అతడి పొలకువను పట్టించుకోకుండా తమిళంలో మాట్లాడుకో సాగారు.


జయంత్ నిట్టూరుస్తూ పైకి లేచి చకచకా మెట్లు దిగి కిందికొచ్చేసాడు. హోటలు కొచ్చాక కూడా రొప్పుతూనే లాప్టాప్ తెరిచాడు. కావేరి చెప్పిన విషయాలసంతా జ్ఞాపకం చేసుకుంటూ కావాల్సిన సమాచారాల కోసం గాలించసాగాడు. మధ్యలో సందేహాలొచ్చినప్పుడు తనకు అందుబాటులో వున్న స్నేహితులకూ, ప్రొఫెసర్లకూ ఫోన్లు చేయసాగాడు. అర్ధరాత్రి దాటాక అలసిపోయి నిద్రపోయాడు.

జయంత్ నిట్టూరుస్తూ పైకి లేచి చక చకా మెట్లుదిగి కిందికొచ్చేసాడు. హోటలు కొచ్చాక కూడా రొప్పుతూనే లాప్టాప్ తెరిచాడు. కావేరి చెప్పిన విషయాలనంతా జ్ఞాపకం చేసుకుంటూ కావాల్సిన సమాచారాలకోసం గాలించ సాగాడు. మధ్యలో సందేహాలొచ్చినప్పుడు తనకు అందుబాటులోవున్న స్నేహితులకూ, ప్రొఫెసర్లకూ ఫోన్లు చేయసాగాడు. అర్ధరాత్రి దాటాక అలసిపోయి నిద్రపోయాడు. వుదయాన మెలకువ వచ్చినప్పుడు చూస్తే గంట పది దాటుతోంది. ఆదరా బాదరా ముఖం కడుక్కున్నాక కావేరికి ఫోన్ చేసాడు.

"నిన్న సాయంత్రం చెప్పకుండా వెళ్లిపోయారేమిటి? చాలాసార్లు ఫోన్ చేసాను మీకు," అందికావేరి .

"మీకో ముఖ్యమైన విషయం చెప్పాలి. సమ్ థింగ్ వెరీ మచ్ అలార్మింగ్," వీలయినంత ప్రశాంతంగా చెప్పడానికి ప్రయత్నించాడు జయంత్.

"ఆఫీసు పనయితే బెంగుళూరు కెళ్ళాకే మాట్లాడు కోవచ్చు," అందామె.

"ఆఫీసు పనిగాదు. మీ పబ్లిషింగ్ గురించి. యిక్కడే యెంత త్వరగా వీలయితే అంత త్వరగా కలవడం మంచిది," అన్నాడతను గొంతు వణుకుతుండగా.

ఆమె కాస్సేపు ఆలోచించి, " ఆ విషయాలు నా కంటే మా నాన్నకూ, అన్నకే బాగా తెలుస్తాయి . మీరు నేరుగా యింటికే రండి," అని పిలిచింది.

యింటికెళ్తే తనకు కావలసిన మరికొన్ని వివరాలు నేరుగా తెలుసుకోవచ్చు. కోరిన కోనలో వాన కురిసినట్లనిపించింది జయంత్ కు.లాప్ టాప్ సంచిని భుజానికి తగిలించుకుని, ఆమె పంపిన లొకేషన్ సహాయంతో వెంటనే బయల్దేరేసాడు.

'పుదు మయిల్' పత్రిక ఆఫీసుకు అరకిలోమీటరు దూరంలో, బజారు వీధులకు దూరంగా, నివాస గృహాల వీధిలో వుందా యిల్లు. వాళ్ళ ఆఫీసులాగే అది కూడా పాతకాలం నాటి రెండతస్తుల మేడ . పై అంతస్థు పైని పాత పెంకుల పైకి యెగబాకిన ఆకుపచ్చని మల్లె తీగలు యెండలో మెరుస్తున్నాయి.

వరండాలోకి కావేరితో బాటూ వచ్చిన పెద్దాయన, "రాండ, రాండ. నిన్న ఫంక్షనుకు మీరు వచ్చిండినారని అమ్మణ్ణి చెప్పిందాది . అప్పుడు కల్సలేదని మనేదగా వుండింది. మీరిప్పుడిట్లా రావాటంతో ఆ నొప్పి తగ్గుండాది," అంటూ ఆహ్వానించాడు.

నిన్నటి సమావేశంలో వేదిక పైన చూసిన వ్యక్తిగా ఆయనను గుర్తుపట్టాక, "మీరు తెలుగు బాగా మాట్లాడు తున్నారే!" అంటూ జయంత్ ఆశ్చర్యపడిపోయాడు.

"తెలుంగు మా అమ్మబాష . మేంము యింటిలో తెలుంగే పేసాదతాము. మా అమ్మణ్ణి యేబాషలో యింటికి రమ్మని పిలిసుండాది?" అన్నాడాయన నవ్వుతూ.

"మా ఆఫీసులో అందురూ యింగిలీశే మాట్లాడతారు నాయినా! యిప్పటిదాంకా నేను జయంత్ గారిని తెలుంగులో పలుకాడలేదు. మనము పేసాడే తెలుంగు యింటే వుత్తరాది తెలుంగువాళ్ళు నగతారా లేదా సెప్పు," అంది కావేరి.

"ఆ పిల్లోడ్ని పడసాల్లోనే నిలబెడతారా యేంది? లోపలికి వొచ్చి కూకోనీరా ?" అని పెద్దావిడ హాల్లోంచీ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

మందలించింది.

హాల్లో పెద్ద స్క్రీనున్న స్మార్ట్ టీవీతో బాటూ యేసీ లాంటి హంగులన్నీ ఉన్నాయి.

కావేరి వాళ్ళమ్మ తీసుకొచ్చి యిచ్చిన పెద్ద గ్లాసు మజ్జిగ తాగాక, " మీ బంధువులందరూ యెక్కడున్నారు? కోస్తానా? రాయలసీమా? లేకపోతే తెలంగాణానా?" అని అడిగాడు జయంత్ ఆశ్చర్యంలోంచీ తేరుకోడానికి ప్రయత్నిస్తూ.

" మాంకు వుత్తరాదిలో బందులెవురూ లేరు బిడ్డా. మా బందుగులందురూ యీ అరవ రాష్ట్రం లోనే వుండారు," అన్నాడా పెద్దాయన.



జయంత్ కాస్సేపు అయోమయంగానే ఆలోచించి, " మీ పూర్వీకులెవరో, అయిదారు తరాల ముందు, మా వైపునుంచీ యిక్కడికి వలస వచ్చివుంటారు. లేకపోతే మీ మదర్ టంగ్ తెలుగెట్లయివుంటుంది?" అని అడిగాడు.

"అదేమీ లేదు.యిక్కడ తెలుంగు పాతదో, తమిళు పాతదో చెప్పేది మాలదు. మన తెలుంగు జనాలు యిక్కడ కన్యాకుమారి నించీ, చెన్నయి దాంకా నిండా వుండారు. సూచీంద్రం, తిరునల్వేలి, తూత్తుకుడి, శ్రీవిల్లిపుత్తూరు, రాజుపాలెం, మదురై, తంజావూరులలో మాకు సుట్టాలుండారు. నిన్న మా విలాకొచ్చిండిన జనంలో ముగ్గురిలో వొకరికి అమ్మ బాష తెలుంగుదానే! మా పెద్దోళ్ళు అందుకే పాది తెలుంగు, పాది దేశం అనేటోళ్లు. అరవంలో పాది అంటే సగము అని అర్థము. అంటే దేశంలో సగం జనం తెలుంగే నంట. ఆకాలంలో దేశమంటే పూరాగా దక్షిణ ఇండియా అనే అనుకునేటోళ్లు,"

"తెలుంగు అంటే మా యింటాయినకు పై తెలవదు నాయినా! మీది యా వూరు? అమ్మా అబ్బా యామిజేస్తారు," అంటూ కావేరి తల్లి భర్తకు అడ్డు తగిలింది. అన్యమనస్కంగానే ఆమెకు జవాబులు చెప్పసాగాడు జయంత్.

ఇంతలో ఫోనేదో రావడం తో కావేరి తండ్రి మొబైల్ తీసుకుని అవతలిగదిలోకి వెళ్ళాడు. వంటగదిలోంచీ కుక్కరు విజిల్ రావడంతో కావేరి తల్లి కూడా లేచి వంటగదిలోకి వెళ్ళింది.

జయంత్ అటూ యిటూ తల తిప్పి చూసాక, "మీ అమ్మా నాన్నల మాటల్లో పడి నేనొచ్చిన పని మరచిపోయాను. దీన్నొకసారి చూడండి," అంటూ లాప్ టాప్ తెరిచి మౌస్ తో స్క్రీన్ ను ముందుకు తిప్పాడు. తాను మొదటిసారిగా ఆమెతో తెలుగులో మాట్లాడుతున్నానన్న స్పృహ అతడికి లేకపోయింది.

"యిలా చూడండి. మీరు డేంజర్ జోన్ లో వున్నారు. నిన్న మీ ఫంక్షను కొచ్చినప్పుడే నాకు అనుమానమొచ్చింది. రాత్రంతా యీ డేటానంతా సేకరించి అన్ని రకాలుగా అనలైజ్ చేసాను," అన్నాడు. ఆమె నుదురు చిట్లించుకుని లాప్ టాప్ లోకి చూడసాగింది.

"మీ పత్రిక సర్క్యులేషన్ ప్రకారం లెక్కగడితే నెల నెలా మీ టర్నోవరు పఙ్జెనిమిది లక్షలు. ప్రింటింగ్ ఖర్చులూ, వుద్యోగుల జీతాలూ, రచయితలకు పారితోషకాలూ పోను ప్రాఫిట్ గా మిగిలేది మహా అంటే నెలకు రెండు లక్షల రూపాయలు. యిక పబ్లిషరుగా మీరు వేసిన పుస్తకాలకు మీరు పెట్టిన ఖర్చులు పోను మిగిలింది యీ మూడు సంవత్సరాల్లో అయిదు లక్షలు కూడా లేదు. మీ నాన్నగారికి, మీ అన్నకూ నెల జీతాలకింద చూస్తే తలా లక్ష కూడా రావడం లేదు. యిక్కడున్న మన క్లయింట్ ద్వారా కొంత డేటా దొరికింది. కోయంబత్తూరుకు పదిమైళ్ళ దూరంలో మీకున్న పఙ్జెనిమిది యెకరాల భూమిని కౌలుకివ్వడం ద్వారా మీకు సంవత్సరానికి పదిలక్షల దాకా ఆదాయం వస్తోంది. ఆ డబ్బుల్ని కూడా మీ వాళ్ళు పబ్లిషింగ్ లో పెట్టుబడిగా పెట్టేస్తున్నారు."

"మా మాదిరి పబ్లిషర్లూ, సాహిత్యం పత్రికలూ తమిళంలో యింకా చానా వుండాయి ," అంటూ ఆమె అడ్డుపడింది. మొదటిసారిగా ఆమె తనతో తెలుగులో మాట్లాడిందన్న సంగతిని గుర్తించే స్థితిలో అతను లేడు.

"ఆ డేటా కూడా తీశాను. వాళ్ళల్లో నలుగురికి వేరే పెద్ద వ్యాపారాలున్నాయి. మిగిలిన వాళ్ళు మీలాగే బొటాబొటి లాభాలతో వేగుతున్నారు..." అంటూ అతను కొనసాగించాడు.

ఆమె పెదవులు వణకసాగాయి.ఆ వివరాలన్నీ అతడెందుకు సేకరించాడన్న అనుమానం రాగానే ఆమె బెంబేలు పడిపోసాగింది. యేంచెప్పాలో పాలుపోక

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

పోవడంతో ఆమె తలతిప్పి చుట్టూ చూసింది .

“అసలు సిటీ మధ్యలో వున్న మీ ప్రెస్సు బిల్డింగు విలువే మీకు తెలియడం లేదు. యే రియల్టర్ కిచ్చినా పాత మిద్దెను పడగొట్టి షాపింగులూ, ఆఫీసులూ కట్టేస్తాడు. యింట్లో వూరికే కూర్చున్నా నెలకు అయిదారు లక్షల బాడుగలే వస్తాయి...”

ఆమె పెద్దగా నిట్టూర్చి, “ఆ బిల్డింగు కుండే హిస్టారికల్ యింపార్టెన్సు తెలుసునా మీకు? ” అని అడిగింది.

“ఆ డేటాకూడా సంపాదించాను. అది మీ తాత కట్టించిన మేడ. ఆ బజారులో వుండే అన్ని బిల్డింగులకంటే పాతది. దాంట్లో ఇండిపెండెన్స్ ముందు కాంగ్రెస్ మీటింగులుకూడా జరిగాయి. దాని చుట్టూ చాలా ఖాళీ స్థలముంది. దాన్నంతా సక్రమంగా వుపయోగిస్తే యిక్కడ పెద్ద షాపింగ్ మాలే కట్టచ్చు,” అన్నాడతను మౌస్ ను చకచకా తిప్పుతూ.



ఆమె నిస్సహాయంగా చుట్టూ చూసింది. దాదాపుగా రెండునెలల్రితమే తనకు పరిచయమైన యీ వ్యక్తి కీ విషయాలన్నీ యెందుకు? యిదంతా తనపై నవున్న మక్కువగా అనుకుని సంతోషపడాలో, అనవసరమైన చొరవగా గుర్తించి విసుక్కోవాలో తెలియక ఆమె విస్తుపోయింది.

యింటిముందు కారు ఆగిన శబ్దం వినబడగానే టక్కున లేచి తుర్రుమని గడప దగ్గరికి పరిగెత్తినట్టుగా విసురుకెళ్లిందామె . యింట్లోంచీ ఆమె తల్లీ, తండ్రీ కూడా వరండాలోకి దూసుకెళ్లారు. కారులోంచీ దిగిన యువకుడూ, అతడికోసం వరండాలోకెళ్ళిన ముగ్గురూ కేరింతలు కొడుతూ పిల్లల్లా నవ్వుతున్నారు. వాళ్ళందరూ తెలుగే మాట్లాడుతున్నా జయంత్ కేమీ అర్థం కావడం లేదు.

కాసేపటి తరువాత చేతిలోవున్న పదార్థాన్ని ఆవురావురుమని తింటూ హాల్లోకొచ్చిన కావేరి టక్కున అక్కడే ఆగిపోయి, “సారీ! మిమ్మల్ని మరిసిపోయుండాము,” అని నాలుక్కరుచుకుంది. వెనక్కు తిరిగి, “నిన్న మన విలాకు బెంగుళూరునించీ తెలుంగు కొలీగ్ వచ్చినట్టు చెప్తిని కదన్నా! ఆయనే యిప్పుడు యింటికి వొచ్చిండారు,” అంటూ గడప దగ్గరికొచ్చిన యువకుడితో చెప్పింది.

“దండాలు సార్, దండాలు. నిన్న ఫంక్షనులో మిమ్మల్ని సరింగా రిసీవ్ చేసినోళ్ళం గాదు,” అని నొచ్చుకుంటూ కావేరి అన్నయ్య లోపలికొచ్చాడు. అతడిలో కావేరి పోలికల్ని వెతుకుతూ,బిక్కమొహమేసుకుని, కరచాలనం చేసాడు జయంత్.

“రేత్రికి డిన్నరుకు కయినా పిలవమని మా చెల్లికి నిన్ననే చెప్పుండాను. ఆ యమ్మి మద్యానం లంచ్ కే పిలిసేసుండాది. నాకు అర్జంటుగా ఈరోడ్ పొయ్యే అగిత్యం పడింది. పొద్దన్నే పొయ్యి యిప్పుడే వచ్చుండాను ,” అన్నాడతను చేతిలోని కొత్త పత్రికల్ని టీపాయ్ పైన పెడుతూ.

“నువ్వు ముందుగా తానం జేసి రాబో అన్నా! జయంత్ గారికీ లోపల నీ పుస్తకాల్ని చూపిస్తాను,” అంటూ కావేరి వంటగదిలో కెళ్లింది . అక్కడ కబుర్లు చెప్పుకుంటున్న తల్లి తండ్రులా మెనేదో అడిగారు. ఆమె సమాధానమేదో చెబుతూనే బయటికొచ్చింది.

తీపి పదార్థమున్న పింగాణీ గిన్నెను జయంత్ ముందుంచి, “ దీనికోసరమే మా అన్న ఈరోడ్కు పోయింది. అధిరజం అంటారు.తినిసూడండి,” అంది.

జయంత్ ప్లేటును చేతికి తీసుకుని, “అధిరజం గాదు. అత్తిరసం . మావాళ్లు నిప్పట్లనీ, కజ్జాలనీ, అరిసెలని కూడా అంటారు,” అని ఆమెను సరిచేసాక, “వీటికోసం అంతదూరం వెళ్ళాలా? యీవూర్లో దొరకవా?” అని అడిగాడు అయోమయంగా చూస్తూ.

“అవి మా అవ్వ, అంటే మా అమ్మకు అమ్మ చేసినేటివి. అవ్వి ఈరోడ్డులో మాత్రమే మా అవ్వగారింటిలోనే దొరకతాయి,” అని కావేరి చిరునవ్వు నవ్వింది. “యీ పొద్దు మా అమ్మ బర్త్ డే! మా అవ్వకు తొంబై యేండ్లు. యిల్లిడిసిపెట్టి యాడికీ రాను మాలదు. మా అమ్మకు నడుము నొప్పి. కూసోని జర్నీలు జెయ్యబాకని డాక్టరు గెట్టిగా చెప్పుండాడు. పుట్టినదినం నాడు వాళ్ళమ్మ చేసిండే తీపు తినినాంకే మా అమ్మ యెంగిలి పడితింది. యీడ కూంతురు తినిందని చెప్పినాకే మా అవ్వ అక్కడ శాంతం అవతాది. మా అన్నకు యట్లనో రొంత బిడువు దొరికూడిసింది. మాకు కడుపులో పాలు బోసినట్టయింది,” అందామె.

రెండు నిముషాలాగాక, “మొదుట్నుంచీ యిట్లనే! మా అవ్వ మా నాయనకు సొంతం మేనత్త. ఆమెకు మా

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

నాయనంటే చానా బ్రమో, కూతురంటే చానా బ్రమో చెప్పేకు మాలదు. చింతాకుకూరో, చేపలకూరో చేసుండా రమ్మని అంటే సాలు, యిలుదీర్ధం మాదిరిగా అందుర్నీ కారెక్కించేస్తావుండేటోడు మా నాయిన. పోను నూరు,రాను నూరు, మొత్తం యిన్నూరు మైళ్ళు. అయితే ఈరోడ్డు మాత్రం మాకు పక్కింటికంటే దగ్గిరగానే అగుపడతాది. మా అవ్వ కూర జేసినప్పుడు పిలిస్తిందో, చూడాలనుకున్నప్పుడు కూర జేస్తిందో చెప్పేకి మాలదు. అవుతే మా అవ్వ చేసిండే కూర రుసి యింగే సేతికీ అబ్బదు," అంది. మరో నిముషం ఆగాక, "టైము, డిస్టెన్స్, డబ్బూ , అన్నీ రిలెటివ్ విషయాలే గదా! సులభంగా దొరికితే దాని వాల్యూ తెలవదు. పొంగొట్టుకున్నాంకే , దూరం అయినాంకే తెలుస్తాది " అని వులిక్కిపడి అతడికేసి జాలిగా చూసింది. తరువాత "రిలెటివ్ అనే మాటను తెలుంగులో యేమంటారో నాకు తెలవదు," అని బాధ పడిపోయింది.



"అప్పుడక్కడ 'పుదు మయిల్' అనే తమిళ వారపత్రిక గోల్డెన్ జూబ్లీ జరుగుతోంది. కావేరి తండ్రే దాని సంస్థాపకుడూ, సంపాదకుడూ. ఆ సందర్భంలో ప్రత్యేక సంచికలూ, సావనీర్లూ ఆవిష్కరించబోతున్నారు. కావేరి కంటే నాలుగేండ్లు పెద్దవాడైన ఆమె అన్న, యింజినీరింగులో మాస్టర్ డిగ్రీ చేసినవాడు, వుద్యోగం మానేసి మూడేళ్ళ క్రితం పుస్తకాల పబ్లిషింగ్ మొదలుపెట్టాడు. అతను వేసిన పుస్తకాలు కూడా కొన్ని అక్కడ ఆవిష్కరించబోతున్నారు."

జయంత్ వెలాతెలా పోతూ పక్కకు తిరిగి టీపాయ్ పైని పత్రిక తీసుకుని ముఖం దాచుకో జూశాడు.

సోఫాలో కొచ్చి కూర్చున్న కావేరితండ్రి జయంత్ చేతిలోంచీ పత్రికను చొరవగా తీసుకుని , పేజీలు తిప్పి చూపెడుతూ "యీ పుదు ఇష్యూలో మా కావేరి ఆర్టికల్ పడింది," అన్నాడు.

తాను చదవలేని తమిళ అక్షరాలమధ్యలోని ఫొటోల్ని చూసాక, " యిది పొన్నియన్ సెల్వన్ సినిమా. తెలుగు డబ్బింగ్ చూసాను," అంటూ జయంత్ పెదవి విరిచాడు.

"పొన్నియన్ సెల్వన్ అనేది రాజరాజ చోళన్ కు యింకో పేరు. ఆయిన మనమడే రాజరాజ నరేంద్రుడు. ఆయనెవురో మీంకు తెరియుమ్ దానే!" అని అడిగాడాయన.

"తెలుసు. రాజమహేంద్రవరం రాజు. మహాభారతం రాయించినవాడు," అన్నాడు జయంత్ బింకంగా.

"రాజమండ్రికి రాజయిన ఆ రాజు వాళ్ళ అవ్వగారింట్లో, అంటే మధురైలోనే పుట్టి వుండాల. అంటే ఆ కథ అరవలది మాత్రమే గాదు. తెలుంగుది గూడా! ఆ కథంతా వాళ్ళదే అని అరవవాండ్లు సొంతం జేసుకునేసినారు. అరవోళ్లతో పోటీబడి మీరూ సినిమాలు జూసేటోళ్లు గాదా! మీ రాజరాజనరేంద్రుడు వాళ్ళ అమ్మతో యే బాషలో మాట్లాడి వుండాలనే సందేగం మీంకు రాలేదా ?"

సమాధానం తెలియకపోవడంతో జయంత్ బిక్కమొహం పెట్టాడు.

"యీ ఆర్టికల్లో ఆమాటే రాసి నా కూంతురు అరవోళ్లతోగూడా వుత్తరాది తెలుగోళ్ళను బండకేసి వుతికూడ్సింది," అన్నాడా పెద్దాయన నవ్వుతూ.

"నాకు తెలుంగులో రాసేది రాదు. వాండ్లకు తమిళం చదివేది రాదు," అని వాపోయింది కావేరి.

"అయినా ఆ జరింగి పోయిన కథలన్నీ యిబ్బుడు యాలలే అమ్మణ్ణీ! వాళ్ళ పెద్దోళ్ళకే కాబట్టలేదు. పాంపం, యీ సన్న పిల్లోడ్ని పట్టి జాడిస్తే యేమి జరగతాది? యిబ్బుడు గూడా యీ అరవ రాష్ట్రంలో ముగ్గురిలో వొగరు యిండ్లలో తెలుంగే పేసాద తారని ఆ రొండు స్టేట్లకు తెలుసునా యేమి? లోకం యిట్టానే జరిగితే మన అమ్మ భాషకు మనము యింకా దూరం అయిపోతామేమో అని బయింగా వుండలా ?" అన్నాడాయిన వణుకుతున్న గొంతుతో .

" అమ్మబాష పోతే అన్నీ పోతాయంటారుగదా నాయినా! కానీ మనకు మిగిలుండేవి ఆ వుత్తరాది తెలుంగు వాళ్ళకు లేవు," అంది కావేరి జయంత్ కేసి కొరకొరా చూస్తూ.

"లెస్సగా చెప్తివి అమ్మణ్ణీ !" అన్నాక ఆయన జయంత్ కేసి చూసి పెదవులు చిట్లించి నవ్వి, " మా తెలుంగు మీకు అంతగా పురియదులే బిడ్డా! మా బాష వెయ్యేండ్లకు ముందర్నే నిలబడిపోయింది. మాది పాది తెలుంగు. అదిగూడా పొంత తెలుంగు " అన్నాడు.

లెస్స అనే ఆ పాతమాటను తానెక్కడ విన్నాడో గుర్తు తెచ్చుకోలేక జయంత్ విలవిలలాడ సాగాడు.



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# ఆమె లేని వీధి

- ప్రసేన్




జీవితంలో కొన్ని అనుభవాలు అంతుచిక్కడం లేదనుకుంటాం కానీ అవి ఆలస్యంగా అర్థమవుతాయి అంతే. ఒక మనిషిని అర్థం చేసుకోవడానికీ, ఒక అనుభవాన్ని అర్థం చేసుకోవడానికీ చాలా తేడా ఉంటుందని నాకు ఒక విషాద సంఘటన నేర్పింది.

ఆ తెలివిడికి ఆమె కారణం కావచ్చు.

నేను మొదట ఆమెను చూసింది కొత్త బజారు సెంటర్లో.

నగరంలోని ప్రతి వీధికీ, ప్రతి వివాదానికీ, ప్రతి ముఖానికీ, ప్రతి పుకారుకీ నాకూ ఎంతో కొంత సంబంధం ఉంటుంది.

నేను జర్నలిస్టుని. అది నగరంలోని మర్యాదస్తులు పగటిపూట కూడా పేరెత్తడానికి ఇష్టపడని ప్రాంతం.

చిన్న హోటళ్లు, వైన్ షాపులు, పాన్ డబ్బాలు, పాడుబడ్డ భవనాలు, నిద్రలేని కుక్కలు, నిరాశగా తిరిగే మనుషులు ఉండే ప్రాంతం.

నేను అక్కడికి వెళ్లేది సమాచారం కోసం, వార్తల కోసం. ఎప్పుడు వెళ్లినా ఆ ప్రాంతం నన్ను నిరాశ పరచలేదు. కచ్చితంగా ఏదో ఒక వార్త దొరికేది.

ఆమెది ఆ వీధికి అసలేమాత్రం సరిపడని అందం. ఆమెలాంటి వాళ్లు ఆ వీధిలో చాలామంది ఉంటారు కానీ ఆమెలా ఎవరూ ఉండరు.

తెల్లటి దేహం. నల్లటి జుట్టు. పొందికైన శరీరం. నూలు చీరకు కూడా పట్టుచీర అందం తెచ్చిపెట్టే సౌష్ఠవం.

ఆమెను అందరూ రాణి అని పిలిచేవారు!

అది ఆమె అసలు పేరు కాకపోవచ్చు. నిజానికి ఆ ప్రాంతంలో పేర్లే ఉండవు ఎవరికీ. అసలు పేర్ల అవసరమే ఎవరికీ ఉండదు. నేను ఆ వీధిలో ఎక్కడ ఆగి ఏం చేస్తున్నా, ఎవరితో మాట్లాడుతున్నా ఆమె నన్ను గమనిస్తున్నట్టు నాకనిపించేది.

మొదట్లో ఆమెను నేను పట్టించుకోలేదు.

"సార్... పేపర్లో ఏ నెత్తురు చిందిస్తున్నారు?" అని ఒకరోజు, "సార్... ఇవాళ ఎవరి గుడ్డలూడదీస్తున్నారు?" అని ఇంకో రోజు ...

ఇలా ఏదో ఒకటి నన్ను అంటూ ఉండేది. నేను నిర్లిప్తంగా చూసేవాడిని. ఆ తర్వాత మెలమెల్లగా అది అలవాటైంది. నేను కనిపిస్తే ఆమె ఏదో ఒకటి కొంటెగా అనేది.

"అంత సీరియస్‌గా ఉండకండి సార్."

"నవ్వితే ఒకరోజు జీతం కట్ చేస్తారా ఏంటి?"

"మీరు నన్ను చూస్తారు. కానీ చూడనట్టు నటిస్తారు."

గుసగుసగా అనే ఆమె మాటల్లో అల్లరి ఉండేది.

ఓ వర్షం పడుతున్న సాయంత్రం.

కొత్త బజారు వీధులు తడిసి మెరుస్తున్నాయి. దుకాణాల షెడ్ల కిందకు జనం చేరారు. నేనొక పాన్ డబ్బా పక్కన నిలబడి వర్షం తగ్గడంకోసం చూస్తున్నాను.

ఆమె ఎక్కడినుంచో పరుగెత్తుకుంటూ వచ్చింది.

"సార్... ఈరోజు ప్రపంచాన్ని కాపాడటానికి సెలవా?" అంది.

నేను విననట్టు నటించినా.. నవ్వేశాను.

ఆమె ఒక్కసారిగా ఆశ్చర్యపోయినట్టు నటిస్తూ "అరే... మీరు నవ్వుతారా?" అంది.

నా ప్రమేయం లేకుండా మళ్లీ నవ్వొచ్చింది.

"చాలా ప్రమాదకరం సార్. మీరు నవ్వితే జర్నలిస్టులా కాక మనిషిలా కనిపిస్తున్నారు."

మళ్లీ నవ్వింది.

తన మాటలకీ తను సంచరిస్తున్న వాతావరణానికీ మధ్య చాలా ఎడం ఉన్నట్టు నాకనిపించేది. బాగా చదువుకుని ఉండాలి. కనీసం లోకాన్ని!

ఆ వానలో తన పక్కన నిలబడ్డ ఓ పిల్లవాడు బజ్జీల వైపు ఆశగా చూడడం గమనించి, బజ్జీలు కొని వాడికి ఇచ్చింది. ఆ ఆనందంలో పిల్లవాడు ఆమె చేతిని పట్టుకుని ప్రేమగా అక్కా అని పిలవగానే ఆ ముఖం ఒక్కసారిగా వెలిగిపోయింది.

ఆ నవ్వు వెనుక ఇంకో మనిషి ఉన్నట్టనిపించింది.

అటువంటి ఆత్మీయ పిలుపును తరచూ వినే మనిషిగా ఆమె నాకు అనిపించలేదు. తరచూ వినాలని ఆశించే మనిషిగా అనిపించింది.

నేను మొదటిసారి ఆమెను కొంచెం ఎక్కువసేపు చూశాను. పైకి నవ్వుతూ ఉన్నా లోతుగా చూస్తే ఏదో దుఃఖాన్ని దాచుకున్నట్టు కనిపించే పెదాలు. పైకి మెరుస్తున్నా లోపల నల్లమబ్బులను అదిమిపెడుతున్నట్టుండే కళ్లు.

"ఏమిటి అలా చూస్తున్నారు?" అంది.

తడబడుతూ చూపు తిప్పుకున్నాను.

"మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటుంటారు కదూ" అంటూ తడుస్తూ వర్షంలో కలిసిపోయింది.

ఆమె నన్ను సెడ్యూస్ చేస్తోందని నాకు తెలుస్తోంది. ఒకసారైతే మరీ దగ్గరగా వచ్చి చెవిలో చెప్పినట్టే "మీ దగ్గర డబ్బులు తీసుకోనులెండి సార్" అంది.

తను నన్ను ఇష్టపడుతోందని తెలుస్తోంది. కానీ ఎందుకు అనేది మాత్రం అర్థం కావడం లేదు. నా పిచ్చి కానీ ఆమె చెబితే తప్ప ఎలా తెలుస్తుంది. నేను అడిగితే తను చెపుతుందేమో కానీ నేను అడగలేను. ఆమె మాట్లాడిన ప్రతిసారీ నేను నా కంగారుని బయటకు కనపడనిచ్చేవాడిని కాదు. కొంచెం అతి జాగ్రత్తగా కూడా ఉండేవాడిని.

ఆ ప్రాంతంలో నాకో ఇమేజ్ ఉంది. ఒక జర్నలిస్ట్‌గా నేను సంపాదించుకున్న గౌరవం, నమ్మకం, వాటి మీద మచ్చ పడుతుందేమోననే భయం.

నాకు కనీసం ఆమెకు సమాధానం చెప్పాలన్నా భయమేసేది. కానీ మరోవైపు నేను ఆమెను చూడకుండా ఉండలేకపోయేవాడిని.

తను నడుస్తుంటే నా కళ్ళు వెనకే వెళ్లేవి. తను నవ్వితే ఆ నవ్వు ఆ రోజు మొత్తం నన్ను వెంటాడేది. నేను ఆమె పట్ల ఆకర్షితుడనవుతున్నాను అని కూడా నాకు తెలుస్తోంది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఈ వారం కథ

మరోసారి అర్థరాత్రి కొత్త బజారుకు వెళ్లాల్సి వచ్చింది.

ఒక గొడవ వార్త కోసం.

పోలీసులు, జనం, అరుపులు.

ఆ గందరగోళం మధ్య ఆమె రోడ్డు పక్కన కూర్చుని ఉంది.

సాధారణంగా కనిపించే ఆ చిలిపి నవ్వు లేదు.

నేను పని ముగించుకుని వెళ్లిపోతుంటే పిలిచింది.

"సార్."

మొదటిసారి ఆమెకు కొంత దగ్గరగా ఆగాను.

"మీకు ఎప్పుడైనా ఎక్కడికైనా పారిపోవాలనిపించిందా?" అడిగింది.

ఆ ప్రశ్న ఊహించనిది.

నేనేమీ మాట్లాడకుండా మౌనంగా చూస్తుండిపోయాను.

"ఎక్కడికైనా... మనల్ని ఎవరూ గుర్తుపట్టని చోటికి."

నేను సమాధానం చెప్పలేదు.

అది సందర్భమో.. అసందర్భమో అర్థం కాలేదు.

ఆమె కూడా మళ్లీ అడగలేదు.

"సరే సార్. మీరు వెళ్లండి. మీ వార్తలు కుళ్లిపోతాయి" నవ్వింది.

కానీ ఆ నవ్వు ఈసారి పెదాల మీద మాత్రమే ఉంది.

కళ్లలో లేదు.

ఆ రాత్రంతా ఆ ప్రశ్న నన్ను వెంటాడింది.

అలా ఆరు నెలలు గడిచిపోయాయి.

ఒకరోజు కొత్త బజారులో ఆమె ఎప్పుడూ కనిపించే చోట కనిపించలేదు. ఆరోజు రాలేదేమో అనుకున్నాను.

'ఎక్కడికో వెళ్లి ఉంటుంది' అనుకున్నాను.

మరుసటి రోజు కూడా లేదు.

వారం రోజుల తర్వాత కూడా లేదు.

ఆ తర్వాత నెల గడిచింది.

ఆమె లేదు.

కనపడలేదు.

తను కనపడకపోవడం వల్ల కావచ్చు అక్కడికి తరచూ వెళ్లాను. ఆ తర్వాత నాకు ఆ వెతుకులాట ఒక అలవాటయింది.

ఆమె ప్రతీసారీ లేదు. ఆ ప్రాంతంలోకి అడుగుపెట్టగానే నా కళ్ళు వెతికేది ఆమెనే. మొదట ఆమెను వెతికాను.

తర్వాత ఆమె ఉండే ఖాళీలలో వెతికాను.

ఆ తర్వాత ఆమెకు సంబంధించిన గుర్తులను, తర్వాత ఆమె లేనితనాన్ని కూడా వెతికాను.

కొన్నిసార్లు మనిషి ఉన్నా లేకపోయినా గైర్హాజరీ మాత్రం చాలా స్పష్టంగా తెలుస్తుంటుంది.

ఆమె నిలబడే మూల శూన్యంగా కనిపించేది.

ఆమె నవ్వు వినిపించే చోట నిశ్శబ్దం బరువుగా వినిపించేది.

టీ దుకాణంలో కూర్చుంటే ఎప్పుడో ఆమె విసుర్లు గుర్తొచ్చేవి.

కొన్నిసార్లు ...

వీధి చివర ఎవరో ఆమెలా కనిపిస్తే ఒక్కసారిగా గుండె వేగంగా కొట్టుకునేది.

దగ్గరకు వచ్చాక ఆమె కాదని తెలిశాక ఏదో మోత బరువు పెరిగినట్టనిపించేది.

టీ దుకాణం దగ్గర...

పాన్ షాపు పక్కన... వీధి మూలలో...

పాడుబడ్డ భవనం మెట్ల మీద...

ఎక్కడా లేదు!

ఆ వెతుకులాటలో నాకు నా గురించిన ఒక వింత నిజం అర్థమైంది. ఆమె నన్ను ఆటపట్టిస్తూ వెంటపడుతున్నపుడు తప్పించుకునేవాడిని. ఆమె కనపడనప్పుడు ఆమెను వెతుకుతున్నాను.

మనిషి కోరికలకు కూడా ఒక చీకటి నైతికత ఉంటుందేమో! బయటపడకపోతే ఏదైనా నైతికమే. ఆమె పట్ల నాకు ఒక మోహం ఉందనీ ఆమె కనపడనివేళ ఆ మోహతీవ్రత ఎక్కువవుతోందనీ నాకు అర్థం అవుతోంది. నేను, ఆమె గురించి ఎవరినీ అడగలేకపోయాను.

అడగలేను... 'రాణి ఎక్కడ?' అని!

అడిగితే ఎవరో ఏదో అనుకుంటారన్న సామాజిక భయం.

నా ఫాల్స్ ఇమేజ్ నన్ను కట్టేసింది.

• • •

ఒక సంవత్సరం గడిచిపోయింది.

ఆ సంవత్సరమంతా నేను ఆమెను వెతుకుతూనే ఉన్నాను. ఆ ప్రాంతానికి వెళ్లిన ప్రతీసారి, ఆమెను వెతకడానికి ఏదో పని సాకుతో వెళ్లిన ప్రతీసారి, ఆమెతో ఒక సాయంత్రం గడిపితే ఎలా ఉండేదో ఊహించుకున్నాను.

ఒకసారి మాట్లాడి ఉంటే?

కలిసి ఒక చాయ్ తాగి ఉంటే?

ఒకసారి నా కోరికకు నేను లొంగిపోయి ఉంటే?

అలాంటి ఊహలతోనే తిరిగాను.

కలిస్తే ఆమెతో ఒక పూట లేదూ.. ఒక గంటైనా గడపాలనే నిర్ణయానికి ఏనాడో వచ్చాను.

ఈ వెతుకులాట అదే కామోసు!

బహుశా నేను వెతుకుతోంది ఆమెను కాదేమో కూడా, నా అసంపూర్ణ కోరికను కావచ్చు. ఆ కోరికను రహస్యంగా సంపూర్ణం చేసుకోవడానికి కావచ్చు.

చాలా కామోసులు! బోలెడన్ని ఏమోలు!

ఒక మధ్యాహ్నం...

ఆ ప్రాంతంలోని పాత టీ దుకాణం దగ్గర కూర్చున్నాను.

అక్కడే ఉన్న ఓ మధ్యవయస్కురాలు నన్ను చూసి కొంత ఇబ్బందికరంగా నవ్వి "మీరు పేపర్ సార్ కదా?" అంది.

అవునన్నట్టుగానూ కాదన్నట్టుగానూ చూశాను.

"రాణి కోసం చూస్తున్నారా? రాణి మిమ్మల్ని అలానే తలుచుకునేది. పేపర్ సార్ అని. దానికి మీ పేరు తెలియదు."

"లేదు, లేదు నేను ఎవరికోసమూ చూడడం లేదు" కంగారును దాచుకున్నాను.

అయినా నా ముఖం ఏదో చెప్పేసిందేమోనని భయపడుతూ "ఎందుకలా అడిగారు" అన్నాను.

ఆమె సన్నగా నవ్వి నా అబద్ధాన్ని పట్టేసినట్టు "ఎంతకాలంగా చూస్తున్నారు?" అంది.

నేను సమాధానం చెప్పలేదు.

ఏం చెప్పగలను?!

"రాణికి మీరంటే ఇష్టం, ఎప్పుడూ మీ గురించి చెపుతుండేది."

మళ్లీ తనే అంది.

"తను చనిపోయి ఏడాది అయింది."

నాకేమీ అర్థం కాలేదు. వయసులో ఉన్న మనిషి. బలంగా ఉన్న మనిషి. పైగా ఉత్సాహంగా ఉండే మనిషి. అలా ఎలా...!

నా లోపల అంతా ఒక్కసారిగా ఖాళీ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సాప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



అయిపోయిన వెలితి.

"ఏ.. ఏ.. ఏం...?" అన్నాను అనీ అననట్టు.

"జ్వరం వచ్చింది. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే పోయింది."

వీధిలో ట్రాఫిక్ శబ్దం వినిపిస్తోంది.

టీ దుకాణంలో పాత హిందీ పాట మోగుతోంది.

జనం మాట్లాడుతున్నారు. కానీ ఆ క్షణంలో ఏ శబ్దమూ నా చెవులకు చేరలేదు.

"ఏడాదైందా?" అడిగాను.

"అవును. చివరి రోజు నేను పక్కనే ఉన్నాను."

తల దించుకున్నాను. ఆమె ఇంకేదో చెబుతోంది. నాకు వినపడడం లేదు. ఎందుకంటే నా లోపల ఒక ఆందోళన. గత ఏడాదంతా నేను ఆమెను వెతికిన ప్రతి రోజు, ఆమె గురించి ఊహించిన ప్రతి రాత్రి, ఆమెతో గడపాలని అనుకున్న ప్రతి క్షణం, ఆమె ఈ ప్రపంచంలోనే లేదు. నేను వెతికింది ఒక ప్రాణమున్న స్త్రీని కాదా.. మరణం నీడనా.

నేను ఊహించుకుంది ఒక లేని దేహాన్నా?

అవునా... అవుననుకోవడం నాకే ఇబ్బందిగా అనిపించింది.

ఆమె గురించి నాకు తెలిసింది ఏమిటి? ఆమె అందం. ఆమె శరీరం. ఆమె నన్ను ఫ్లర్ట్ చేయడం. అంతే!

ఆమె నవ్వు వెనుక దాగిన బాధ ఏమిటో నాకు తెలియదు. ఆమె నన్ను ఆట పట్టించడం ఎందుకో నాకు తెలియదు. ఆమె భయాలేమిటో తెలియదు. ఆమె కలలేమిటో కూడా తెలియదు. ఆమె మనిషిగా నాకు ఎప్పుడూ అనిపించలేదు. ఒక కోరికగా మాత్రమే కనిపించింది.

నేను ఏడాది పాటు వెతికింది ఒక మనిషిని కాదు. నా మనసు సృష్టించుకున్న ఒక వాంఛని, ఒక వ్యామోహాన్ని.

అది అర్థమయ్యాక నా మీద నాకు కోపమొచ్చింది. అసహ్యమేసింది. జీవితంలో మొదటిసారి నన్ను నేను చిన్నచూపు చూసుకున్నాను .

ఆ రోజు సాయంత్రం ఇంటికి వెళ్లలేదు. రోడ్లు పట్టుకు తిరిగాను. రాత్రి పన్నెండు దాటాక ఆ వీధికి మళ్లీ వచ్చాను.

చాలాసేపు ఆ వీధంతా కలియ తిరిగాను.

ఆమె నిలబడే మూల చీకటిగా ఉంది. ఆమె నన్ను ఎటకరించే చోట్లన్నీ బోలు ధ్వనితో వినిపించాయి.

ఆ వీధి ప్రతి మలుపులో ఏదో ఒక జ్ఞాపకం వెంటాడుతూనే ఉంది.

ఆమె కనపడనప్పటి వెతుకులాటలో శూన్యానికీ, ఆమె చనిపోయిందని తెలిసినప్పటి శూన్యానికీ మధ్య ఉన్న తేడా స్పష్టంగా తెలుస్తోంది. ఆమెకు నేనంటే ఎందుకు ఇష్టమో తెలియదు.

ఆమెతో నాకు ప్రేమ లేదు.

సంబంధం లేదు.

స్నేహం లేదు.

ఒక్క సంభాషణ కూడా లేదు.

అయినా ఆమె మరణం నన్ను కుదిపేస్తోంది.

ఎందుకంటే ఆమె మరణం... ఒక దేహం మరణం కాదు.

నేను ఎప్పటికీ తెలుసుకోలేని ఒక సమాధాన మరణం.

కొన్ని మరణాలు అనుభవాలను చంపుతాయి.

ఆమె మరణం కూడా అలాంటిదే కావచ్చు.

**ఆ పిలుపు ఆమెను ఏదో కొత్త లోకాలకు తీసుకువెళ్లినట్టుంది. అటువంటి ఆత్మీయ పిలుపులు ఇంకా కొన్ని వినాలని ఆమె తపన పడుతోందని ఆ చూపు చెపుతోంది. ఆమె గురించి నాకు అర్థమైన మొదటి నిజం అదే. ఆమె ఎవరికో అక్క. ఎవరికో చెల్లి, ఎవరికో కూతురు, ఎవరికో ప్రియురాలు కావాలనుకుంటోంది.**

ఆమెతో మాట్లాడే అనుభవం,

ఆమె అసలు పేరు తెలుసుకునే అవకాశం,

ఆమె ఎందుకు నవ్వేదో తెలుసుకునే అవకాశం, ఆమె ఎందుకు బాధపడేదో తెలుసుకునే అవకాశం, అన్నీ ఒకేసారి చనిపోయాయి.

ఆమె కనపడనపుడు నాకు కలిగిన నిరాశ బహుశా మనిషిది కాదు. వ్యసనపరుడిది.

నేను ఆమెను కాదు, ఆమె దొరికే అవకాశాన్ని వెతికానేమో.

నేను కోల్పోయింది నాదైన మనిషిని కాదు. నేను ఎప్పుడూ పొందని మనిషిని.

ఆమె చనిపోయిందని తెలిశాక నాకెందుకో ఆ రోజు సాయంత్రం ఆ పిల్లవాడు అక్కా అని పిలిచినప్పటి ఆమె చూపు గుర్తొచ్చింది.

"మనల్ని ఎవరూ గుర్తుపట్టని చోటికి మీకు ఎప్పుడైనా ఎక్కడికైనా పారిపోవాలనిపించిందా?" అని ఆమె ఆ రోజు అడిగిన ప్రశ్న కూడా గుర్తొచ్చింది. ఆ పిల్లవాడి "అక్కా" అన్న పిలుపును తను పదే పదే వినాలనుకుంటోందన్న అర్థాన్ని ఆ చూపు చెబుతోంది.

ఆ పిలుపు ఆమెను ఏదో కొత్త లోకాలకు తీసుకువెళ్లినట్టుంది. అటువంటి ఆత్మీయ పిలుపులు ఇంకా కొన్ని వినాలని ఆమె తపన పడుతోందని ఆ చూపు చెపుతోంది. ఆమె గురించి నాకు అర్థమైన మొదటి నిజం అదే.

ఆమె ఎవరికో అక్క.

ఎవరికో చెల్లి, ఎవరికో కూతురు, ఎవరికో ప్రియురాలు కావాలనుకుంటోంది.

ఆ కళ్లలో దుఃఖం, ఆ పెదవుల వెనుక బాధ బహుశా అదే అయ్యుంటుంది. నాకు ఆమె ప్రశ్న. ఆమె చనిపోయాక కొత్తగా అర్థం అయిందనుకుంటా.

మనిషి చనిపోయిన తర్వాత ఆ మనిషిని కోల్పోయామని తెలుసుకోవడం ఒక దుఃఖం. కానీ ఆ మనిషి బతికున్నప్పుడు ఆ మనిషి హృదయంలోకి చూడలేకపోయామని ఆలస్యంగా తెలుసుకోవడం ఇంకా పెద్ద దుఃఖం.

ఇప్పుడు ఆలోచిస్తే ...

బహుశా ఆమె తన గురించి చెబుతూ ఉండి ఉండవచ్చు.

నేను వినలేదు.

నిజంగా నేను ఆమెను కోల్పోయింది ఆమె చనిపోయిన రోజు కాదు.

ఆమె నా ముందే నిలబడి ఉన్న రోజు, ఆమె నాతో మాట్లాడాలని ప్రయత్నించిన క్షణం, ఆమె "మీరు నన్ను చూస్తారు కానీ చూడనట్టు నటిస్తారు" అన్న రోజే ఆమెను కోల్పోయాను.

ఆ రోజు నేను నిజంగా చూసి ఉంటే... కథ వేరేలా ఉండేదా? ఏమో.

చాలాసేపు అక్కడే నిలబడ్డాను. మొదటిసారి ఆమెను కోరికగా కాదు. పశ్చాత్తాపంగా కాదు. ఒక మనిషిగా గుర్తు చేసుకున్నాను.

ఆ సాయంత్రం నాకో పాఠం నేర్పింది. పాపం అంటే మనం చేసింది మాత్రమే కాదు, చేయలేక చేయకుండా వదిలేసింది కూడా పాపమే అని. ఒక మనిషిని మనిషిగా చూడకపోవడం కూడా అలాంటి పాపమే అని.

ఆమె లేని ఆ వీధిలో నిలబడి, నేను మొదటిసారి ఆమె కోసం కాదు, ఆమెను ఎప్పుడూ తెలుసుకోలేకపోయిన నా కోసం ఏడ్చాను. బిగ్గరగా, భోరున.

ఏడ్చేపుడు చుట్టూ ఎవరన్నా ఉన్నారా అని చూడలేదు. ఆమె ముందు నా ఫాల్స్ ఇమేజ్ ఓడిపోయింది.

బహుశా కొందరు మరణించరు.

వాళ్ల గురించి మనం తెలుసుకోకుండా వదిలేసిన ప్రశ్నలుగా మిగిలి జీవిస్తారు.

మెలమెల్లగా కొత్త బజారుకు వెళ్లాలనే నా జ్ఞాపకాన్ని అధిగమించాను.

ఇప్పుడు నేను ఆ వీధికి వెళ్లడం లేదు.

ఆమె లేని వీధి నాలోనే ఉంది.

70133 58154

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథ



# 'రా'.. బంధువు

బి. సుజిన్ కుమార్

'మూగజీవుల మనుగడ–మన బాధ్యత' అంశంగా జిల్లాస్థాయిలో వివిధ రకాల పోటీలు జరుగుతున్నాయి. ఎంతోమంది పిల్లలు హాజరయ్యారు. ఉపన్యాసాల విభాగంలో..

'వినయ్, బైపీసీ సెకండ్ ఇయర్, సాంఘిక సంక్షేమ కళాశాల, నర్సంపేట, వరంగల్' అన్న పిలుపుకి.. వినయ్ ఉత్సాహంతో సైన్స్ మాస్టారు వైపు చూశాడు. 'బెస్ట్ ఆఫ్ లక్' అని భుజం తట్టి.. అతనిలో మరింత విశ్వాసం నింపాడు మాస్టారు.

వయసులో చిన్నవాడైనా వయసుకు మించి ఆలోచించే తత్వం వినయ్‌ది. అతను అడిగే కొన్ని ప్రశ్నలకు ఉపాధ్యాయులు కూడా ఆశ్చర్యపోవడంలో అతిశయోక్తి లేదు. తనే క్లాస్ ఫస్ట్. అందుచేత మాస్టారు పట్టుబట్టి, వారం రోజులుగా కష్టపడి అతన్ని పోటీకి సిద్ధం చేశాడు.

వినయ్ మైక్ పట్టుకుని సభకి నమస్కరించి,

''సమస్త జీవరాశుల్లో మనిషి తెలివైనవాడు. అన్నిటిపైనా ఆధిపత్యాన్ని చెలాయిస్తూ చివరికి ఇతర ప్రాణుల జీవించే హక్కును హరిస్తున్నాడు. మనిషి చేస్తున్న తప్పుల భారాన్ని మూగజీవాలు మౌనంగా మోస్తున్నాయి!'' అని మొదలుపెట్టి, సాధ్యమైనన్ని విషయాలను వివరించాడు. అతని మాటల్లో జీవుల మీద తనకున్న ప్రేమ కనిపిస్తోంది. న్యాయనిర్ణేతలు కన్నార్పకుండా వింటున్నారు.

''పుట్టిన ప్రతి జీవీ మరణించి మట్టిలో కలిసిపోవాల్సిందే. ఆఖరికి మనల్ని కన్నవారైనా, మనం కన్నవారైనా సరే.. మరణిస్తే ఇంట్లో పెట్టుకుని పూజించలేం. ఎందుకనీ? దేహం క్రమంగా క్షీణించి కుళ్లిపోయి దుర్గంధాన్నిస్తుంది కాబట్టి. తర్వాత రోగాలు వ్యాపిస్తాయి. మనిషి తెలివిగా శవాన్ని చెత్తలో పడేయకుండా శ్మశానంలో ఖననం చేస్తాడు. మరి మిగతా జీవుల సంగతేంటని ఎప్పుడైనా ఆలోచించామా? రోజుకి ఎన్ని ప్రాణులు తుదిశ్వాస విడుస్తున్నాయో లెక్కగడుతున్నామా? ఆ కళేబరాలను ఏ శ్మశానంలో, ఎవరు పూడ్చుతున్నారు? వ్యాధుల వ్యాప్తిని అరికట్టేదెవరు? వీటన్నిటికీ బదులుగా సృష్టి 'సహజ పారిశుధ్య కార్మికులను' నియమించింది. కుక్కలు, రాబందులు, కాకులు వంటి ప్రాణులు.. మృతదేహాలను ఆహారంగా చేసుకొని వ్యాధుల వ్యాప్తిని అరికడుతున్నాయి. అదే ప్రకృతి మనకిచ్చిన వరం. లేదంటే ఈ భూమి శవాల కుప్పలతో నిండి.. సమస్త ప్రాణులూ వ్యాధుల బారిన పడి అంతమయ్యేవి. కానీ, మనం వాటిని రక్షించకపోగా.. వాటికి హాని తలపెడుతున్నాం. ఉదాహరణకు రాబందు. దేశంలో రాబందుల సంఖ్య.. వాటి సమస్త జాతి అంతమయ్యేంత తీవ్రంగా తగ్గుతోంది. పశువుల చికిత్స కోసం విస్తృతంగా వాడిన డైక్లోఫెనాక్ అనే ఔషధం ఈ వినాశనానికి కారణం. ఈ మందు కలిసిన పశువుల మృతదేహాలను తిన్న రాబందులు తీవ్రమైన కిడ్నీ సమస్యలతో మరణిస్తున్నాయి. ఫలితంగా 97 శాతం కంటే ఎక్కువగా రాబందుల సంఖ్య తగ్గిపోయింది. ఇది కేవలం ఒక జాతి నాశనం కాదు, పర్యావరణ సంక్షోభానికి ఆరంభం. ఇలాంటి జీవులు అపశకునాలు కావు. జీవావరణ సమతుల్యతను కాపాడే ప్రాణులు. వాటిని అసహ్యంగా చూడొద్దు. మన ప్రేమ, ఆదరణ వాటికెంతో అవసరం. శ్రీరాముడంతటి వాడే, రెక్కలు తెగిపడ్డ జటాయువు అనే పక్షి రాజాన్ని గుండెలకు హత్తుకొని దుఃఖించాడు. ఆ కాలం సంగతి ఆ రాముడే ఎరుగు.. ఈ కాలంలో జటాయువు ఎగరకపోతే, మన భవిష్యత్తు ఎగరదు. పశుపక్ష్యాదులను రక్షించుకోవడం మనందరి బాధ్యత. ధన్యవాదాలు'' అని ఉపన్యాసం ముగించి.. పరుగు పరుగున మాస్టారు దగ్గరికెళ్లాడు.

ఆడిటోరియం చప్పట్లతో మారుమోగింది. కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుని, షేక్ హ్యాండ్ తీసుకొని, 'ఆల్ ది బెస్ట్' చెప్పించుకున్నాడు. అతని ఆనందానికి అవధుల్లేవు. మాస్టారు, వినయ్ కలిసి పావుగంటకు పైగా అందరి అభినందనలు అందుకొని, బయట పచ్చికపై నడిచారు.

కాసేపటికి ఇద్దరి మధ్య నిశ్శబ్దం అలుముకుంది. వినయ్ మౌనంలో పొంగుతున్న ప్రశ్నల వరద మాస్టారు మనసును తాకింది.

''ఆర్ యూ ఓకే వినయ్?'' అన్నాడు మాస్టారు.

''ఒక డౌట్ సార్..!'' కనుబొమ్మలు దగ్గరగా చేసి, మాస్టారు కళ్లల్లోకి సూటిగా చూసాడు.

మాస్టారు స్పందించేలోగా, మళ్లీ వినయ్..

''జటాయువు స్థానంలో నేనే ఉంటే, శ్రీరాముడు హత్తుకునేవాడా..? అదీ.. నన్ను?'' పసితనాన్ని ఒలకపోస్తూ ఆసక్తిగా అడిగాడు.

ఆ ప్రశ్నలోని లోతైన భావం అర్థంగాక నిర్ఘాంతపోయాడు మాస్టారు. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తికమకపడ్డాడు. కాసేపటికి తేరుకొని వినయ్ భుజం మీద చెయ్యేసి..

''తప్పకుండా అలానే చేసేవాడు వినయ్. దేవుడికి పక్షపాతం లేదు. పిల్లలంటే ఎంతో ఇష్టం! తెలివైనవాళ్లంటే మరీనూ!'' తల నిమిరాడు మాస్టారు.

కాలేజ్ బస్ హారన్ విన్న వినయ్ ఒక్క గెంతు గెంతాడు. మాస్టారు కూడా బైక్ తీశాడు. పరుగెత్తుతున్న వినయ్, మార్గమధ్యలోనే వెనుదిరిగి..

''సా.. ర్..! నేను రాబందును చూడాలి. టీవీలో కాదు. నిజంగా... ఈ కళ్లతో!'' చూపుడు వేలుతో తన కళ్లవైపు చూపిస్తూ వినపడేట్టు అన్నాడు.

మాస్టారు ఓ నవ్వు నవ్వి, 'సరే' అన్నట్టు తలూపి, వినయ్ కుతూహలానికి ముచ్చటపడ్డాడు.

* * *

దేశాయిపేట్, వరంగల్. వినయ్ హాస్టల్ నుంచి ఇంటికొచ్చి రెండు రోజులవుతోంది. సిటీలో మురికివాడల్లో, కిక్కిరిసిన ఇళ్ల మధ్య ఓ రేకుల ఇంట్లో నివాసం. తల్లి లచ్చమ్మ మున్సిపాలిటీ ఉద్యోగిని. కోడి కూడా నిద్రలేవని వేళకు లేచి, రోడ్లు శుభ్రం చేసి.. ఉదయం పది గంటలకు ఇంటిని చేరుకొని గిన్నెలన్నీ బయటేసి తోముతుంది. మంచం మీద కూర్చున్న తాత నర్సయ్య.. న్యూస్ పేపర్లో, కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న తన మనవడి ఫొటో చూస్తూ మురిసిపోతున్నాడు. ఆ పక్కనే చాప మీద దుప్పటి కప్పుకొని పడుకుంది వినయ్ చెల్లి లత.

''అడిగిన ప్రశ్నే మళ్లీ అడగకు తాతా! సఫాయినైతే కానులే!'' విసుక్కున్నాడు వినయ్.

''నేనెప్పుడు అడిగిన? నువ్వెప్పుడు జెప్పినవ్? పోనీ.. ఈ ఒక్కసారికి జెప్పు. యాదికి లేదురా!'' నిట్టూరుస్తూ కళ్లజోడు వెతుకుతున్నాడు నర్సయ్య..

వినయ్ వేగంగా వచ్చి, తాత ముందు కూర్చొని, చేతులు పట్టుకొని కళ్లలోకి చూస్తూ..

''చూడు తాతా! స్టెతస్కోపుతో నీ గుండె చప్పుడు వింటూ నీ కళ్లల్లో ఆనందం చూడాలనే రోజు కోసం ఎదురుచూస్తున్న. ఆ క్షణం, 'నువ్వెవరు..?' అని నన్ను అడగవ్ కదా!.. మ్మ్?'' అంటూ, తాత కళ్లకే ఉన్న కళ్లజోడు తీసి చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కళ్లజోడు చూస్తూ ఆశ్చర్యానికి లోనయ్యాడు నర్సయ్య.

''పెద్ద రోగమా..?'' భయంగా అన్నాడు. ''అల్జీమర్స్..! మతిమరుపు. ఎంత భయపడితే అంత ఎక్కువైతది తాతా. టైముకు ఆ మందులు ఏసుకొని, ప్రశాంతంగా ఉండు. అదే తగ్గుతది'' అంటూ, గిన్నె మూతతీసి పళ్లెంలో అన్నం పెట్టుకున్నాడు వినయ్.

''డాక్టర్ అయితవా..?''

''హా..! హాస్పిటలే ఇల్లు, ఇల్లే హాస్పిటల్.. అప్పుడు కానీ నాకు సరిగ్గా నిద్రపట్టదు. ఈ ముర్రికితో, దోమలతో పడలేను. ఇంకో వారంలో 'నీట్' హాల్ టికెట్ వస్తది. ఎట్లయిన గవర్నమెంట్ సీటు కొట్టాలె తాత. మీ మీద పైసల భారం తగ్గియ్యాలె!'' అంటూనే, వడివడిగా వచ్చి తాత చేతిలోని పేపర్ లాగేసి, పళ్లెంలో అన్నాన్ని వాసన చూపించాడు..

గుప్పుమన్న వాసనకు నర్సయ్య మొహం చిట్లించి,

''ఏమంత కరాబైంది బిడ్డ! నీరొచ్చిన మెతుకులు పక్కకు బెట్టి, మంచిగున్న కాడికి నువ్వు తిను. అటెన్క ఉప్పేసుకొని తాగుతా!'' అని నర్సయ్య అన్నాడో లేదో.. తాత నోటికి చేతిని అడ్డు పెట్టి..

'మెల్లగా' అని గుసగుసలాడాడు వినయ్.

అప్పటికే ఆ మాటలు లచ్చుమ్మ చెవిన పడ్డాయి. నాలుక కరుచుకున్నారు ఇద్దరూ..

''పరమాన్నాలు, పసాదాలు తిన్నీకి నీ అయ్య కోట్లు కూడబెట్టలే! డూటీ కాన్నుంచి వచ్చేటాళ్లకు లేట్ ఐతనే ఉండే.. ఆకలికి సత్తరని నాలుగు గింజలు రాత్రే వండి పెడితే.. పొద్దెక్కె దాకా పండుడు, బువ్వ కరాబైందని ఒర్రుడు. ఆడ నేనే జెయ్యాలే, ఈడ నేనే జెయ్యాలే'' అంటూ, ఒక్కొక్క గిన్నె తోముకుంట కోపంగా విసిరేసింది లచ్చుమ్మ.. గిన్నెల చప్పుడు, ఆమె కోపంలోని తీవ్రతను చూపుతున్నాయి. ఇదంతా అప్పుడప్పుడూ ఉండేదే అయినా.. ఈసారి ఎందుకో, వినయ్ సహనాన్ని కోల్పోసాగాడు.

''హాస్టల్‌కి పోతే మల్లెప్పుడు ఇంటికి పోదామా!? అనిపియ్యాలే. నాకు ఇంటికొస్తే హాస్టల్కెప్పుడు పోదామా? అనిపిస్తుంది. నన్ను ఏదో ఒకటి అనకుండ ఉండలేవానే..? నేనంటేనే నీకు ఇష్టం లేదు.. నాన్నుంటే ఈ బాధలే ఉండక పోవు''.. గొంతు పెంచాడు వినయ్.

'నమస్తే తెలంగాణ-ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2026'లో ద్వితీయ బహుమతి రూ.25 వేలు పొం[illegible] థ.

''ఏందీరా..? బాధలు ఉండకపోవునా..? తాగి తాగి అడ్డంబడి ఐదేండ్లు అరిగోస వంచుకున్నడు నీ అయ్య.. ఐదు లచ్చలు అప్పుదెస్తే ఇప్పటిదాకా తీరలే. నీ అయ్య నన్ను బాయిల నూకి సచ్చిండు. ఇగ నువ్వొచ్చి ఇప్పుడు కాలుకు బండ కట్టు.. అయింత మునిగి సత్తే.. అందరి కండ్లు సల్లబడతయ్!'' అని మరో రెండు గిన్నెలు విసిరికొట్టింది.

''నువ్వెందుకు సావాల్నే! నేనే పోత తియ్యి. సెలవులక్కూడా ఇంటికి రాను. సారు కాళ్లు మొక్కయినా హాస్టల్లనే ఉంట''

''గా పంజెయ్యి! ఎవడు రమ్మంటండు ఇంటికి. పైసకు పనికిరాడు గని.. కోపానికి తక్కువలేదు''

గొడవొద్దని నర్సయ్య చెప్తున్నా వినలేదు. వినయ్ మొహం మాడిపోయింది. కళ్లు ఎర్రబడ్డాయి. పళ్లెం నేలకేసి బలంగా కొట్టాడు. అన్నం చెల్లాచెదురై, పళ్లెం గిర్రున తిరుగుతుంటే.. లత దిగ్గున లేచి కూర్చుంది.. మసి చేతుల్తోనే మెరుపు వేగంతో వినయ్ ముందుకొచ్చింది లచ్చుమ్మ.. ఒక చేత్తో వినయ్ చెంపలను గట్టిగా నొక్కిపట్టి, ఇంకో చేతి చూపుడు వేలుని లత వైపు చూపిస్తూ..

''మొన్ననే నీ చెల్లె పెద్ద మనిషి అయ్యింది. మూలన పడి మూలుగుతంది.. ప్యాడ్ కొందామంటె పైస లేదు. జీతం పైసలు ఆకిట్లకన్న వత్తన్నయా!? అంత రేశం గల్లోనివైతే పనికి బొయ్యి పదిరుపాలు దెచ్చియ్యి పో! బువ్వ మీద కోపం సూపిచ్చేంత బతుకు బతుకుతున్నమా!? రెండు మెతుకులు సంపాదిస్తే తెలుస్తది''.. మొహంలో మొహం పెట్టి ఆవేదన కక్కి బయటికెళ్లింది.

వినయ్ నోరెళ్లబెట్టి క్షణాలపాటు చెల్లి వైపు చూశాడు. మొహం మీద మసి తుడుచుకోకుండానే, దుఃఖంతో బయటికెళ్లిపోయాడు. వద్దని నర్సయ్య ఎంత వారించినా ఆగలేదు.

''తెల్వని పోరని మీద కోపమెందుకు లచ్చవ్వ. వాడు తినకుంటనే అలిగి పోతండే! జర మనమే ఓపిక జేసుకోవాలె. పిల్లలు ఎదుగుతున్నరు. నాలుగు రోజులు బోనీ.. వాడే నౌకరు చేసి అందరిని సాదుకుంటడు.. కలెక్టరే మెచ్చుకున్నడంటే మాటలా మరి!'' అంటూ, కిందపడ్డ మెతుకులన్నీ పళ్లెంలోకి ఎత్తాడు నర్సయ్య.

''వాళ్లు వీళ్లు మెచ్చుకుంటే పళ్లెం నిండుతదా? 'సఫాయి నర్సయ్య మా సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేయకపోతే బతికేటోళ్లమే గాదు. వాన్ని దేవుడను కొని దండం పెట్టినా తప్పులేదు..' అని దండలేసి శాలువలు గప్పితిరి! ఆ మెప్పులకు ఏమొచ్చింది..? సూపెట్టవ్ మరి.. నీ బంగారు పళ్లాలు, ఎండి శెంబులు..?'' తీవ్రంగా కసిరింది.

''మనం గాకపోతే ఇంకెవరు జేత్తరు బిడ్డా..! తాతల కాన్నుండి గదే పనాయే. ఆళ్ల లెక్క మనం. ముట్టుకునే దైర్నం కూడా ఎవ్వరు జేయని పని, మనం జేత్తన్నమంటే గొప్పనే కదా..!'' అన్నాడు వాసనొస్తున్న మెతుకుల్ని, ఉప్పేసి కలుపుతూ..

''నీ గొప్పలు చర్ల బెట్ట. తిండానికి తిండిలేదు, మాటలకు మతిలేదు. నీ మనవరాలు బడి ఎట్ల బంజేసిందో మర్శిపోయినవా!?'' పళ్లు పటపట కొరుక్కుంటూ, కోపంగా దొండకాయలు ముందటేసుకుంది. జ్ఞాపకమే లేదన్నట్టు కోడలి వైపు అమాయకంగా చూసాడు.

''అగో.. బల్లి గుడ్లేసి నన్ను జూత్తవ్! పోయి డప్పు కొట్టుపో నీ గొప్పతనం గురించి.. 'సఫాయి నర్సయ్య మనవరాలు' అని బడి పిల్లలు ముక్కులు మూసుకొని పక్కకు కూసుంటలేరట.. మూలిగే

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

నక్క మీద తాటికాయ పడ్డట్టయింది బతుకు. కులం మీద గులిగేది సాలదని, పని మీద సుత బడ్డరు'' ఆవేదనతో కళ్ల నీళ్లు పెట్టుకుంది.

''ఆడిపిల్ల సదువకపోతే ఎవనికి నష్టం.. వాడు సదివితే సాలు. కొన్నాళ్లు ఓపిక బట్టు. కట్టం దప్పుతది'' అంటూ, ఒక ముద్ద నోట్లో పెట్టుకున్నాడు.

''నువ్వు ఎన్నయినా చెప్పు మావ.. లత ఫంక్షన్ చేసి, కులపోల్లకు భోజనాలు పెట్టియ్యాలె! ఇజ్జత్ దక్కాలంటే పైసలు గావల్నా? పానం మంచిగ ఉంటలేదని నువ్వు పనికే పోతలేవైతివి. కాళ్లు అరుగుతున్నయ్ గని అప్పు పుడుతలేదు. వినయ్ గాన్ని బడి బందుపెట్టి, ఎక్కడన్న హోటళ్ల జీతముంచి, అడ్వాన్స్ తీసుకొని ఫంక్షన్ జేద్దాం. నాలుగు చేతులాడుతనే నాలుగు రాళ్లు. లతకు పెళ్లీడు వచ్చేయాలకు చేతుల పైసలుండాలే. అందుకు వినయ్ గాడు పనికెక్కాలే.. ఆడు నీ మాటే వింటడు. ఎట్లనో అట్ల నువ్వే ఒప్పియ్యి. మొగోనికి కండెక్కువ. ఎట్లయినా బతుకుతడు. ఆడిపిల్ల అట్ల గాదు. అందుకే దాని మీద నాకు సోయెక్కువ. ఇగ నా కొడుకు 'డాక్టర్ అయిత' అన్నప్పుడల్లా గుండె బరువైతంది. పేదోని కడుపున పుట్టుడు కంటే పశువుగ పుట్టుడు మేలు!''

''గట్ల గాదవ్వా!'' నర్సయ్య ఏదో చెప్పబోతుంటే.. వెంటనే లచ్చుమ్మ,

''మరెట్లా..? నా ఒళ్లు అమ్ముకోవన్నా..?'' ఆవేదనతో అరిచి కన్నెర్రజేసింది.

ఆమె అన్న మాటకు నర్సయ్య హృదయం ద్రవించింది. తినే అన్నం మింగుడుపల్లేదు. విపరీతంగా చలించిపోయాడు. నోట మాట రాలేదు. మనవడి కోసం గుమ్మంకేసి చూశాడు. ఆ తర్వాత ఏదైనా పనుంటే చూడమని సూపర్‌వైజర్ సుధాకర్‌కు ఫోన్ చేసి మాట్లాడాడు.

''గీ ముసలితనంల నీకేడ చాతనైతది. కాకపోతే కుక్కలో, పిల్లులో సచ్చిపోతే తీసి పడేయడానికి పిలుస్తలే నర్సయ్యా!'' అని సుధాకర్ అన్నాడు.

''నా ఆకలికి ఏ కుక్కను సావమంటవ్! పాపం.. నోర్లేని జీవులు. దాంది.. నా అసొంటి పానమే నాయే!'' గొణుగుతూనే ఫోన్ పెట్టేశాడు నర్సయ్య.

* * *

అప్పటికే చాలాదూరం వచ్చేశాడు వినయ్. జరిగిందాన్ని తలచుకొని తనలో తాను ఓ యుద్ధమే చేశాడు. ఎండ మండిపోతుంటే చెమటలు కక్కాడు. విపరీతమైన దాహమేసింది. ఆత్రంగా జేబులెతికి రెండు రూపాయలు చేతబట్టుకొని కిరాణా షాపును చేరాడు. వాటర్ ప్యాకెట్ కొనుక్కొని.. రెండు బుక్కలు గటగటమని నీళ్లు తాగాడు. సగం ప్యాకెట్ పట్టుకొని, రెండు రూపాయల బిళ్లను షాపతనికి ఇచ్చాడు. ఆ పెద్దాయన, బిళ్లను తీసుకుంటూనే కోపంగా అరుస్తూ బయటికొచ్చాడు..

''పట్టపగలు రోడ్డుమీద ఏందిరా అది? తాగినవారా? గోడ మీద ఏం బొమ్మున్నది? నువ్వేంజేత్తన్నవ్? గట్ల ఆ చెత్త మీద పోస్తే, నీ అయ్య గిట్ల ఎత్తి పోస్తడా? ఎవ్వడు జూడు ఇక్కన్నే పోత్తర్లు'' అగ్గిలం మీద గుగ్గిలం అయ్యాడు షాపతను. పూర్తిగా మూత్ర విసర్జన చేసిన ఆ తాగుబోతు, వెనుదిరిగి..

''మరి నీ అయ్య గిట్ల ఎత్తి పోత్తడా చెత్తను..? కాదు గదా! ఈ జాగ నీదా.. నీ అయ్యదా? నీ ఇంట్ల గిట్ల పోసిన్న? బాగ ఉరుకొత్తన్నవ్'' అని



కయ్యానికి కాలు దువ్వాడు.

అప్పుడే వినయ్ చూపులు గోడ మీద పడ్డాయి. ఆ గోడమీద చిత్రంలో.. గోచి కట్టుకుని, చీపురు పట్టుకొని, తట్టలోకి చెత్తను ఊడుస్తూ బోసి నవ్వు నవ్వుతున్నాడు మహాత్మా గాంధీ. ఆ పక్కనే కళ్ల జోడు చిత్రంలో 'స్వచ్ఛ భారత్' అని రాసి ఉంది. తన చూపు తడిసిన చెత్తకుప్ప మీదకు మళ్లింది. కాసేపు మనసు కకావికలమైంది. ఆలోచిస్తూ, వెనుదిరిగి, తలెత్తి నీళ్లు తాగుతుంటే.. కళ్లెదురుగా షాపులో దండెం మీద 'శానిటరీ ప్యాడ్స్' కనిపించాయి. తన చెల్లి గుర్తొచ్చింది. క్షణాల్లో ప్యాడ్ రేటును కళ్లతో వెతికి పట్టేశాడు. 'డెబ్భై.. డెబ్భై రూపాయలు' అని మదిలో అనుకుంటూనే అక్కణ్నుంచి నిష్క్రమించాడు. ఏదో ఒకటి చేసి ఇప్పుడే సంపాదించి, ప్యాడుతోనే ఇంటికెళ్లాలని అనుకున్నాడు. ఆ ఏరియాలో, జనాలు పనుల కోసం పడిగాపులు కాసే ప్రతి అడ్డా తిరిగాడు. పనిలేదని కొందరు, పనిచేసే వయసు కాదని మరికొందరు అతన్ని వెళ్లగొట్టారు. ఎడారిలో నీళ్ల కోసం వెతికనట్టుంది పరిస్థితి. ఎండకి తాళలేక ఒక అపార్ట్‌మెంట్ పరిచిన నీడలో నిల్చున్నాడు. పక్కనే ఒక సంభాషణ వినిపించింది.

''నువ్వెన్ని పైసల్ ఇచ్చినా, నేను దాంట్లోకి దిగలేను. నాతోని గాదన్న. నన్ను వదిలేయ్'' అంటూ వెళ్లిపోయాడు ఒక వ్యక్తి. అతని వెనకాలే బతిమాలుతూ వెళ్లాడు సూపర్‌వైజర్ సుధాకర్. అయినా లాభం లేకపోయింది.

''అన్నా.. నే చేస్తా. పనేంటో చెప్పు'' వినయ్ అనగానే, సుధాకర్ వెంటనే ఒప్పుకొన్నాడు. కానీ, పనేంటో తెలిసాక వినయ్ నిరాకరించాడు. ఆలోచనల్లో పడ్డాడు. ఆ పని చేయడం తనకు ఎంతకీ ఇష్టం లేదు. సుధాకర్‌కి ఆ పని పూర్తవడం ఎంతో అవసరం. రకరకాల మాటలు చెప్పి ఒప్పించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కానీ వినయ్.. వద్దని తనకు తాను ఎంత నచ్చజెప్పుకున్నా, ఇంటి సమస్యలు ముందుకు తోస్తూనే ఉన్నాయి.. చివరికి వినయ్ ఓడిపోక తప్పలేదు.

పైనుంచి సుధాకర్ అందిస్తున్న తాడు పట్టుకొని, అర్ధనగ్నంగా ఉన్న వినయ్ కొద్దికొద్దిగా 'మ్యాన్‌హోల్'లోకి దిగాడు. క్రమంగా చీకట్లోకి జారాడు. చెత్తతో కూడిన బురదలో అడుగేయగానే.. హాయిగా సేదతీరుతున్న క్రిములు, రెక్కల పురుగులు ఉలిక్కిపడి పైకి పరుగుతీశాయి. అప్పటికే ఒక గాజు పెంకు, అతని అరికాలును చీల్చి రక్తం రుచి చూసింది. విలవిల్లాడిపోయాడు. భరించలేని దుర్వాసనకి ఉక్కిరిబిక్కిరయ్యాడు..

''నాతోని కాదన్న.. నన్ను బయటికి లాగు'' అని ఎంత వేడుకున్నా.. సుధాకర్ వినకపోగా బకెట్ దింపి చెత్తని, బురదను ఎత్తమని ఆదేశించాడు. పది నిమిషాలు ఓపిక పడితే, చాలా డబ్బులిస్తానని ఒప్పించాడు. చేసేదేమీ లేక భరించడం మొదలెట్టాడు వినయ్. మలినాన్ని ఎత్తి పైకి పంపిస్తున్నాడు.. కాసేపటికి ఆలోచనల పరంపరతో, తనలో తాను మాట్లాడుకోవడం ఆరంభించాడు..

'యాక్! ఇదేం కంపురా! ఇంకో వంద ఎక్కువే అడగాలి. మనిషన్నోడు చేస్తడా గీ పని. ఏమైతేనేం! డబ్బులతో మావోళ్లకు షాక్ ఇవ్వాల్సిందే!'

ఒక్కొక్క బకెట్ పైకి పంపిస్తూనే ఉన్నాడు. బకెట్ అంచుల నుంచి కారుతున్న మురుగు నీటి ధారను తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నా.. బొట్లు బొట్లుగా మీద పడుతూనే ఉంది.

'ఓరి నాయనో! తాత ఎట్ల చేస్తున్నాడ్రా బాబు. ఒక్క రోజుకే సచ్చి పుడుతన్న. వామ్మో!! దీన్ని పనంటరా? నరకంలో శిక్ష. మరి అమ్మా? తన పనీ దారుణమే! ఆ షాపోడు, తాగుబోతు గొడవ పడుతుంటే తలతిరిగింది. మనుషుల విసర్జన ఎత్తిపోసే రాత, దేవుడు మాకే ఎందుకు రాశాడో! అయినా నాకో డౌటు! రాతలు నిజంగా దేవుడే రాస్తడా..?'

పైనుంచి సుధాకర్ అరుపుతో తన ఆలోచనలకు కాసేపు విరామం పడింది.

''మ్యాన్‌హోల్ అడుగున ఒక పైపు కనెక్ట్ అయ్యుంటది. అది బురద కట్టి మూత పడిందా చూడు. అదొక్కటి తీసేస్తే ఖతం!'' సుధాకర్ చెప్పగానే, వినయ్ ఆ వైపు కదిలాడు. ఆ పైపు ద్వారం వద్ద, చెత్త ముద్దలాగా గడ్డ కట్టి ద్వారాన్ని మూసేసింది. దాన్ని తొలగించాలంటే బలం సరిపోలేదు. పైనుంచి సుధాకర్ ఇచ్చిన ఇనుప రాడ్డుతో ప్రయత్నిస్తూనే మళ్లీ ఆలోచనల్లోకి జారుకున్నాడు..

'దేవుడే రాస్తడా రాతలు? మ్మ్.. రాయడనుకుంటా! ఒకవేళ రాస్తడే అనుకుందాం! మాకే ఎందుకిలా? అసలు భూమ్మీద పుట్టిన ఏ ప్రాణీ ఇంత కంపు భరించదు. ఒక్కటంటే ఒక్కటి కూడా.. మర్చేపోయా! రాబందులు ఉన్నాయ్ కదా..!' లోపలి నుంచే ఆకాశంకేసి చూసాడు. దూరంగా అక్కడెక్కడో చీమల్లా రెండు పక్షులు కనిపించాయి.

వాటిని చూసి.. 'ఓయ్ రాబందులారా! మా బతుకూ.. మీలెక్కనే. మనదంతా ఒకే జాతి. హహ.. హా.!!' తనలో తాను నవ్వుకుంటూ, ఆ గడ్డను బలంగా కొట్టాడు. అది పగిలి గాఢమైన కుళ్లిన కోడిగుడ్డు వాసన విడుదల చేసింది. ముక్కు గట్టిగా మూసుకున్నాడు.

'ఒక్కసారన్న దేవుడికి పాపం అనిపియ్యలేదా..? రోగాలు రాకుండా ఒళ్లుని, ఎంత కంపునైనా భరించే ముక్కుని ఇవ్వాలని. అదే.. రాబందులకు ఇచ్చినట్టు! అప్పుడైతే ఈ గబ్బు పని విసుగు లేకుండా చేసేవాళ్లం కదా..!! ఏమంత పాపం చేశాం దేవుడా..? మరీ.. ఇంత పక్షపాతమా?'.

పైపులో నుంచి మురుగు నీరు భళ్లున్న తన్నుకొస్తూ విష వాయువులతో ఉక్కిరిబిక్కిరి చేసింది. క్షణాల్లో పరిస్థితి విషమించింది. వినయ్‌కి శ్వాస తీసుకోవడం చాలా కష్టమైంది. గుండె వేగం పెరిగింది. గొంతు పెగలటం లేదు. విషవాయువులు నరనరాల్లో పరుగులు పెడుతున్నాయి. చేతులు చాచి, పైనుంచి ప్రసరిస్తున్న వెలుగుకేసి చూశాడు.

'నేను అస్సలు చావకూడదు' లోలోపలే అనుకొని గట్టిగా ఊపిరి పీల్చాడు..

‘నేను చావను.. చావనే చావను’ పదేపదే అనుకుంటూ శక్తిని కూడగట్టాలని విశ్వప్రయత్నం చేశాడు. ఒంట్లో విషాలు పాతాళంలోకి తొక్కేస్తున్నాయి. అయినా, సంకల్ప బలాన్ని మూటగట్టుకొని ఎలాగోలా మ్యాన్ హోల్ నుంచి బయట పడగలిగాడు. ఒళ్లంతా నల్లటి బురదతో, మోకాళ్లపై చేతులేసుకొని వంగి, రొప్పుతూ, డబ్బుల కోసం సుధాకర్ వైపు చెయ్యి చాచాడు. ఆశ్చర్యంతో నోరు తెరిచి, జేబులో నుంచి డబ్బు తీసి ఇచ్చాడు సుధాకర్. శక్తినంతా కూడదీసుకొని నగరపు వీధుల వెంబడి పరిగెత్తుతున్నాడు వినయ్. జనమంతా బిత్తరపోయి చూస్తున్నారు. తన శ్వాస శబ్దాలు, గుండె చప్పుళ్ల మాత్రమే వింటున్నాడు. దేహం చెమటలు కక్కుతూ, ఒంటి మీది బురదను సన్నని ధారలుగా కిందకి తోస్తోంది. తన దృష్టిలో ప్రపంచమంతా స్తంభించింది. మురికి వాడలను దాటుకొని ఇంటిని చేరుకున్నాడు. సత్తువ క్షీణించి అడుగులు భారంగా పడుతున్నాయి. గుమ్మం బయట కూర్చున్న చెల్లిని చేరి కుప్పకూలి పోయాడు..

మెల్లమెల్లగా కళ్లు మూతలు పడుతుంటే, చేతిలోని డబ్బుని లతకు ఇవ్వజూపాడు. మసకగా లత మొహం కనిపించింది.. వాయువేగంతో తల్లి, తాత బయటికొచ్చారు. కొంత సమయం తర్వాత అంబులెన్సులో తరలిస్తుంటే తాత మొహాన్నే చూస్తున్నాడు వినయ్.. చూస్తుండగానే చికిత్స జరిగింది. చుట్టూ తెల్లటి గోడల్ని, పరిశుభ్రమైన నేలని, పరిసరాలని పరిశీలిస్తూ పక్కనే కూర్చున్న అమ్మ ఒడిలో పడుకొని చిన్నగా నవ్వాడు. స్వచ్ఛమైన తన మనుషుల మధ్య, స్వచ్ఛమైన గాలి కడుపు నిండా పీలుస్తూ పరవశించి పోయాడు. బాబుకి ఏం ప్రమాదం లేదని చెప్పి వెళ్తున్న డాక్టర్ని అలానే చూస్తూ తనను తాను ఊహించుకొని మురిసిపోయాడు. ఒకపక్క కడిగిన ముత్యంలా, మరకలేని మల్లెలా విరబూసిన చెల్లి. మరోపక్క తాత కళ్లలో సజీవంగా కనిపిస్తున్న కోటి ఆశలు. తన తల్లి గుండెలకు హత్తుకొని ఏడుస్తుంటే.. ఆ ప్రేమ మనసుని తాకి పరవళ్లు తొక్కింది. హాయిగా, మత్తుగా నిద్రపోయాడు. మునుపెన్నడూ లేని విధంగా..

కానీ, అది నిద్ర కాదు. విషవాయువుల రాక్షస క్రీడ. యమపాశం మెడకు చుట్టుకొని తన ఊపిరిని హరిస్తోంది. మ్యాన్ హోల్లో శ్వాసకోసం కొట్టుమిట్టాడుతున్న వినయ్.. గట్టిగా ఊపిరిపీల్చి కళ్లు తెరిచి చూశాడు. పైనుంచి తాడు వదిలి సుధాకర్ అరుస్తున్నాడు. తాత, అమ్మ, చెల్లి, హాస్పిటల్.. ఏ..దీ.. లేదు! అంతా శూన్యం. ప్రతిదీ అబద్ధం. తన ఆఖరి నిమిషాల్లో, మనసారా కోరుకున్న అందమైన చివరి కల. అది ‘కల’ అని తెలుసుకునే లోపే.. శ్వాస గాల్లో కలిసిపోయింది.

* * *

‘‘నమస్తే సుధాకర్ అన్న! పైసల్లో పైసలని మా కోడలు పొద్దున ఒకటే పంచాయితీ. నీ కడుపు సల్లగుండ. టైముకి పని సూపెట్టినవ్. ఏదా కుక్క? ఏడ సచ్చింది? సరే! దానికంటే ముందు నీకో ముచ్చట. నా మనవణ్ని చూశ్లేకదా? ‘మంచిగ సద్వియ్యి!’ అనేటోనివి గదా. ఇగో.. గీ పేపర్ జూడు’’ అని గర్వంగా సుధాకర్ చేతికిచ్చాడు నర్సయ్య.

పేపర్ని చూడకుండానే విసిరికొట్టిన సుధాకర్..

‘‘నీ మనవణ్ని ఇంటికొచ్చి సూత్తగని, నీకో ముచ్చట జెప్పాలె దగ్గరికిరా! సచ్చింది కుక్క గాదు, ఒక పోరడు. గుట్టు సప్పుడు కాకుండా సిటీ దాటియ్యాలె. బయట మనోడు ఒకడు చెత్త ట్రాక్టర్తో రెడీ! ‘ఎవరు? ఏంటి?’ అనేది నీకు అనవసరం. పది వేలిస్తా. ఏమంటవ్?’’ అన్నాడు.

ఆ మాటలు నర్సయ్యను కాసేపు చిత్రవధ చేశాయి. ఏదో ఒకటి తేల్చుకునేలోపే.. తన ఇంటి ఆకలి నోట్లో గుడ్డలు కుక్కింది. నోటిమాట రాలేదు.

ఎలాగోలా మృతదేహాన్ని బయటికి తీసాడు. తన కళ్లని తానే నమ్మలేకపోయాడు. ఆరిన తన పేదింటి ఆశాదీపాన్ని చూసి దుఃఖం పొంగుకొచ్చింది. గుండె పగిలిపోయేంత వేదన. మనవణ్ని గట్టిగా హత్తుకొని గొంతు పగిలేలా ఏడ్చాడు. కన్నీళ్లు బొట్లుగా రాలి.. వినయ్ మొహాన్ని తడిపేస్తున్నాయి. పదేపదే శరీరాన్ని కుదిపేస్తూ కళ్లు తెరిచి చూడమని ప్రాధేయపడ్డాడు. ఏం లాభం! తనలాగే దేహం చాలించిన తరలనాటి పూర్వీకుల నుంచి.. నేటితరం కర్మచారుల్లో కలిసి వినయ్ గగనమెక్కాడు. కాసేపటికి నర్సయ్య ఆవేశంతో ఊగిపోయాడు. సుధాకర్ను చంపాలన్న కసి మొలకెత్తి తెగింపుతో లేవ ప్రయత్నం చేసి, ఆ మరుక్షణమే కూలబడ్డాడు. కాళ్లుచేతులు ఆడట్లేదు. కేవలం నిశ్శబ్దం. కొద్దిసేపటికి సుధాకర్..

‘‘నర్సయ్యా!’’ అని పిలిచాడు.

అతను తలతిప్పాడు. పిలిచినవాళ్లు ఎవరో, ఎందుకు పిలుస్తున్నారో అర్థం కాలేదు. తానెక్కడున్నాడో, ఏంచేస్తున్నాడో, ఆ శవంతో తనకు ఏ సంబంధమో అతని మనసు స్పందించలేదు. భయం లేదు, అలాగని దుఃఖమూ లేదు. అంతకు ముందు జరిగింది, ఇప్పుడు జరిగింది ఏదీ గుర్తులేదు. అంతా మర్చిపోయాడు. సుధాకర్, డ్రైవర్ సహాయంతో హుటాహుటిన వినయ్ దేహాన్ని గోనె సంచిలో మూటగట్టాడు. ‘మురుగు వ్యర్థాల రవాణా వాహనము’ అని రాసున్న ట్రాక్టర్, మూటతో బయల్దేరి వీధులన్నీ దాటుతోంది.

సిటీ నడిబొడ్డున భారీ బహిరంగ సభ. వందల మంది సఫాయి కర్మచారుల మధ్య కలెక్టర్ మైకులో మాట్లాడుతున్నాడు..

‘‘మ్యానువల్ స్కావెంజింగ్ అనేది కేవలం ఒక పని కాదు. అది తరతరాలుగా కొనసాగిన ఒక సామాజిక అన్యాయం. డ్రై లెట్రిన్లోకి, భూగర్భ మురుగు కాలువల్లోకి దిగి మనుషుల అశుద్ధాలు ఎత్తే పని కొనసాగుతున్నంత కాలం.. ‘సమానత్వం’ అనేది సాధించలేని వట్టి భ్రమ. పదేళ్లుగా మనందరం కలిసి చేసిన కృషికి.. ‘మ్యానువల్ స్కావెంజింగ్ ఫ్రీ డిస్ట్రిక్ట్ అవార్డ్’ మన జిల్లాకు రావడం గర్వంగా ఉంది’’ అనగానే జనాల చప్పట్లు మోగుతున్నాయి.

ఆ సభను దాటుతూ ట్రాక్టర్ వేగంగా దూసుకెళ్లి, సిటీ అవతల ఎకరాల కొద్దీ పరుచుకున్న డంపింగ్ యార్డుని చేరింది. డ్రైవర్కి కాళ్లుచేతులు ఆడలేదు. మూటను అక్కడెక్కడో మధ్యలో వదిలేసి. భయంలో, కంగారులో.. పూడ్చడంగానీ, కాల్చడంగానీ చేయకుండానే వెనక్కి వచ్చేశాడు.

మేఘాలు కమ్ముకున్నాయి. గగనతలంపై పక్షులు విహరిస్తున్నాయి. మేఘాల్ని, కాలుష్యపు పొగల్ని చీల్చుకుంటూ రెక్కలు చాచి నేలపైకి దిగుతూ, సరిగ్గా ఆ మూటపై వాలింది ఓ రాబందు. వాసన పసిగట్టి తన ముక్కుతో ఒక్కొక్క దారాన్ని లాగేస్తుంటే.. కొద్దికొద్దిగా ఆ దేహం బయటికి తన్నుకొస్తోంది. కరిచి కరిచి దారాల్ని పీకేసింది. మూటలోంచి వినయ్ తల బయటకొచ్చింది. తెరిచి ఉన్న తన కళ్లు ఆకాశానికేసి అర్థిస్తున్నాయి. అతని గుండెల మీద ఆ రాబందు నిల్చొని, తలను అటూ ఇటూ తిప్పుతూ సరాసరి వినయ్ కళ్లలోకి పరిశీలనగా చూసింది. ఆకాశంలో నల్లటి మేఘాలు చినుకుల్ని మోస్తూ పరిగెడుతున్నాయి. ఒక స్వచ్ఛమైన నీటి బిందువు వినయ్ నుదుటి మీద పడగానే.. రాబందు రెక్కలు విదిలించి పైకి ఎగిరి, మళ్లీ యథా స్థానంలో వాలింది. ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా కంటి పాపని లక్ష్యంగా చేసి, ఒక్కసారిగా దాడికి దిగింది రాబందు.

* * *

సాంఘిక సంక్షేమ కళాశాల, నర్సంపేట. ఐదు వందల మంది పిల్లలు పొద్దున్నే గ్రౌండ్లో ప్రేయర్కి, క్లాసుల వారిగా వరుసగా నిల్చున్నారు. నీలి రంగు చొక్కాలతో ఆ ప్రాంగణం కలువ పూల తోటలా ఉంది. అక్కడ పూసిన ప్రతి పువ్వూ బురదలోంచి పుట్టిందే!

‘వందేమాతరం వందేమాతరం..
సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం..
సస్యశ్యామలాం మాతరం.. వందేమాతరం..’
అని భారతమాతను స్తుతిస్తున్నారు.

పది రోజులుగా ఆకలి, నిద్రలెరుగని లచ్చమ్మ.. ఎదురుచూపులో ఆకాశాన్ని తాకే ఆశ. టిఫిన్ బాక్సులో వేడివేడి అన్నం తెచ్చి రోజూ కాలేజీ ప్రాంగణంలో లతతోపాటు పడిగాపులు కాస్తోంది. కొడుకొస్తే నాలుగు మెతుకులు తినిపించాలని ఆ తల్లి పేగు తల్లడిల్లుతోంది. శారీరకంగా, మానసికంగా కుంగిపోయింది.. నర్సయ్య జ్ఞాపకాల గది ఇంకా తెరుచుకోలేదు. మెదడు పొరల్లో దాగిన ఆ మనోవేదనకు విముక్తి ఎన్నడో ఆ దేవుడికే తెలియాలి.

పిల్లల గీతాలాపన సాగుతూనే ఉంది. దీనంగా తల్లినే అంటిపెట్టుకున్న లత వైపు మాస్టారు చూపు మళ్లింది. కాసేపటికి జేబులోనుంచి ‘నీట్’ హాల్ టికెట్ తీసి చూస్తే.. వినయ్ మొహం కనిపించింది. తనకిష్టమైన స్టూడెంట్ వినయ్, ముందు వరుసలో నిల్చొని జాతీయ గీతాలాపన చేస్తున్నట్టు కాసేపు మాస్టారు భ్రమ చెందాడు. తన కళ్లలో సన్నని నీటి పొరలు ఉబికాయి. ఆ వెనకాల నోటీస్ బోర్డుపై ‘మంచి మాట’ కింద ఒక మాట రాసుంది.

‘నేను మళ్లీ జన్మించాల్సి వస్తే, ఒక అంటరానివానిగా/స్కావెంజర్గా పుట్టాలని కోరుకుంటాను. తద్వారా వారి కష్టాలను, అవమానాలను పంచుకుంటూ, ఆ దయనీయ స్థితి నుంచి వారికి విముక్తి కలిగించడానికి ప్రయత్నించగలను’

– మహాత్మా గాంధీ

(యంగ్ ఇండియా పత్రిక, 1921)



**బి. సుజిన్ కుమార్**
86391 61721

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఈవారం కథ



● మొహమ్మద్ గౌస్

# పచ్చిగెడ్డి

ఎండ సుర్రని కొడ్తాంది. పిల్లోళ్ళు కాళ్ళకి చెప్పులేసుకోని, టోపీలు పెట్టుకోని, బ్యాటు బాల్లు తీసుకోని కిర్కెట్ ఆడుకున్నేకి పోతాన్నారు. ఇంటి ముందర అరుగుల మింద నీడ పోయి ఎండొచ్చింది.

సందులోకి చూస్తే ఎవురూ కనపడల్యా, అందురూ ఎండ తట్టుకోల్యాక ఎవురింట్లో వాళ్ళున్నారు.

ఆవులకి నీళ్ళు తాపిద్దామని అమీనా పశువుల కొట్టంలోకి పోయింది. అన్ని ఆవులు బానే ఉండాయి. ఒకే ఒక్క ఆవు మాత్రం ముడ్చుక్కోని పండుకుంది. దాని ముందర ఏసినే ఎండుగెడ్డి అట్లనే ఉంది. కొంచెం కూడా తినల్యా. ఆవుని అట్ల చూస్తానే పాణమంతా ఎట్లో అయింది అమీనాకి. గెడ్డి చేతిలోకి తీసుకోని తినిపించేకి చూసింది. ఆవు అమీనా తుక్కు చూసి చేతిలో ఉన్నే గెడ్డి తినింది.

హమ్మయ్య అనుకోని ఇంగ రొంత గెడ్డి తీస్కోని తినిపించింది. ఆవు కొంచేపు తిని మొగం పక్కకి తిప్పుకుంది. కడుగు నీళ్ళల్లో అన్నం, తౌడు కలిపి



తీసుకొచ్చింది. అది గూడా రొంత తినింది. ఇంగ సాల్లే అనుకోని నీళ్ళు తాపిచ్చింది. నీళ్ళు తాగి పనుకుంది ఆవు.

''ఎంతసేపు ఆ ఆవు దగ్గరే ఉంటావు, ఇంట్లో పని మీ నాయినొచ్చి చేస్తాడా?'' ఇంట్లో నుండే అరిసింది అమీనా వాళ్ళత్త హుసేన్ బీ.

ఇంకేం ఆలోచన చేయకుండా పరిగెత్తి ఇంట్లోకి పోయింది అమీనా. బట్టలు నానేసి, సామాన్లు కడిగేసి, ఇంట్లో మిగిలిండే పనులు చేసేసి కుచ్చుంది. కిటికీ లోనుండి ఆకాశం కనిపిస్తాంది. దూరంగా విండుమిల్లులు కనిపిస్తాన్నాయి. అవి తిరుగుతా ఉంటే వాటినే చూస్తా చూస్తా అమీనా ఆలోచనల్లో పడిపోయింది.

● ● ●

అమీనాకి పెళ్ళై సంవత్సరం దాటింది. ఇంకా పిల్లలు పుట్టలేదు. అమీనా మీద వాళ్ళత్తకున్న కోపానికి అది కూడా ఒక కారణం. సేద్యం చేసే కుటుంబం కావడంతో చిన్నప్పట్నుండి ఆవులు, గేదెలు, ఎద్దులు చూస్కుంట పెరిగింది.

పదో తర్తి వరకు ముక్కీ మూలిగి సదివి 'కాలేజీకి పోను' అని చెప్పేసింది. ఇంట్లో పనులు చేసుకుంట, సేన్లో పనులు, పాలు పిండేది, పచ్చిగెడ్డి కోసుకొచ్చి పశువులకి పెట్టేది ఒకటని కాదు. ఇంట్లో వాళ్ళమ్మ చేసే ప్రతిపనీ అమీనా కూడా చేసేది.

ఒక అన్న, ఇద్దురు అక్కలు. అందరికీ పెళ్ళిళ్ళు అయినాయి. వయసులో అమీనా కంటే చానా పెద్దోళ్ళు కావడం మూలాన పెద్దగా మాట్లాడేది కాదు వాళ్ళతో. ఇంటిదగ్గర నేస్తులున్నా, వాళ్ళతో మాట్లాడేదీ తక్కువే. ఎప్పుడూ ఆవుల కొట్టంలోనే. వాటితోనే మాట్లాడేది. అవి తిరిగి మాట్లాడతాయని నమ్మేది. అన్నిటికంటే ఒక ఆవంటే రొంత ఎక్కువిష్టం అమీనాకి.

అమీనా వచ్చి పక్కన నిలబడకుంటే ఏం తినేది, తాగేది కాదా ఆవు. ఎవురన్న వచ్చి ''ఇప్పుడంటే ఇట్లుంది. రేప్పొద్దున పెండ్లయి వేరే ఊరికి పోతే ఎట్లమ్మే?'' అనడిగితే, ''ఎట్ల ఏం ఎట్ల? నాతో పాటు దీన్ని కూడా తీసకపోతా'' అనేది చానా మామూలుగా.

''అట్లయితే పొలం, పశువులు ఉన్నే ఇంటికి, యాదో ఒక పల్లెటూరికి ఇయ్యబడ్తాది'' అనేటోళ్ళు.

''పుట్టిండేది పల్లెటూర్లోనే, పెరిగిండేది ఈడనే. ఇంగ పెళ్ళి చేస్కోని పొయ్యేది పల్లెటూరికైతేనేం?'' అనేది.

''కొంతమంది పొలం, పశువులు లేని ఇంటికి పోవల్ల అనుకుంటారు కదా, అట్ల అన్యాం లే'' అనంటే, ''నాకట్లాటివి ఏం లేవుబ్బా'' అనేది.

ఒకనాడు బంధువుల్లో ఒకాయప్ప వచ్చి ''తెలిసినోళ్ళ పిల్లోడుండాడు తలారి చెరువులో. కొండమింద ఉంటాది ఆ ఊరు. పొలాలున్నాయి, పక్కనే సిమెంటు ఫ్యాక్టరీలో ఉజ్జోగం కూడా ఉంది, చానా ఆవులు, గేదెలు ఉన్నాయి'' అని చెప్పినాడు. పెద్దోళ్ళు మాట్లాడుకున్నారు. వాళ్ళొచ్చి చూసి పోయినారు, వీళ్ళు పోయి చూసొచ్చినారు. పెళ్ళి ఖాయమైంది. ఆ కొండమిందే ఉన్న హాజీవలి దర్గా ఉర్సుకి చానాసార్లు పొయ్యొచ్చింది అమీనా. అదే ఊరికి పెళ్ళి చేస్కోని కోడలి మాదిరి పొయ్యేదంటే భలే సంబరమైంది అమీనాకి. రెండు నెలలు తిరక్కతలికే పెళ్ళయిపోయింది.

అమీనా చెప్పినట్లే అత్తారింటికి పోతా పోతా ఆవుని కూడా పిల్చుకోని పోయింది. కొత్త పెళ్ళికూతురు కావడంతో పశువుల కొట్టం తుక్కు పంపేలేదు అమీనాని కొన్నిరోజులు. ఆవు తింటాందో లేదో అనే దిగులు. సరిగ్గా తినలేదు ఆవు.

కొన్నిరోజులకి సేన్లో పని, పశువులకి మేత వేసేది, పాలు పిండేది మొదలుపెట్టింది. ఆవు మాత్రం కొంచెం కొంచెమే తినేది. 'ఎందుకుబ్బా' అని ఆలోచించుకుంది అమీనా.

ఇంటిపనుల్లో, అత్త భయంతో తొందరగా గుర్తుకురాలేదు కానీ, మళ్ళా తెలిసింది అసలు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి







సంగతి. పశువులకి పచ్చిగెడ్డే లేదని. 'ఎందుకుబ్బా ఇట్లా?' అనుకోని ఆ పొద్దు అట్లే ఉంది.

మరుసటి నా పొద్దు కొడవలి తీసుకోని పచ్చిగెడ్డి కోసరం పోయింది. ఇండ్లన్ని దాటుకొని సేన్ల వైపు నడిసింది. ఎక్కడే గానీ రోంత కూడా పచ్చిగెడ్డి కనపరాల్యా. ఒక్కో సేను దాటుకోని పోతాంది. శనగలు, కుసాలు, ఆముదం తప్పించి వేరే పంట లేదు. ఎంతదూరం పోయినా ఇదే కత.

విండు మిల్లులు దాటి పోయింది. అవి నిదానంగా తిరుగుతా ఉంటే వాటి తుక్కే చూసుకుంట నిలబడిపోయింది. తన జీవితం కూడా వాటి మాదిరే, అంత నిదానమైపోయినట్లు అనిపిస్తాంది. లోపలంతా ఏందో తెలియని నిస్సత్తువ. నడిసినంత దూరం నడిసి ఇంగ చేతకాక ఎనక్కి తిరిగింది. దర్గా దగ్గర నీడలో కొంచేపు కుచ్చుంది. ఉత్త చేతులతో ఇంటికొచ్చింది. 'ఏందిబ్బా ఇంత తమాషా!' అనుకుంది. ఇంట్లో అత్తని అడుగుదామనుకుంది. ఆయమ్మ మాట్లాడేది తక్కువా, అరిసేది ఎక్కువా అని మానుకుంది.

**అ లా గా!**



జర్మన్ చరిత్రలోని కీలకమైన సంఘటనలు నవంబర్ 9వ తేదీనే సంభవించాయి. మొదటగా 1918 నవంబర్ 9న నాటి జర్మన్ చక్రవర్తి కైజర్ విల్‌హెల్మ్–II పదవీచ్యుతి పొందాడు. 1923లో అదే రోజు హిట్లర్ నేతృత్వంలోని నాజీలు మ్యూనిక్‌లో నాటి జర్మన్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి విఫలయత్నం చేశారు. 1938లో అదే రోజు నాజీలు జర్మన్‌లోని యూదులను ఊచకోత కోశారు. చివరిగా 1989లో అదే రోజున బెర్లిన్‌గోడ కూల్చివేత జరిగింది.

సాయంకాలమైనాక ఇంటి పక్కన ముసిలాయమ్మొచ్చి బయట అరుగు మింద కుచ్చుంది. కసువు నూకుదామని పరక తీస్కోని బయటికొచ్చిన అమీనాని చూసి ''ఏం పాపా, ఎట్లున్నావు?'' అని ఎచ్చరిచ్చింది.

''బాగున్నా అవ్వా, నువ్వెట్లున్నావు?'' అనడిగింది అమీనా.

''ఊరు పొమ్మంటాంది, కాడు రమ్మంటాంది. అట్లనే బతుకుతాండా'' అని చెప్పింది ముసిలాయమ్మ.

అమీనాకి నవ్వొచ్చింది కానీ ఆపుకోని ''కాపీ తాగినావావ్వా?'' అనడిగింది.

''ఇంగా లేదుమ్మా, కాపీ మాటేం గానీ నువ్వు కొడవలి తీసుకోని యాడికో పోతివే పొద్దన. సేను కాడికా?'' అనడిగింది ముసిలాయమ్మ.

''అవునువ్వా, పశువులకి రోంత పచ్చిగెడ్డి ఏమన్నా దొరుకుతాదేమోనని పోతిని. యాడే గాని కనపరాల్యా'' అని చెప్పింది కసువు నూక్కుంట.

ముసిలాయమ్మ నగింది. నోట్లో మిగిలినే నాలుగు పళ్ళు కనిపిచ్చేటట్లు నగింది.

''ఏం వ్వా, అట్ల నగుతాన్నావ్?'' అనడిగింది అమీనాకి అర్థంకాక.

''ఈ ఊర్లో పచ్చిగెడ్డి యాడిది పాపా. ఎనభై ఏళ్ళయింది నేను పుట్టి. ఈ ఊర్లోనే పుట్టి, ఈడే పెండ్లి చేస్కోని కాపురం చేసినా. నా పిల్లోళ్ళ పిల్లోళ్ళు కూడా పెద్దగైనారు. ఈ పొద్దుటిదాంక పచ్చిగెడ్డి అనేదే పెట్టింది లేదు పశువులకి'' అని చెప్పి ఆపింది.

ముసిలాయమ్మ ఏం చెప్తాందో అర్థం కాలేదు అమీనాకి.

మళ్ళా ముసిలాయమ్మే ''మనూరు కొండమింద గదా ఉండేది. బోరుకి నీళ్ళు పడవు. పడినా తాగేకి సరిపోతాయి గానీ సేద్యానికి సాలవు'' అని చెప్పింది.

దావెంబడి ఎంతసేపు నడిసినా శనగలు, కుసాలు, ఆముదాలే ఎందుకు కనపడినాయో అప్పుడర్థమైంది అమీనాకి.

''ఈ మాటే తెలీదువ్వా నాకు'' అనింది అమీనా.

''తెలీక ఏం పాపా, కొండ మింద ఉన్నే ఊర్లో ఇట్లే ఉండేది.''

''ఏమో, మా ఆవు వట్టిగెడ్డి సరిగ్గా తినడం ల్యా. మా ఊర్లో పచ్చిగెడ్డి బాగలవాటు. అందుకే దొరుకుతాదేమో అని పోతిని'' కసువు నూకేది అయిపోయింది.

''యాడ పచ్చిగెడ్డిలే పాపా, పశువుల గురించి ఆలోచిస్తేనే పాపం అనిపిస్తాది. ఈ ఊర్లోని పశువులకి అసలు పచ్చిగెడ్డి అనేది ఒకటుంటాదని గూడా తెల్దు. శనగపొట్టు, సొప్ప, కడుగునీళ్ళల్లో అన్నం కలిపి పెట్టేది, పశువుల దాణా నీళ్ళల్లో కలిపి పెట్టేది – ఇవే తిండి. పాపం ఇవి తినే, పాలు ఇంతగా ఇస్తాన్నాయి. ఇంత ఆరోగ్గెంగా ఉంటాన్నాయి. ఇంగ పచ్చిగెడ్డి గనక దొరికితే ఇంగెన్ని పాలిస్తాయో, ఇంగెంత ఆరోగ్గెంగా ఉంటాయో...'' అని చెప్తా పోతాంది ముసిలాయమ్మ.

కసువు దిబ్బలో పోసొచ్చి పక్కనే కుచ్చుంది అమీనా.

''పెళ్ళికో, తిరుణాలకో వేరే ఊరు పోతే ఆడున్నే పశువులని చూసి ఇవి ఎంత అదృష్టం చేసుకున్నాయో అనుకుంటా. మనూరి పశువులు గుర్తుకొస్తాయి అప్పుడు. మనూరోళ్ళు ఎవురన్నా పశువులని కొండ కిందున్నే ఊర్లకి అమ్మితే పచ్చిగెడ్డి తిని బాగా బతుకుతాయిలే ఇంగ అనుకుంటారు. ఎంతో అవసరమయితే తప్ప వేరే ఊరి నుండి మనూరికి పిల్చుకోని రారు.

ఈడే పుట్టిండేటివి అయితే ఇట్లే అలవాటు పడతాయిలే. అట్లాటిది మీ ఊరి నుండి తెచ్చినావు పాపా ఈ ఆవుని. యాడ అలవాటైతాది?'' అనడిగింది అమీనాని.

''అదేవ్వా, నేను కూడా అదే అనుకుంటాన్నా నువ్వు చెప్పాంటే'' అనింది అమీనా.

ముసిలాయమ్మ ముందుకి వంగి ''అవు పాపా, మీయత్త బానే ఉంటాదా నీతో, గొడవలేం పడదా?'' అనడిగింది గుసగుసలాడుతున్నట్లే.

అమీనా ఆ పక్కా, ఈ పక్కా చూసి ఎవరూ లేరని నిర్ధారించుకోని సన్నగా ''ఏం

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

చెప్పేదిలేవ్వా. చానా అద్మానం మనిషి. అన్నం ఎక్కువసేపు తింటే గొడవే. అందరికన్నా ముందే తిన్నా గొడవే. తిండిలేని చోటు నుండి చేసుకొచ్చుకున్యాం. అదీ ఇదీ అని ఎన్ని మాటలంటుందో'' అని చెప్పింది.

''అంటే అనుకోనీలే పాపా, నువ్వు ఆయమ్మ నోటికి తగలాకు. గొడవేస్కుందంటే ఇంగ అయిపాయ. పనికి పోయినే సాట ఆయమ్మని ఎచ్చరించల్లన్నా భయమే...'' అని చెప్పి చిన్నగ అరుగు మింది నుండి లేసింది ముసిలాయమ్మ.

ఎట్లా పచ్చిగెడ్డి దొరకదని తెలిసినాక ఇంగ ఉండే వాటిల్లోనే ఆవు ఏమి బాగ తింటుందో చూసి కడుపు నిండా కాకపోయినా ఒకరకంగా తినేటట్టు ప్రయత్నిస్తాంది అమీనా.

అట్లనే ఆరు నెలలు గడిసిపోయినాయి. ఆవుకి ఇంగా అలవాటు కాలేదు ఊరు. అమీనాకి అప్పుడప్పుడే అలవాటయితాన్నాయి ఆ ఇల్లు, అత్త తిట్లు. ''ఏమ్మా, ఏమన్నా విశేషమా?'' అని అడిగేటోళ్ళు ఎక్కువైనారు. ఇంగా ఏమీ లేదు అని చెప్పేకి సాలయితాంది అమీనాకి. ఇంగో వైపు వాళ్ళత్త. కొంచేపు కుచ్చోని కనిపిస్తే సాలు యాదో ఒక పని చెప్తుంది. చేసేది కొంచెం ఆలస్యమైనా నోటికొచ్చిందేది తిడ్తుంది. ఆ తిట్టేది గూడా పని చేసేటప్పుడు కాక అన్నం తినేకి కుచ్చుంటానే మొదులుపెడ్తుంది. ఆ తిట్లు తినుకుంట అన్నం లోపలికి పోదు. చెయ్యి కడుక్కోని మళ్ళా పనిలో పడిపోతుంది అమీనా.

మొగునికి చెప్పి చూసింది, లాభం లేదు. పుట్టింట్లో వాళ్ళకి చెప్పి చూసింది. ''మామూలేమ్మా ఇంగా, సర్దుకుపోవల్ల'' అని చెప్పినారు. ఎవరికీ పట్టినట్టు అనిపించల్యా. ఇంగో పక్క ఆవు పరిస్థితి బాల్యాకుండా పోతాంది. జీవితమంతా ఎట్లో అనుకుంటే, ఇంగెట్లో పోతాన్నెట్లు అనిపిస్తాంది.

ఇంట్లో పని, సేన్లో పని, పశువుల పని ఈ మూడింటితోనే సరిపోతాంది.

పెండ్లిగాకముందు కూడా చేసేది ఇవే పనులే అయినా ఏందో ఇప్పుడంతా మారిపోయినట్లు అనిపిస్తాంది. చుట్టూ యాడ చూసినా పచ్చటిపొలాలు కనపడే ఊరి నుండి వచ్చినే అమీనాకి ఆ సిమెంటు ఫ్యాక్టరీ, ఆ విండు మిల్లులు, గెడ్డి లేని సేన్లు చూస్తాంటే ఎక్కడి నుంచి ఎక్కడికొచ్చి పడినానో అనిపిస్తాంది.

ఊర్లో ఉన్నెప్పుడు సేనుకి పోయి వస్తా వస్తా పెన్నేట్లో ఆడుకున్నేది గుర్తుకొస్తాది. సాయంత్రం ఇంటికొచ్చేటప్పుడు పచ్చిగెడ్డి మోపు తీసుకొచ్చి పశువులకి పెట్టేది గుర్తుకొస్తాది. టీవీ ఆన్ చేస్కోని తట్టలో అన్నం, పప్పు, చెనిక్కాయల పొడి, నెయ్యి పెట్టుకోని టీవీ చూస్కుంట ఎంచేపు కావల్సింటే అంచేపు తినేది గుర్తుకొస్తాది. కాపీ చేస్కోని లోటాలో ఏస్కోని బయట అరుగుమింద కుచ్చోని తాగేది గుర్తుకొస్తాది.

మళ్ళా ఇంతకుముందు మాదిరి ఎప్పటికైనా అయితాదా అని ఆలోచించీ, ఆలోచించీ ఒక నిర్ణయానికొచ్చింది. తనకెట్లా తప్పదు. యాదో ఒకరోజు తనకి నచ్చినట్లు మార్చుకోనీకి ప్రయత్నించల్ల.

అప్పటిదాకా ఇట్లనే. కానీ ఆవెందుకు ఆకలికి ఉండల్ల. దాని తిండిని, దాని ఆరోగ్యాన్ని నా మూలాన ఎందుకు దూరం చేయల్ల అనుకుంది.

పుట్టింటోళ్ళని పిలిపిచ్చింది. ఆవుని తీస్కోపొమ్మని చెప్పింది. ఒకనాడు లగేజ్ ఆటో తెచ్చి ఆవుని తీసకపోయినారు పుట్టింటోళ్ళు. చానా బాధ పడతానే పంపింది. ఆవు పోనంటే పోనని మొండికేసి పోయింది.

ఆరోజంతా ఏడుస్తానే పండుకుంది అమీనా. మళ్ళా ఇంటికి పోన్ చేసి 'ఆవెట్లుంది, బాగా తింటాంద్యా లేదా' అనడిగింది. 'బాగా తింటాంది, ఇప్పుడు బాగుంది' అని చెప్తే సంబరపడిపోయింది.

ఆవిప్పుడు కడుపు నిండా తింటాంది, అమీనా తినేది ఎప్పుడో..!?

## కథాకళి

FEED ME A STORY

**19.7.2026 ఫన్‌డేలో ప్రచురించిన 'ఆవిరి' కథకి పాఠకులు సూచించిన టాప్ 5 పేర్లు.**

షి'కారు' లెస్సన్
ఎ.వి.సోమయాజులు, కాకినాడ

ప్రెషర్ వాల్వ్
ఆదిత్య జానకి, ఆస్ట్రేలియా

యంత్రం నేర్పిన మంత్రం
టి.సూర్యకుమారి, హైదరాబాద్

గ్రహింపు
ఎ.బి.సి.రాంబాబు, బెంగళూరు

పశ్చాత్తాపం
అంపోలు సత్యనారాయణ, చీపురుపల్లి

చందర గోళం

# భూమికి రెండో చందమామ!



భూమికి ఉపగ్రహంగా చందమామ ఉన్న సంగతి మనకు తెలుసు. ఇప్పటి వరకు భూమి చుట్టూ తిరిగే చందమామ ఒక్కటే అని అనుకుంటున్నాం. కాని, శాస్త్రవేత్తలు ఇటీవల భూమి చుట్టూ తిరిగే మరో చిన్న చందమామను కూడా కనుగొన్నారు. తొలిసారిగా దీనిని హవాయిలోని 'పాన్ స్టార్స్1' ఆస్టిరాయిడ్ టెలిస్కోప్ ద్వారా దశాబ్దం కిందటే శాస్త్రవేత్తలు గమనించారు.

తొలిసారిగా చైనా అంతరిక్ష పరిశోధన సంస్థకు చెందిన ఉపగ్రహం ఈ రెండో చందమామ ఫొటోలు తీసి, భూమ్మీదనున్న అంతరిక్ష పరిశోధన కేంద్రానికి పంపింది. చైనా పంపిన 'టియాన్‌వెన్-2' ఉపగ్రహం వందకోట్ల కిలోమీటర్ల దూరం ప్రయాణించి, రెండో చందమామ ఫొటోను విజయవంతంగా తీయగలిగింది. అంతేకాదు, దీనిపైనున్న శిలలను కూడా సేకరించింది. ఇది పూర్తిస్థాయి ఉపగ్రహం కాదని, గ్రహశకలం మాత్రమేనని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

భూ కక్ష్యలో భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న '2016 హెచ్‌ఓ3' అనే ఈ రెండో చందమామను 'భూ కక్ష్యలో పరిభ్రమించే సహ గ్రహవస్తువు' మాత్రమేనని చైనా భౌతిక శాస్త్రవేత్త రోంగ్‌కియావో ఝూంగ్ అభిప్రాయపడుతున్నారు. అయితే, మరికొందరు శాస్త్రవేత్తలు దీనిని 'మైక్రో మూన్'గా- అంటే, చిరుజాబిలిగా అభివర్ణిస్తున్నారు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

SUNDAY
విశాలాంధ్ర
ఆదివారం అనుబంధం
4 | 02 ఆదివారం, ఆగస్టు 2026

మధుకర్ కూతురు ఆమనికి ఫోన్‌చేసి 'నా రెండో పెళ్లి విషయంలో నీ అభిప్రాయం ఏంటమ్మా? తాతగారు కూడా ఒత్తిడి చేస్తున్నారు' అని అడిగాడు.

'మీరు పెళ్లి చేసుకోదలుచుకుంటే మాకిద్దామనుకున్న ఆస్తులు మాకిచ్చేసి పెళ్లి చేసుకోండి. మీ పెళ్ళైపోయి అవన్నీ ఆవిడకి చెందితే , 'మీనాన్న మీకేమిచ్చాడు?' అని మా అత్తగారు దెప్పిపోస్తుంది జీవితాంతం. మా తరపు బంధువులంతా సూటిపోటీ మాటలతో అవకాశం వచ్చినప్పుడల్లా పొడుస్తూనే ఉంటారు. ఇక నాకు పుట్టిల్లు ఆశకూడా పూర్తిగా చచ్చిపోయినట్టే. మీరు రిటైరయ్యాక మేము చూడకపోతే మాది తప్పు. మా అమ్మ ఎలాగూలేదు. మీరు కూడా ఈ వయసులో పెళ్లి చేసుకుని దూరం అయిపోతే మాకు దిక్కెవరు చెప్పండి?' అంది మధుకర్ కూతురు ఆమని తండ్రితో.

'నేను ముసలి వయసులో మీకు భారం కాకూడదని.' అన్నాడతను.

'మీరు మాకేం భారం? మీరు రిటైర్ అయ్యాక వచ్చే బెనిఫిట్స్ అన్ని తమ్ముడికి, నాకు చెరో సగం ఇచ్చేయండి. మీ ఆరునెలలు వాడితో, ఆరునెలలు మాతో ఉండండి. ఎవరింట్లో ఉంటే వాళ్లకి మీ పింఛనులో సగం ఇవ్వండి. మిగతావి మీ మందుల ఖర్చుల నిమిత్తం ఉంచుకోండి. ఇలా చేసుకునే దానికి ఈ వయసులో మీకు పెళ్లి అవసరమా? ఆవిడ ఎంత మమ్మల్ని ఆప్యాయంగా చూసినా 'మా అమ్మ' కాలేదుగా...ముఖ్యంగా ఈ వయసులో...' తన భవిష్యత్తుని అయిదు వాక్యాల తీర్పుతో నిర్ణయించేసిన కూతురికి ఏమని సమాధానం చెప్పాలో తెలియలేదు మధుకర్‌కి ఒక్క క్షణం. 'మొత్తానికి లాయరుగారి భార్యవి అనిపించుకున్నావ్' అనుకున్నాడు మనసులో...

'రేపు నాకు వచ్చే భరణంలో సగం ఆవిడకు వస్తే ఒక జీవి సుఖంగా జీవిస్తుంది కదమ్మా...'

'ఓహో...అంటే మీరు బయటవాళ్లని ఉద్ధరించడానికి నిర్ణయించుకున్నారన్నమాట. మీరా నిర్ణయం తీసుకున్నాక ఇక మా అభిప్రాయంతో పని ఏముంది?' అని ఫోన్ పెట్టేసింది మరోమాటకు తావివ్వకుండా...

కొడుక్కి ఫోన్ చేసి పెళ్లి విషయంచెప్పి 'అక్కని అడిగితే అలా అందిరా....ఈ విషయంలో నీ అభిప్రాయం కూడా చెప్పు' అన్నాడు మధుకర్.

'పనిలో ఉన్నాను నాన్న, సరిగ్గా పదినిముషాలలో ఫోన్ చేస్తాను' అని ఫోన్ కట్ చేశాడు కొడుకు శ్రావణ్.

పని ఉండి కాదని, ఈ విషయం భార్యతో చర్చించే సమయమని నవ్వుకున్నాడు మధుకర్.

సరిగ్గా పదకొండవ నిముషంలో 'అక్క చెప్పినట్టు చేసెయ్యండి నాన్నా, దాని అభిప్రాయమే నా అభిప్రాయం. తాతగారు ఒప్పుకున్నారా?' అడిగాడు.







# భాగింపబడిన జీవితం!

కథ

కొత్తపల్లి ఉదయబాబు
9533756075

'నాకు ఈ వయసులో పెళ్లేమిటి నాన్న? ఎవరైనా వింటే నవ్విపోతారు. మళ్లీనెలే నా రిటైర్మెంట్. మర్చిపోయారా?'

తండ్రికి టిఫిన్ పెడుతూ అన్నాడు మధుకర్.

ఆయన మాట్లాడలేదు. టిఫిన్ చేసేటప్పుడు ఆయన ఒక్కమాట మాట్లాడరు. టిఫిన్ అయ్యాక సింక్ దగ్గర చెయ్యి కడిగేసుకుని వచ్చి కుర్చీలో కూర్చుంటూ అన్నారు. 'ఒక్క పదినిముషాలు కూర్చో. నేను చెప్పేది ఆఖరిసారి విను. ఇదివరకు చాలాసార్లు చెప్పాగానీ నువ్ పట్టించుకోలేదు. ప్లీజ్' రిక్వెస్ట్‌గా అడిగేసరికి కాదనలేకపోయాడు మధుకర్. తండ్రితిన్న టిఫిన్ ప్లేట్ మోరీలో పడేసి వచ్చి తండ్రికెదురుగ కూర్చుని 'చెప్పండి' అన్నాడు.

'నీభార్య పోయి 8సంవత్సరాలు అయింది. కోడలని చెప్పుకో కూడదుగాని కవిత బతికి ఉన్నంతకాలం తన కుటుంబంకోసం, ముఖ్యంగా నీ పిల్లలకోసం బతికింది. దురదృష్టం. నిండు నూరేళ్లు సుఖంగా బతకాల్సిన ఆమె హఠాత్తుగా గుండెపోటుతో మరణించడం నిజంగా మన దురదృష్టం. అప్పటికే తండ్రిగా నీ బాధ్యతలు చక్కగా నెరవేరుస్తూ పిల్లలిద్దరినీ చక్కగా చదివించావు. అమ్మాయికి చక్కని భర్తని చూసి పెళ్లిచేశావ్. మనవరాలిని ఎత్తుకున్నావు. వాళ్లు అన్యోన్యంగా ఉన్నారు. తర్వాత స్వయంకృషితో నీకొడుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించు కున్నాడు. నీ అనుమతితో ప్రేమించిన అమ్మాయిని పెళ్లిచేసుకుని ఇద్దరు మగపిల్లల తండ్రయి చక్కగా సంసారం చేసుకుంటున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న మీ అమ్మను, నన్ను నీ దగ్గర ఉంచుకుని కొడుకుగా నీ బాధ్యత చక్కగా నెరవేర్చుతున్నావు. నా దురదృష్టం. మీ అమ్మ ఎక్కువకాలం తీసుకోకుండానే పోయింది.

కానీ నా బాధ్యత నీకు తప్పలేదు. పోనీ వృద్ధాశ్రమంలో చేరిపోతానురా అంటే వినవ్.

మనిషి కుటుంబంకోసం బతికేరోజులు పోతున్నాయి నాన్న... కేవలం తన కోసం తాను బతికేరోజులు వచ్చేశాయి. బాధ్యతలు నెరవేర్చేవరకే కుటుంబం. అవి నెరవేర్చాకా భర్తకు భార్య, భార్యకు భర్త. ఈ ఇద్దరిలో ఎవరో ఒకరు ముందు పోకతప్పదు. భర్తపోయిన భార్య అతని జ్ఞాపకాలతో ఎవరో ఒకరి పంచనచేరి తన బతుకు వెళ్లదీసుకోగలదు. కానీ మగవాడు అలా బతకలేడయ్యా.

కొడుకు నీ వాడుగానీ, కోడలు పరాయి ఇంటిబిడ్డేకదా. ఒక నెల బాగా చూస్తుంది. మహాఅయితే రెండునెలలు మర్యాదగా చూస్తుంది. ఆ తరువాత? ఉద్యోగవిరమణ అయ్యాక మనిషి మనశ్శాంతిగా, ఆరోగ్యంగా బతకాలి. అలా బతకాలంటే నీకూ ఒకతోడు కావాలి. నువ్వుకూడా సుఖంగా బతకాలని నా ప్రగాఢ కోరిక. నామీద నీకు ఏమాత్రం అభిమానమున్నా రెండోపెళ్లి చేసుకో. ప్లీజ్.'

'సరే నాన్న. మీరు చెప్పినట్టే చేసుకుంటాను. నేను పెళ్లిచేసుకోవా లంటే ఆవిడకి కనీసం 50 ఏళ్లుండాలి. ఆ వయసుకు కూడా వివాహంకాని ఆడవాళ్లు ఎక్కడోగాని దొరకరు. ఉన్నా నాకు తెలిసి వయసులో కనీస కోరికలు తీరక, ఎదుటివారిని ఏడిపించి తృప్తిపడే మనస్తత్వం ఎక్కువగా ఉన్నవారుగా ఉంటారు.

ఇక రెండోవర్గానికి వస్తే భర్తపోయి పిల్లలున్న వాళ్లు. ఉన్న ఆ పిల్లలూ చిన్నవాళ్లైతే విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో మళ్లీ వాళ్ల బాధ్యతలు మనం నెత్తికెత్తుకోవడం అవసరమా?...50 ఏళ్ల వయసు వచ్చినావిడకి ఏదోఒక అనారోగ్య సమస్య వుండి తీరుతుంది. మళ్లీ నాపని పెనంమీద నుంచి పొయ్యిలోకే.

అదృష్టవంతుడిని పాడుచేయలేరు. దురదృష్ట వంతుడిని బాగుచేయలేరు అంటారు. పెద మామయ్య విషయమే తీసుకోండి. పిల్లలు పుట్టక పెద్దఅత్తయ్య పదిమంది చేత గొడ్రాలు అనిపించుకుని ఆ మానసికవేదనతోనే పోయింది. మామయ్యకి బోలెడు భవిష్యత్తు ఉందని మీ పెద్దలందరూ రెండోపెళ్లి చేశారు. భగవంతుని దయవల్ల ఈమెకు నలుగురు పిల్లలు పుట్టారు. అమ్మాయిలకు పెళ్లిళ్లు అయ్యాక ఈ అత్తయ్య కూడా పోయింది. ఆడదక్షతలేని ఆ కుటుంబంలో మగపిల్లలిద్దరూ వెధవల్లా తయారయ్యి మావయ్యని ఏడిపించుకు తింటున్నారు. పెళ్లిళ్లుకాని ఆ కొడుకులకు వండిపెడుతూ మావయ్య బతుకీడుస్తున్నాడు.



ఏం వచ్చినా రాకపోయినా మేనమామ పోలికలు వస్తాయంటారు. నేనసలే నష్ట జాతకుడిని. రేపలా జరిగిందనుకోండి. నన్ను పట్టించుకునే పిల్లలు కూడా ఉండరు.

'మేము చూడమన్నామా...ఆయనే కొవ్వెక్కి బలుపుతీరక పెళ్లిచేసుకున్నాడంటారు. అవన్నీ అవసరమా చెప్పండి. బతుకును వెళ్లదీసుకోదలుచుకున్నవాడు రాజీపడక తప్పదండి.' అన్నాడు లేవబోతూ.

'నెగటివ్‌గా ఎందుకు ఆలోచిస్తావ్? నీకు పాజిటివ్ జరగచ్చేమో?' అన్నారాయన సాఫీగా.

'అదైనా ఫిఫ్టీ...ఫిఫ్టీ చాన్సేస్సే. మీరు నా మంచికోరి చెప్పారు. తప్పనిసరిగా మీరు చెప్పిందీ ఆలోచిస్తాను. భోజనానికి అన్నీ టేబుల్‌మీద రెడీచేసి పెట్టాను. కడుపునిండా తినండి. నేవెళ్లొస్తాను మరి...' అన్నాడు మధుకర్ ఆఫీసుకు బయల్దేరబోతూ...

కొడుకు వెళ్లిపోయాక వీధి తలుపువేసి ఆయన తన గదిలోకి నిష్క్రమించారు.

× × ×

ఆ సాయంత్రమే ఆఫీసు నుంచి వచ్చాక తండ్రితో అన్నాడు మధుకర్ 'మీరు విషయం కదిపిన శుభముహూర్తం సంగతేమోగానీ ఈ వేళ ఆఫీసుకి లంచ్ అవర్లో ఎవరో వచ్చారు నాన్న. ఆయన రాజమండ్రి టెలికాం డిపార్టుమెంటులో ఎ.ఈ.గా చేస్తున్నారట. పెళ్లయి భర్తపోయిన చెల్లెలు ఉందట. పిల్లలులేరట. మనిషి ఆరోగ్యంగానే ఉందట. ఎపుడూ దైవధ్యానంలోనే ఉంటూ దైవ సంబంధ సామాజిక సేవల్లో కార్యకర్తగా చేస్తోందట. ఈ వూరి హౌసింగ్‌బోర్డు కాలనీలో వాళ్ల పెద్దన్నయ్య దగ్గర ఉంటోందట. ఆయన వచ్చి మీతో మాట్లాడి అప్పుడు వాళ్ల ఇంటికి తీసుకువెళ్తాడట. మీరు వెళ్తే అన్ని విషయాలు కూలంకషంగా మాట్లాడండి.'

'అమ్మయ్య. కొంత ఆలోచించాడన్నమాట.' అనుకున్నారాయన.

× × ×

మధుకర్ కూతురు ఆమనికి ఫోన్‌చేసి 'నా రెండో పెళ్లి విషయంలో నీ అభిప్రాయం ఏంటమ్మా? తాతగారు కూడా ఒత్తిడి చేస్తున్నారు' అని అడిగాడు.

'మీరు పెళ్లి చేసుకోదలుచుకుంటే మాకిద్దామనుకున్న ఆస్తులు మాకిచ్చేసి పెళ్లి చేసుకోండి. మీ పెళ్ళైపోయి అవన్నీ ఆవిడకిచెందితే, 'మీనాన్న మీకేమిచ్చాడు?' అని మా అత్తగారు దెప్పిపోస్తుంది జీవితాంతం. మా తరపు బంధువులంతా సూటిపోటీమాటలతో అవకాశం వచ్చినప్పుడల్లా పొడుస్తూనే ఉంటారు. ఇక నాకు పుట్టిల్లు ఆశకూడా (మిగతా 5వ పేజీలో)

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# భాగింపబడిన జీవితం!

(కథ-4వ పేజీ తరువాయి)

పూర్తిగా చచ్చిపోయినట్టే. మీరు రిటైరయ్యాక మేము చూడకపోతే మాదితప్పు. మా అమ్మ ఎలాగూ లేదు. మీరు కూడా ఈ వయసులో పెళ్లి చేసుకుని దూరం అయిపోతే మాకు దిక్కెవరు చెప్పండి?' అంది మధుకర్ కూతురు ఆమని తండ్రితో.

'నేను ముసలి వయసులో మీకు భారం కాకూడదని.' అన్నాడతను.

'మీరు మాకేం భారం? మీరు రిటైర్ అయ్యాక వచ్చే బెనిఫిట్స్ అన్ని తమ్ముడికి, నాకు చెరో సగం ఇచ్చేయండి. మీ ఆరునెలలు వాడితో, ఆరునెలలు మాతో ఉండండి. ఎవరింట్లో ఉంటే వాళ్లకి మీ పింఛనులో సగం ఇవ్వండి. మిగతావి మీ మందుల ఖర్చుల నిమిత్తం ఉంచుకోండి. ఇలా చేసుకునే దానికి ఈ వయసులో మీకు పెళ్లిఅవసరమా? ఆవిడ ఎంత మమ్మల్ని ఆప్యాయంగా చూసినా 'మా అమ్మ' కాలేదుగా...ముఖ్యంగా ఈ వయసులో...' తన భవిష్యత్తుని అయిదువాక్యాల తీర్పుతో నిర్ణయించేసిన కూతురికి ఏమని సమాధానం చెప్పాలో తెలియలేదు మధుకర్‌కి ఒక్క క్షణం. 'మొత్తానికి లాయరుగారి భార్యవి అనిపించుకున్నావ్' అనుకున్నాడు మనసులో...

'రేపు నాకు వచ్చే భరణంలో సగం ఆవిడకు వస్తే ఒక జీవి సుఖంగా జీవిస్తుంది కదమ్మా...'

'ఓహో...అంటే మీరు బయటవాళ్లని ఉద్ధరించ దానికి నిర్ణయించుకున్నారన్నమాట. మీరా నిర్ణయం తీసుకున్నాక ఇక మాఅభిప్రాయంతో పని ఏముంది?' అని ఫోన్‌పెట్టేసింది మరోమాటకు తావివ్వకుండా...

కొడుక్కి ఫోన్ చేసి పెళ్లి విషయంచెప్పి 'అక్కని అడిగితే అలా అందిరా....ఈ విషయంలో నీ అభిప్రాయం కూడా చెప్పు' అన్నాడు మధుకర్.

'పనిలో ఉన్నాను నాన్న. సరిగ్గా పదినిముషా లలో ఫోన్ చేస్తాను' అని ఫోన్ కట్ చేశాడు కొడుకు శ్రావణ్.

పని ఉండి కాదని, ఈ విషయం భార్యతో చర్చించే సమయమని నవ్వుకున్నాడు మధుకర్.

సరిగ్గా పదకొండవ నిముషంలో 'అక్క చెప్పినట్టు చేసెయ్యండి నాన్నా. దాని అభిప్రాయమే నా అభిప్రాయం. తాతగారు ఒప్పుకున్నారా?' అడిగాడు.

'ఇదంతా ఆయన ప్రయత్నమే...నాకు ఇష్టమోకాదో మీకుతెలుసుగా...' అన్నాడు మధుకర్.

'ఓహో...ఇదంతా ఆయన నిర్వాకమా? సరే... అలాగే కానివ్వండి అక్కచెప్పినట్టు.' అని ఫోన్ పెట్టేశాడు శ్రావణ్.

× × ×

పిల్లలు కోరినట్లుగానే తను వాళ్లకి ఇవ్వాల్సిన ఆస్తిని పెళ్లికి ముందే రిజిస్ట్రేషన్ చేసేశాడు మధుకర్.

పదిహేనురోజుల్లోనే అరుంధతితో మధుకర్ వివాహం రిజిస్ట్రార్ ఆఫీస్‌లో ముఖ్యుల సమక్షంలో జరిగిపోయింది. ఆమని, శ్రావణ్ కుటుంబాలతో రావడం మధుకర్‌కి, తాతగారికి చాలా ఆనందమని పించింది. వాళ్లు నవ్వుతూ సంతోషంగా ఉండటం చూసి మరీ సంతోషపడ్డాడాయన.

అయితే వాళ్ల సంతోషానికి కారణం తానేనని, మరేనాడు తండ్రిని తమ దగ్గర ఉంచుకోనవసరం లేకుండాచేసి తమ బాధ్యతను తగ్గించిన తాలూకు సంతోషమని పెద్దాయనకు తెలీలేదు. పైగా తన కొడుకు తనకష్టార్జితాన్ని తన మనవలకు రిజిస్ట్రేషన్ చేసిన విషయంకూడా తనకు తెలియకుండా జాగ్రత్త పడ్డాడన్న విషయంకూడా ముసలాయనకు తెలీదు పాపం.

అరుంధతి సాహచర్యంలో మధుకర్ జీవితం ఆనందంగానే సాగుతోంది. ఉద్యోగవిరమణ అనంతరం బెజవాడ కనకదుర్గమ్మ, భద్రాచలం సీతారాములు, తిరుపతి వెంకన్న, అన్నవరం సత్యదేవుని దర్శించుకున్నారు.

పిల్లలు ఎప్పుడో ఒకసారిరావడం రెండురోజులు ఉండి వెళ్లడం. వచ్చినప్పుడల్లా వాళ్ల కష్టసుఖాలు ఏకరువు పెట్టడం, 'నానా ఇబ్బందుల్లోను ఉన్నాం' తోచిన సాయం చేయమని అడగడం అలవాటుగా చేసుకున్నారు. ముఖ్యంగా కూతురైతే మరీను. 'నాలుగు రోజులు వచ్చివెళ్లమ్మా' అంటే 'పిల్లలకి స్కూలు పోతుందనో, మా ఆయనకి భోజనం కుదరదు అనో వంకపెట్టేస్తుంది.

'మేము రావడం కుదరదుగానీ పిల్లలకు ఫీజు ఇన్స్టాల్మెంట్ కట్టాలి పదివేలు సాయంచెయ్యండి' అని నిర్మొహమాటంగా అడిగేస్తోంది.

మధుకర్ ఆ విషయంలో చాలా బాధపడ్డాడు.

'నాన్నా. ఆవిడతో మీ జీవితం సుఖంగా సాగించండి. వేళపట్టుకుతిని ఓపిక ఉన్నంతవరకు ఇదివరకు చూడని పుణ్యక్షేత్రాలు దర్శించిరండి' అంటారేమోనని చాలా ఆశపడ్డాడు. తప్పదని కాబోలు కొడుకు, కోడలు మాత్రం 'మీకు బోర్ కొట్టినప్పుడు మా ఇంట్లో పదిరోజులుండి వెళ్లండి' అని చెప్పారు.

'ఇద్దరు జంటలూ పిల్లలతో సహా వచ్చి ఉండండర్రా. మనవలు మాకలవాటవుతారు' అన్నాడు మధుకర్.

'మాకెక్కడ కుదురుతుంది నాన్నగారు. దసరాకి, సంక్రాంతికి ఇచ్చేసెలవులు ఆ కాన్వెంట్ వాళ్లు ఏడుస్తూ వారంరోజులిస్తే గొప్ప. మా అత్తవారింటికి



వెళ్లాలా? వాళ్లు చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే నాలుగు విజిటింగ్ ప్లేసెస్‌కి వెళ్లాలా? వేసవిసెలవుల్లొస్తే రాబోయే తరగతిలో బాగా చదవడానికి బ్రిడ్జి కోర్సెస్‌లో చేర్చాలా? లేదా వాళ్ల కిష్టమైన హాబీకి చెందిన కోచింగ్లో చేర్పించాలా? వీటన్నింటికి బోలెడంత డబ్బు కావాలి. మళ్లీ ఒకరిని చేర్చి ఇంకొకళ్లని చేర్పించకపోతే కోపాలు... తాపాలు. మాకు రావడం కుదరదుగానీ మీరే చుట్టంచూపుగా వచ్చివెళ్తుండాలి. మనవలతో మమ్మల్ని కలవనివ్వ లేదు అంటే కుదరదుమరి.' అన్నాడు శ్రావణ్.

ఇక మనవల్ని ఏ పదిహేనురోజులకో ఓసారి వీడియోచాట్‌లో చూపించడం...వాళ్లకి తాతగారు, మామ్మగారు అలవాటులేనందువల్ల ఇలా కనిపించి అలా ఆటలకి పారిపోవడం చేసేవారు.

ఒళ్లమండి 'మేము వస్తానంటే రావద్దంటారు. మీరురండర్రా అంటే కుదరదంటారు. ఎలా?' అని అడిగేశాడు పిల్లల్ని.

అరుంధతి ఎదురుగానే 'మీరు అమ్మపోయిన వెంటనే పెళ్లిచేసుకుంటే అప్పటికి మేమూ చిన్న పిల్లలం కాబట్టి పిన్నిగారితో అలవాటైపోయేది. మీరిద్దరూ జంటగా మా పెళ్లిళ్లుచేస్తే మాకూ ఎంతో ఆనందం అనిపించేది. కానీ ఈవయసులో మీరీ పెళ్లిచేసుకుని మమ్మల్ని వదిలించుకుందామని నిర్ణయించుకున్నారు. మేముమాత్రం ఏంచెయ్యం? మీరు ఒక్కరే ఉంటే మేమెక్కడికి వెళ్లినా మిమ్మల్నీ మాతోపాటే తీసుకుపోయేవాళ్లం. ఇప్పుడు మీ ఇబ్బందులు మీవి, మా ఇబ్బందులు మావి' అంది ఆమని.

'పోనీలెండి. వాళ్లు సుఖంగా తమ పిల్లలతో ఉన్నారు. మనం ఎందుకండీ వాళ్లని ఇబ్బంది పెట్టడం? వాళ్లకి వీలైనప్పుడే రానివ్వండి' అంది బాధపడుతూ అరుంధతి. మధుకర్‌కి అర్థమై పోయింది. ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలు రాజీపడరు. ఇకవాళ్లు కలవరు. మనవల్ని కలవనివ్వరు.

తోడుకోసం రెండో పెళ్లిచేసుకుని తప్పుచేశాడా? శారీరక సుఖం కోసం కానేకాదు. మానసిక శాంతి కూడా ఉండదా ఇక? ఉండదన్న జవాబు మూడో కోణం నుంచి వస్తుందని వూహించలేదు మధుకర్.

× × ×

'నాకు మనవల్ని చూడాలని వాళ్లతో ఆడుకోవాలని ఉంది అరుంధతి.' ఒక రాత్రి పక్క మీద పడుకుని వుండగా అన్నాడు భార్యతో.

'దానిదేముంది? వెళ్లి చూసి రెండురోజులుండి మీరు ఇవ్వాలనుకున్నది ముట్టచెప్పి వచ్చేయండి.'

'అదేంటి నువ్వురావా?'

'మీ కూతురు ఏం చెప్పిందో గుర్తుందా? వాళ్లకు నేను తల్లిని కాలేనట. అవును. ఎట్టి పరిస్థితుల్లోనూ కాలేను. ఈ యింటికి ఆ ఇల్లు ఎంత దూరమో ఆ ఇంటికి ఈ ఇల్లు అంతేదూరం. మిమ్మల్ని ఒక్కమాట అడుగుతాను. సమాధానం చెబుతారా?'

'నన్ను మనస్ఫూర్తిగా పెళ్లి చేసుకున్నారా?'

'ఇష్టపడి తోడుకోసం చేసుకున్నాను. ఎందుకు అడిగావ్?'

'ఈ వయసులో మనం శారీరక వాంఛలు తీరక వ్యామోహంతోనే పెళ్లి చేసుకున్నామని ఖచ్చితంగా అనుకుంటారు. ఆ రోజు మీమీద నమ్మకంతో నేను ఏమీ అడగలేదు. కానీ ఈరోజు మీ పిల్లలతీరు చూసి అడగకుండా వుండలేకపోతున్నాను.'

'మనలో ఎవరు ముందో ఎవరు వెనుకో తెలీదు. కాబట్టి నా జీవితం ప్రశాంతంగా వెళ్లడంకోసం ఒక గూడు యేర్పాటు చేయండి. ఇదొక్కటే నా కోరిక. పిల్లలు నాతోకలిసిపోతే ఇన్నాళ్లకు పెళ్లి అయినందుకు కనకపోయినా ఆ లోటు తీరు తుందనుకున్నాను. కానీ కలిసేతత్వం లేనపుడు నేనుకూడా వాళ్లను కలుపుకోలేను కదా.'

'చిన్నపిల్లలు. వాళ్లే తెలుసుకుంటారని భావించి క్షమించలేవా...'

'చూడండి. జీవితంలో ఏసుఖాలు నోచు కోకుండా కష్టపడి పనిచేస్తేనే రోజువెళ్తుంది అన్న పద్ధతిలో బతికిన ఒంటరిదాన్ని. కాస్తంత సుఖం శాంతి మీవల్ల లభించాయి. వాళ్లు పిన్నీ అంటూ నన్ను ఆదరించిననాడు నేనూ అంతే ఆప్యాయంగా వాళ్లని ఆదరిస్తాను. నన్ను తేలికభావంతో చూస్తే మాత్రం భరించలేను' రుద్ధకంఠంతో అని అటు తిరిగిపోయింది అరుంధతి.

మధుకర్‌కి ఒక విషయం అర్థమైంది. ఎవరి జీవిత భాగస్వాములతో వాళ్లు కష్టమో నష్టమో తను, పిల్లలు సుఖంగా ఉన్నారు. అటువంటప్పుడు సుఖంగా రోజు వెళ్లబుచ్చుకోవడం కన్నా చేసేది ఏమీలేదు. మాటలనుకుని మనసులు గాయపరుచు కోవడంకన్నా చిరునవ్వుతో వాటిని తోసేస్తూ బతికేస్తే ఈ చివరి పదేళ్ల జీవితం వెళ్లిపోతుంది.

అరుంధతి నిద్రపోయాక మధుకర్ అనుకున్నాడు. తమకే సమస్య వచ్చినా 'మీకేం మీరు పెళ్లిచేసుకుని సుఖంగాఉన్నారు. మాకే కష్టం వచ్చినా చెప్పుకోవ డానికి మాకే అమ్మలేదు.' అని పిల్లలు –

'మీరు కూడా నన్ను హీనంగా చూస్తే భరించే శక్తి నాకులేదు.' అని అరుంధతి.

'ఏవీ మనసులో పెట్టుకోకుండా కాలక్షేపం చెయ్యి నాన్న. చూడు! నేను ఎంత సుఖంగా బతుకు తున్నానో. నువు చూడబట్టేఅనుకో...' అని నాన్నగారు.

ఇవన్నీ తలుచుకోగానే మధుకర్ కళ్లల్లో ఒక్కసారి నీళ్లు తిరిగాయి...

తండ్రిచేత భాగింపబడిన తన జీవితంలో పిల్లలు గుణిజాలు...అరుంధతి జీవితాంతపు శేషం! భగవంతుడా నేను తప్పు చేశానా? రైటు చేశానా? అతని అంతరంగం ఘోషిస్తూనే ఉంది!



## తెలియటంలా...

తెలియటంలా... ఎవరిని అనుసరించాలో
ఎవరికి దూరమై నిలవాలో,
వెలుగును చూపే చేతిని పట్టాలో
వెలుగును దాచే నీడను వదలాలో॥

తెలియటంలా...ఏమి మాట్లాడాలో
ఏమి మౌనంగా దాచుకోవాలో,
ఒక మాట మనసును గెలుస్తుందని
ఒక మాట మనిషిని దూరం చేస్తుందని॥

తెలియటంలా...ఏమి చేయాలో
ఏమి చేయకూడదో,
ఆవేశపు అలల వెంట పోవాలో
ఆలోచనల ఒడ్డున నిలవాలో॥

తెలియటంలా...ఎలా బతకాలో
ఎంతగా నవ్వాలో,
మన కోసం మాత్రమే జీవించాలో
మనతోపాటు మరొకరిని వెలిగించాలో॥

తెలియటంలా...ఎవరిని ప్రేమించాలో
ఎవరిని జ్ఞాపకాలుగా మిగల్చుకోవాలో,
కళ్లను ఆకట్టుకునే రూపాన్నా
హృదయాన్ని హత్తుకునే స్వభావాన్నా॥

తెలియటంలా... ఏమి చూడాలో
ఏమి చూడనట్టే వదిలేయాలో,
లోపాలను లెక్కించాలో
లోకాన్ని ప్రేమించాలో॥

చివరికి తెలిసేదొక్కటే-నడకధర్మం వైపుండాలి,
నమ్మకం మంచితనం వైపుండాలి;
ప్రేమ మనసులను కలపాలి,
రాత మనుషులను మేల్కొలపాలి॥

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

కథ

# గూటిని మోసుకెళ్లే పిట్ట



ప్రసేన్,
70133 58154

కొన్ని కార్యకారణ సంబంధాలు ఎందుకు, ఎలా పరమ గందరగోళంగా ఉంటాయో ఎవరికీ తెలియదు. వీధిలో చెత్తను మునిసిపాలిటీ వాళ్లు ఎత్తుకుపోకపోవడానికి అంతకు ముందు రోజు రాత్రి అమెరికా అధ్యక్షుడూ, భారత దేశ ప్రధానమంత్రి హాట్‌లైన్‌లో తిట్టుకోవడం కారణం కావచ్చు. ఊయలలో పిల్లవాడి పిర్రమీద తల్లి ఒక్కటంటించడానికి ఇరాన్ ఇరాక్ యుద్ధం కారణమై ఉండొచ్చు. ఒక చీమ చక్కెర పలుకును మోసుకుపోతూ దారి మార్చడం వల్ల, ఎక్కడో ఒక ప్రభుత్వం కూలిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అట్లాంటిదే ఒక చిన్న సంఘటన దేశంలో కోట్లాదిమంది జీవితాలను గొలుసుకట్టు పరిణామాల్లోకి నెట్టేసింది.



---

ఆ దేశంలో ఆ చట్టం అమలులోకి రావడానికంటే మూడేళ్ల ముందు, ఒక వృద్ధుడు ఆ పట్టణానికి వచ్చాడు. ఎక్కడి నుంచి వచ్చాడో ఎలా వచ్చాడో ఎందుకు వచ్చాడో ఎవరికీ తెలియదు. రైల్వే స్టేషన్ ఎదురుగా పనిచేయని పాత గడియార స్తంభం కింద కూర్చునేవాడు. ఆ గడియారం పదకొండు గంటల పదిహేడు నిమిషాల దగ్గర ఎప్పుడో ఆగిపోయింది. కానీ వృద్ధుడు వచ్చిన తర్వాత, అర్ధరాత్రిళ్లు దాని ముళ్లు వెనక్కి తిరుగుతున్నాయని కొందరు చెప్పుకునేవారు. అతని పేరు ఎవరికీ తెలియదు.

పిల్లలు 'బూచోడు' అనేవారు. పెద్దలు 'కాలజ్ఞాని' అన్నారు. అతడు నడిస్తే అడుగుల చప్పుడు వినిపించేది కాదు. కానీ అతడు నిలబడిన చోట నేల కొద్దిగా కంపించేది. అతడి దుస్తుల నుంచి పాత పుస్తకాల వాసన, ఎండిన మట్టి వాసన వచ్చేవి. అతడి ఎడమ కన్ను గతాన్ని, కుడి కన్ను భవిష్యత్తును చూస్తాయని జనం నమ్మారు.

అతడి దగ్గర ఒక చిన్న చెక్కపెట్టె ఉండేది. ఆ పెట్టెలో భూమి పత్రాలు, తుప్పుపట్టిన తాళాలు, విరిగిన కళ్లద్దాలు, చనిపోయినవారి వెంట్రుకలు, పాత ఇళ్ల గోడల నుంచి ఊడిన సున్నం ముక్కలు ఉండేవి. ఎవరైనా అతడి దగ్గరికి వచ్చి తమ తండ్రి గురించి గొప్పగా చెప్పుకుంటే, అతడు ఒకటే ప్రశ్న అడిగేవాడు.

"మీ తండ్రి మీకు ఏమిచ్చాడు?"

"మూడు ఎకరాలు." "రెండు అంతస్తుల ఇల్లు." "నాలుగు దుకాణాలు." "బంగారం." "నగదు." రకరకాలుగా వచ్చిన సమాధానాలన్నీ విన్నాక అతడు పెట్టె తెరిచి చూపించేవాడు. లోపల ఖాళీ.

"అన్నీ చివరకు ఇక్కడికే వస్తాయి," అనేవాడు ఆ ఖాళీని చూపిస్తూ.

అది హాస్యమో, శాపమో ఎవరికీ అర్థమయ్యేది కాదు.

ఒకసారి ఓ పంతులుగారు అతడ్ని అడిగాడు.

"నీకెంతమంది పిల్లలు ?"

వృద్ధుడు నవ్వుతూ "నాకున్నవాళ్లంతా నన్ను వారసత్వంగా పొందారు. నేను వాళ్లను కాదు." అన్నాడు.

అర్థం కాక ఉపాధ్యాయుడు తల గోక్కున్నాడు

---

ఒక డిసెంబర్ రాత్రి, దేశ ప్రధానమంత్రి సచివాలయంలో ఒంటరిగా రహస్య ఫైళ్లు చూస్తున్నాడు. గదిలోపలి వెలుగు మెలమెల్లగా గడ్డకట్టిపోయింది. బల్బు వెలుగుతూనే ఉంది. కానీ ఆ కాంతి టేబుల్ మీద పడకుండా మధ్యలోనే విరిగిపోయింది.

గోడలోంచి వృద్ధుడు నడుచుకుంటూ వచ్చాడు. అతడి చేతిలో తుప్పుపట్టిన తాళంచెవి. ప్రధానమంత్రి కొంత కంగారుగా అలర్ట్ అలారం నొక్కబోయాడు. బటన్ లోపలికి వెళ్లింది. బయటకు రాలేదు. ఏ చప్పుడూ రాలేదు.

"ఎవరు నువ్వు?" అన్నాడు ప్రధాని

వృద్ధుడి పెదవులు కదల్లేదు. కానీ ప్రధానమంత్రికి చెవిలో ఏదో వినిపించింది.

"తలుపులు చేసినవాళ్లు తాళాలు కూడా చేస్తారు. కానీ కొన్ని తలుపులకు తాళాలు మనుషులే ." అన్నాడు వృద్ధుడు.

అతడు తాళంచెవిని టేబుల్ మీద ఉంచాడు. ప్రధానమంత్రి దాన్ని తాకగానే గది మాయమై ఒక దృశ్యం ఆవిష్కృతమైంది. అతడి ముందు ఒక విశాలమైన మైదానం. అక్కడ లక్షలమంది పిల్లలు నిలబడి ఉన్నారు. ప్రతి పిల్లవాడి కాళ్లకు ఏదో ఒకటి గొలుసులతో కట్టి ఉంది. కొందరి కాళ్లకు పొలం, కొందరి కాళ్లకు ఫ్యాక్టరీ, కొందరి మెడకు బంగారం, కొందరి వీపుమీద బ్యాంకు ఖాతాలు. వాళ్లు ఎగరడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ కాలి బంధాలు నేలను విడవనివ్వడం లేదు. ఇంకొంత దూరంలో ఇంకొందరు పిల్లలున్నారు. వాళ్ల కాళ్లకు ఏమీ కట్టిలేదు. కానీ వాళ్లకు రెక్కలే లేవు. తల్లిదండ్రులు సంపాదించలేదని కాదు. తల్లిదండ్రులే లేరని కాదు. వారికి పుట్టుకతోనే ఏ తాళం సరిపోలేదంతే. ప్రధానమంత్రిలో కొంత ఆందోళన కనిపించింది. వృద్ధుడి స్వరం మళ్లీ చెవుల్లో వినిపించింది.

"పిట్ట గూడు కడుతుంది. పిల్లలు ఎగిరిపోయాక ఆ పిట్ట గూటిని మోసుకుపోదు. మనిషి మాత్రమే చచ్చినా గూటిని పిల్లల కాళ్లకు కట్టేసి, వాళ్లను ఎగరనీయకుండా చేస్తాడు."

"అయితే ఏం చేయాలి?" ప్రధానమంత్రి అడిగాడు.

"గొలుసులు తెంచు."

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

"దేశం మండిపడుతుంది."

"గొలుసు తెగినప్పుడు శబ్దం తప్పదు."

దృశ్యం మాయమైంది. వృద్ధుడు లేడు. టేబుల్ మీద తాళంచెవి మాత్రం ఉంది. మళ్లీ ప్రధాని చెవిలో ఏదో వినిపించింది.

'మనిషి మరణించిన తర్వాత అతని ఆస్తి సమాజానికి, సంక్షేమ నిధికి చెందుతుంది. వారసత్వ హక్కు రద్దు చేస్తున్నాం.'

ఆ డిసెంబర్ ఎనిమిది రాత్రి ఎనిమిది గంటలకు ప్రధానమంత్రి దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.

'తండ్రి చనిపోతే కొడుకుకు ఆస్తి చెందదు. తల్లి చనిపోతే కూతురికి ఇల్లు చెందదు. ఎవరి సంపాదన వారితోనే ముగుస్తుంది. వారు మరణించిన తర్వాత ఆస్తి సామాజిక నిధిలోకి చేరుతుంది. పిల్లలకు తల్లిదండ్రుల ఆస్తిపై హక్కు ఉండదు. ఎవరి భవిష్యత్తును వారే నిర్మించుకోవాలి'

దేశం శ్వాస ఆగిపోయింది. అదే శ్వాస ఆ తర్వాత అరవడం మొదలుపెట్టింది.

---

రాజారావు రెవెన్యూ అధికారి. లంచాలు మేయడంలో ఘనాపాఠి. ప్రతి అక్రమ సంతకానికి ఒక గోడ కట్టించాడు. ప్రతి ఆక్రమిత స్థలానికి ఒక గది వేసుకున్నాడు. అతని ఇంట్లో ఇరవై ఏడు గదులు ఉన్నాయి. చట్టం వచ్చిన రాత్రి అతడు గోడల్లో దాచిన నోట్ల కట్టలను బయటకు తీశాడు. అవి కొడుకుకు చెందవు. ప్రభుత్వానికి అప్పగిస్తే జైలు. కాల్చేస్తే బూడిద. పెరట్లో ఒక ఇనుప బిందెలో నోట్లను కుక్కి అగ్గిపుల్ల వెలిగించబోతుండగా, గాలి లేకపోయినా నోట్లు ఒక్కసారిగా ఎగిరాయి. అవి సీతాకోకచిలుకలుగా మారాయి. ప్రతి సీతాకోకచిలుక రెక్క మీద ఒక ముఖం కనిపించింది. తన భూమి రికార్డు కోసం భార్య మంగళసూత్రం అమ్ముకున్న రైతు ముఖం. పెన్షన్ కోసం ఆరు నెలలు తిరిగి చనిపోయిన వృద్ధుడి ముఖం. ఇంటి అనుమతి కోసం అప్పు చేసి లంచం ఇచ్చిన కార్మికుడి ముఖం. రాజారావు కళ్లు మూసుకున్నాడు. నోట్ల రెపరెపల్లో పేర్లు వినిపించాయి. తేదీలు వినిపించాయి. తాను చెప్పిన అబద్ధాలు వినిపించాయి. ఆ రాత్రి అతడు ఒక్కో గది తాళం తెరిచాడు. ప్రతి గదిలో అతని తండ్రి నిలబడి ఉన్నాడు.

"నువ్వు ఎన్ని గదుల్లో ఒకేసారి చనిపోగలవు?" తండ్రి ప్రశ్న.

మరుసటి రోజు రాజారావు ఆఫీసుకు వెళ్లాడు. ఒక కాంట్రాక్టర్ కవర్ ముందుకు జరిపితే రాజారావు దాన్ని తాకనైనా లేదు.

"అంతా రూల్ ప్రకారమే జరుగుతుంది," అన్నాడు. ఆ మాట చెప్పగానే అతని ఇంట్లో ఒక గోడ కూలిపోయింది.

అదే రోజు సాయంత్రం, ఇరవై ఏడు గదుల ఇంట్లో మొదటిసారి గాలి ఒక చివర నుంచి మరో చివరికి ఏ ఆటంకం లేకుండా వీచింది.

---

పట్టణం చివర మల్లయ్యకు యాభై ఎకరాల మామిడితోట ఉంది. చట్టం ప్రకారం తాను చనిపోయాక తోట ప్రభుత్వానికి వెళ్తుందని తెలిసిన రోజు, అతడు కూలీలను పిలిచాడు. "ఒక్క చెట్టూ మిగలకూడదు," అన్నాడు. "ఎందుకయ్యా?" అని కొడుకు నిఖిల్ అడిగాడు. "నా పిల్లలకు చెందనిది ఎవరికీ చెందకూడదు." దూరంగా గడియార స్తంభం కింద ముసలివాడు కూర్చుని కనిపించాడు. "ఈ భూమి నా తండ్రిది," మల్లయ్య అరిచాడు.

"నీ తండ్రి వెళ్లేటప్పుడు



తీసుకెళ్లలేదుగా." వృద్ధుడు నవ్వాడు.

"ఇది నా కొడుకుదై ఉండాలి."

"నీ కొడుకు ఈ తోటను ప్రేమిస్తే, అతడు దాని సంరక్షకుడు అవుతాడు. ప్రేమించకపోతే యజమాని అయినా పరాయి వాడే."

మొదటి చెట్టు మీదకు మల్లయ్య తనే స్వయంగా గొడ్డలి ఎత్తాడు. అప్పుడు అతని నీడ శరీరం నుంచి విడిపోయింది. మెల్లగా వెళ్లి చెట్టును కౌగిలించుకుంది. మల్లయ్య చేతిలోంచి గొడ్డలి జారిపోయింది. నీడ చెట్టును పట్టుకుని ఏడుస్తోంది. ఆ ఏడుపు మనిషిదో, చెట్టుదో చెప్పలేకపోయారు. మల్లయ్య వెనక్కి తగ్గాడు. అక్కడే నేల మీద ఒక ఎండిన మామిడి ఆకు కనిపించింది. దాన్ని చేతిలోకి తీసుకున్నాడు. తెలియకుండానే నాలుకకు తగిలించాడు. ఆ క్షణం అతనికి యాభై ఏళ్ల దాహం రుచి తెలిసింది. తాను నాటిన ప్రతి మొక్క వేసవిలో ఎలా తపించిందో, వర్షం పడిన రాత్రి వేర్లు ఎలా ఊపిరి తీసుకున్నాయో, ప్రతి పండు తనలో ఎంత వెలుతురు దాచుకుందో అతనికి వినిపించింది. మల్లయ్య చెట్టును తాకాడు. మొదటిసారి అది ఆస్తిలా కాకుండా, తనకంటే ఎక్కువకాలం ఆయువున్న జీవిలా అనిపించింది.

కూలీలను వెనక్కి పంపించాడు. కొన్నేళ్ల తర్వాత అదే తోట సామాజిక నిధికి చేరింది. అక్కడ పాఠశాల పిల్లల కోసం ఉద్యానవనం ఏర్పాటైంది.

ప్రవేశద్వారం దగ్గర ఒక చిన్న బోర్డు.

'ఇక్కడ పండ్లు ఎవరివీ కావు. ఆకలివి.'

మల్లయ్య పేరు ఎక్కడా లేదు.

కానీ ప్రతి వేసవిలో మొదటి మామిడిపండు అతని పాత ఇంటి కిటికీ లోంచి ఇంట్లో పడేదని నిఖిల్ చెప్పుంటాడు.

---

చట్టం వచ్చినంత మాత్రాన మనుషులంతా మంచివాళ్లైపోలేదు. కొంతమంది పిల్లలు తల్లిదండ్రుల దగ్గరకు రావడం మానేశారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లల ముఖాల్లో ప్రేమకంటే లెక్కలు వెతికారు. కుటుంబాల్లో పాత అబద్ధాలు బయటపడ్డాయి.

"నువ్వు నన్ను ప్రేమించావా? లేక నా ఇల్లు ప్రేమించావా?"

"మీరు నన్ను పెంచారా? లేక వృద్ధాప్యంలో చూసుకునే పెట్టుబడిలా భావించారా?" దేశమంతా ఇలాంటి ప్రశ్నలతో నిండిపోయింది.

ఒక సాయంత్రం మల్లయ్య అనారోగ్యంతో మంచంలో ఉంటే నిఖిల్ కాళ్లు నొక్కుతున్నాడు.

"నాకు నీ ఆస్తి వద్దు నాన్నా," అన్నాడు. "నువ్వు కొంచెం ఎక్కువ రోజులు ఉంటే చాలు."

మల్లయ్య నవ్వాలని ప్రయత్నించాడు. "ఆస్తి లేదని ఇప్పుడలా అంటున్నావేమో."

"చెట్టుకు పండ్లు పుడతాయి. కానీ చెట్టు చనిపోతే పండ్లు తిరిగి చెట్టులోకి వెళ్లవు " అన్నాడు నిఖిల్ నవ్వుతూ.

నిఖిల్ కంటినుంచి ఒక కన్నీటి చుక్క జారింది. కానీ నేలపై పడలేదు. గాల్లోనే ఆగిపోయింది. గది మొత్తం పలుచని నీటి పొరతో నిండినట్టు అనిపించింది. తండ్రికొడుకులు నీటి అడుగున ఉన్నట్టుగా ఒకరి శ్వాస మరొకరికి వినిపించింది. కిటికీ బయట వృద్ధుడు నిలబడి ఉన్నాడు. అతడు వేలితో ఆ కన్నీటి చుక్కను తాకాడు. అది చిన్న స్ఫటికంలా మారి మల్లయ్య గుండె మీద పడింది. ఆ క్షణంలో మల్లయ్య తన కొడుకు మనసును విన్నాడు. అందులో పొలం లేదు. ఇల్లు లేదు. బ్యాంకు ఖాతా లేదు. బాల్యంలో తన భుజాలపై కూర్చున్న జ్ఞాపకం మాత్రమే ఉంది.

"నేను నీకు ఏమీ ఇవ్వలేకపోయాను,"మల్లయ్య అన్నాడు.

"ఇచ్చావు నాన్నా."

"ఏమిచ్చాను?"

"నేను పడిపోతే లేపే చేతి జ్ఞాపకం.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

నేను సైకిల్ నడపడం, నా ఆత్మ విశ్వాసం."

ఆ రాత్రి మల్లయ్య ప్రశాంతంగా నిద్రపోయాడు. ఉదయం లేవలేదు. నిఖిల్ తండ్రి చేతిని పట్టుకుని చాలా సేపు మౌనంగా కూర్చున్నాడు. బయట అధికారులు తోటను సామాజిక నిధికి బదిలీ చేసే పత్రాలు సిద్ధం చేస్తున్నారు. అతడు ఒక్క అభ్యంతరమూ చెప్పలేదు.

తండ్రి పాత చెప్పుల జతను మాత్రం తీసుకుని ఇంటి నుంచి బయటకు వచ్చాడు.

---

ఇరవై సంవత్సరాలు గడిచాయి. ఇళ్లు ఎప్పుడూ మనుషులను వారసత్వంగా పొందాలని కోరుకుంటాయి.'

ఆ అద్దాన్ని పట్టణ గ్రంథాలయంలో ఉంచారు. కొన్నేళ్ల తర్వాత ఒక పిల్లవాడు దాని ఎదుట నిలబడ్డాడు.

"నాన్నా," అన్నాడు, " తాతయ్య మనకు ఏమిచ్చాడు?"

తండ్రి వెంటనే సమాధానం చెప్పలేదు. అద్దంలో తన ముఖం కనిపించలేదు. తండ్రి ముఖమూ, తాత ముఖమూ, గడియార స్తంభం కింద కూర్చున్న ముసలివాడి ముఖమూ తెలియని ఒక ఛాయ



కనిపించింది. తండ్రి ఆ పిల్లవాడి భుజంపై చేయి వేసి "మన తాతయ్య మనకు ఆస్తి ఇవ్వలేదు బాబూ. ఇక్కడికి వచ్చి ఈ ప్రశ్న అడిగే మనసును ఇచ్చాడు. ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఒక తలుపు చూపించాడు." అన్నాడు కొడుకును చూస్తూ. అప్పుడు అతనికి ఒక్కసారిగా అర్థమైంది. వారసత్వం పోయింది. కానీ ఒక కొత్త ప్రశ్న పుట్టింది. మనిషి తన పిల్లలకు ఆస్తి ఇవ్వాలా? లేక స్వతంత్రంగా బతికే ధైర్యం ఇవ్వాలా?

ఆ ప్రశ్నకు ప్రతి తరం తన సమాధానం రాస్తూనే ఉంటుంది. కిటికీ బయట పాత ఇల్లు నెమ్మదిగా ఊపిరి తీసుకుంది. ఆ ఊపిరిలో దుమ్ము ఉంది. తడి ఉంది. జ్ఞాపకం ఉంది. విడిపోలేని ఒక ప్రేమ ఉంది. తెగిపోవల్సిన ఒక గొలుసు ఉంది. అదే సమయంలో, ఇరవై ఏళ్లుగా ఆగిపోయిన గడియార స్తంభం ఉన్నట్టుండి మోగింది.

పదకొండు గంటల పదిహేడు నిమిషాల దగ్గర నిలిచిపోయిన ముళ్లు కదిలాయి. కాలం ఆగదు కదా. పిల్లలు మొదటిసారి తమ కాళ్లకు ఏ బరువూ లేకుండా ఎగరగలిగారు.

---

ప్రధాన మంత్రికి మెలకువ వచ్చింది. ఒకసారి కళ్లు నులుముకుని ఊపిరి పీల్చుకున్నాడు. ఇంటర్ కంలో పిఏతో ఇవాళ అందరు అధికారులతో మంత్రిమండలితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయమని ఆదేశించాడు. ◆◆

పెళ్లిళ్లలో కట్నం తగ్గింది. ఆస్తి వివరాలు అడిగే బదులు, "ఏం చేస్తారు?" అని అడగడం మొదలైంది. కొందరు పిల్లలు తల్లిదండ్రుల నీడ నుంచి బయటపడ్డారు. కొందరు తల్లిదండ్రులు పిల్లలను తమ కొనసాగింపుగా కాకుండా, వేరే మనుషులుగా చూడటం నేర్చుకున్నారు. అవినీతి పూర్తిగా పోలేదు. కానీ దాని పాత జోరు తగ్గింది. "పిల్లల కోసం" అని చెప్పుకునే సాకు లేకపోవడంతో కొందరి దాహం తన అసలు ముఖం చూపించింది. మరికొందరు మాత్రం ఇంకా కూడబెట్టారు. అలవాటుకు వారసత్వ చట్టాలు ఉండవు కదా. పాత ఇళ్లు మాత్రం రాత్రిళ్ల మూలుగుతూనే ఉండేవి. గాలి కిటికీల్లోంచి వెళ్లేటప్పుడు మనవళ్ల పేర్లు పలుకుతున్నట్టు వినిపించేది. ఆస్తి మనుషులను బద్ధకస్తులను చేస్తుందేమో, కానీ ఆస్తి లేకపోవడం మానవ సంబంధాల సహజ మమకారాన్ని కూడా ఒక వ్యాపారంగా మార్చే ప్రమాదం ఉంది. చట్టాలు వ్యవస్థను మారుస్తాయి కానీ, మానవ నైజంలో నిజాయితీ అనేది నెత్తురులోనే ఉండాలి.

---

ఒక చలికాలపు ఉదయం గడియార స్తంభం కింద వృద్ధుడు కనిపించలేదు. అతని చెక్కపెట్టె మాత్రమే ఉంది. జనం దాన్ని తెరిచారు. లోపల భూమి పత్రాలు లేవు. తాళాలు లేవు. సున్నం ముక్కలు లేవు. ఒక చిన్న అద్దం మాత్రమే ఉంది. దాని వెనుక ఇలా రాసి ఉంది. 'మనుషులు తమ పిల్లలకు ఇళ్లు ఇవ్వాలని కోరుకుంటారు. కానీ

## నవ్వుల్ పువ్వుల్

### మతిమరుపు

ప్రొఫెసర్ తన భార్యతో–

'నాకు మతి మరుపు అని అంటుంటావుగా... ఈ రోజు నేనేం చేశానో చూడు' అన్నాడు.

'ఏం చేశారు?' ఆసక్తిగా అడిగింది భార్య.

'బజారుకు వెళ్లేటప్పుడు తోడుగా తీసుకెళ్లిన మన చంటిగాడిని మరచిపోకుండా తిరిగి ఇంటికి తీసుకొచ్చాను' అన్నాడు ప్రొఫెసర్ గర్వంగా.

'మీ మతిమరుపు మాడా.. అసలు మనకు పిల్లలే లేరు కదండీ...' అంటూ విరుచుపడింది భార్య.

### మేకప్ మహిమ

'వెల్డన్ మేడమ్! మా మందు మీకు బాగా పనిచేసింది. మీరు రెండు కిలోలు తగ్గారు' అన్నాడు రిప్రెజెంటేటివ్.

'నీ మొహం!. ఈ రోజు నేను మేకప్ చేయలేదు' అంది సుందరి.

### ఉచిత సలహా

అరవై ఏళ్ల వ్యక్తి మ్యారేజ్ బ్యూరోకు వెళ్లాడు.

'నేనో విధవను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను' అన్నాడు.

'అలాంటి సంబంధం దొరకడం ఇప్పటికిప్పుడు కష్టం. ముందైతే మీరు పెళ్లి చేసుకోండి. మిమ్మల్ని కట్టుకున్న ఆవిడ కొన్ని రోజులకే ఆటోమెటిక్‌గా విధవ అయిపోతుంది లేండి' సలహా ఇచ్చాడు ఏజెంట్.

### చురుకైన వాడు

**రామయ్య** : మీ పెద్దోడు ఏం చేస్తున్నాడు?

**సోమయ్య** : కలెక్టర్

**రామయ్య** : రెండో వాడు?

**సోమయ్య** : పోలీసాఫీసర్

**రామయ్య** : మూడో వాడు?

**సోమయ్య** : దొంగతనాలు

**రామయ్య** : ఇద్దరు అన్నయ్యలు గౌరవప్రదమైన వృత్తుల్లో ఉండగా చిన్నోడు దొంగతనాలు చేయడమేమిటి?'

**సోమయ్య** : వాడు దొంగతనాలు చేయబట్టే ఆ డబ్బుతో పెద్దోళ్లిద్దరు బాగా చదువుకుని ఉద్యోగం సంపాదించుకోగలిగారు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సఅప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథ

# శశిరేఖా పరిణయం

తాళ్లూరి లక్ష్మి

**గవర్నమెంటు స్కూల్ హెడ్మాస్టర్ రాఘవరావు, రేవతిల ఒక్కగానొక్క కూతురు శశిరేఖ. డిగ్రీలోనూ, పీజీలోనూ యూనివర్సిటీ గోల్డ్ మెడల్ తెచ్చుకుంది. ఆ తరువాత సివిల్స్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకుని ఐఏఎస్‌కి సెలెక్ట్ అయింది. ఈ మధ్యనే ట్రైనింగ్ పూర్తి చేసుకుని డిప్యూటీ కలెక్టర్‌గా స్వరాష్ట్రంలోనే ఉద్యోగంలో చేరింది.**

చదువులో సరస్వతిని. వర్చస్సులో లక్ష్మీదేవిని, చురుకుదనంలో శైలసుతను తలపించే శశిరేఖకు తగిన భర్తను ఎలా తేవాలా అని ఒకటే మథన రేవతికి. "అప్పుడే తొందరేమిటి, ముందు స్థిరపడి ఉన్నత శిఖరాలు అందుకోనీ.." అంటారు రాఘవరావు గారు. ఆయనకు వంత పాడుతుంది కూతురు.

కూతురికి పెళ్లి వయసు దాటిపోతే మంచి సంబంధాలు రావేమోనని రేవతి బాధ. దానికి ఆజ్యం పోస్తూ శశిరేఖ ఈడువాళ్ళందరికి పెళ్లిళ్లు అయిపోయి పిల్లాజెల్లాలతో సుఖంగా కాపురం చేస్తుంటే రేవతి భయం రోజురోజుకీ మరింత పెరిగిపోతోంది. భర్త దగ్గర మొర పెట్టుకుంటే ఆయన తేలిగ్గా తీసి పారేస్తాడు.

ఈ రోజు ఎలాగైనా ఆయన గారితో మాట్లాడి తాడో పేడో తేల్చుకోవాలి.. అనుకుంటూ హాల్లో పడక్కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్న రాఘవరావు గారి పక్కనే ఒక స్టూలు వేసుకుని కూర్చుంది రేవతి.

భార్య వచ్చి పక్కన తిష్ట వేసిందంటే ఏదో పెద్ద విషయమే చర్చించబోతోందన్నమాట.. అనుకున్నారు రాఘవరావు గారు. ఆయన అనుమానం నిజం చేస్తూ కూర్చోగానే రేవతి మొదలెట్టింది "ఊళ్ళో అందరి ఆడపిల్లల పెళ్ళిళ్ళు అయిపోతున్నాయిగానీ నాకే ఆ అదృష్టం లేదు" అంటూ.

"మన శశికి అప్పుడే ఏం తొందరొచ్చిందోయ్. ఇప్పుడిప్పుడేగదా ఉద్యోగంలో చేరింది. ముందు ఉద్యోగంలో స్థిరపడనీ. ఆ పైన పెళ్ళికొడుకుల వేట మొదలుపెడదాము" ఆమె మాటలను తేలిగ్గా కొట్టి పడేస్తూ అన్నారు రాఘవరావుగారు.

"మీరిలాగే మీనమేషాలు లెక్క పెడుతూ కూర్చోండి. ఈలోగా దాని తోటి వాళ్ళందరూ పిల్లల్ని కని వాళ్ళ పెళ్లిళ్లు కూడా చేసేస్తారు" రుస రుస లాడింది రేవతి.

"ఏవేవో ఊహించుకుని అనవసరంగా కలతపడకోయి. వచ్చే నెల దసరా పండగకు అమ్మాయి సెలవు పెట్టి వస్తానన్నదిగా. రాగానే అమ్మాయితో మాట్లాడి సంబంధాలు చూద్దం మొదలు పెడదాము" ఆమెని అనునయిస్తూ అన్నారు రాఘవరావు గారు.

ఆ మాటకే గొప్ప స్వాంతన పొందింది రేవతి "పోన్లే ఇప్పటికయినా సంబంధాలు చూడడానికి ఒప్పుకున్నారు" అనుకుంటూ.

..................

అనుకున్నట్టుగానే విజయదశమికి రెండు రోజులు ముందుగానే ఇంటికి వచ్చింది శశిరేఖ ఒక వారం రోజులు సెలవు పెట్టి.

వచ్చీ రాగానే శశిరేఖ పెళ్లి ప్రస్తావన మొదలెట్టింది రేవతి. అప్పుడే ఎందుకని మొదట అభ్యంతరం చెప్పినా, తల్లి పోరు భరించలేక, తండ్రి కూడా ఈసారి తల్లికి మద్దతు పలకడంతో పెళ్ళికి సుముఖత చూపెట్టక తప్పలేదు శశిరేఖకి.

"ఆమె అంగీకరించిన మరుక్షణమే పెళ్లిళ్ల పేరయ్యశాస్త్రికి కబురెట్టింది రేవతి.

ఆయన తెచ్చిన సంబంధాల వివరాలు పరిశీలించిన రేవతి, రాఘవరావు గార్లు చాలా నిస్పృహ చెందారు. కొన్ని సంబంధాలు రాఘవరావు గారికి నచ్చకపోతే, మరికొన్ని రేవతికి నచ్చలేదు. మొత్తానికి ఇద్దరికీ కలిపి పేరయ్య శాస్త్రిగారు తెచ్చిన లిస్టులో ఒక్క సంబంధం కూడా నచ్చలేదు.

అదే విషయం శాస్త్రిగారితో చెబితే ఆయన తనకు తెలిసిన మరికొన్ని సంబంధాలు ఉన్నాయని మరునాడు వాటి వివరాలు తెలుపుతానని చెప్పి వెళ్లిపోయారు.

మర్నాడు ఎన్నో ఆశలతో, ఉత్సాహంగా నిద్ర లేచిన రేవతికి మబ్బులు కమ్మిన ఆకాశం, హోరున వీస్తున్న గాలి, అంతకంతకూ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఉధృతమవుతున్న వర్షం దర్శనమిచ్చాయి.

భర్తని అడిగితే బెంగాల్ వైపు వెళ్లవలసిన సైక్లోన్ దిశ మార్చుకుని మచిలీపట్నం వైపు వస్తోందని, దాని ప్రభావమే వాతావరణంలో ఈ మార్పుకి కారణమని తెలిపాడు.

అంతలో అప్పటివరకు బెడ్ రూమ్‌లో ల్యాప్‌టాప్ మీద ఏదో పని చేసుకుంటున్న శశిరేఖ వాళ్ళ దగ్గరకొచ్చి "నాన్నగారూ! నేను వెంటనే వెళ్ళి డ్యూటీలో చేరాలి.

ఇప్పుడే మా కలెక్టర్ గారి నుండి ఫోన్ వచ్చింది" అంది.

"ఆదేమిటే! నిన్ననే కదా వచ్చావు. అప్పుడే వెళ్లిపోవడమేమిటే?" కస్సు మంది రేవతి.

"తుఫాను ప్రభావం చూస్తున్నావు కదమ్మా. సహాయక చర్యలు చేపట్టడానికి ఉద్యోగులందరూ అందుబాటులో ఉండాలని అందరి సెలవులు రద్దు చేసేశారు. నేను వెంటనే వెళ్లిపోవాలి"

అన్నట్లే మరో రెండు గంటల్లో తిరుగు ప్రయాణం మొదలెట్టింది.. శశిరేఖ రేవతి సణుగుడుల మధ్యన.

.....................

ఎడతెగకుండా కుండపోతగా కురుస్తున్న వర్షాన్ని చూస్తూ అనుకుంది శశిరేఖ "మరో ఆరేడు గంటలు ఇలాగే వాన కురిస్తే ఊరు ఊరే మునిగిపోయేటట్టు ఉందని".

శశిరేఖ సెలవు రద్దు చేసుకుని డ్యూటీలో జాయినై అప్పటికి రెండు రోజులైంది. ఈ నలభై ఎనిమిది గంటలు కంటి మీద కునుకు లేకుండా తను, తన ఉద్యోగులందరూ పనిచేస్తూనే ఉన్నారు. శశిరేఖను తుఫాను తాకిడికి అత్యధికంగా ప్రభావితమయ్యే లంక గ్రామాలకు కావలసిన సహాయక చర్యలు చూసుకోడానికి స్పెషల్ ఆఫీసర్‌గా వేశారు.

బాధ్యత తీసుకున్నప్పటి నుండీ పునరావాస కేంద్రాలు నెలకొల్పడంలోను, అత్యవసర ఆహార పదార్థాలు, తదితర వస్తువులు, వైద్య సదుపాయాలు సమకూర్చుకోవడంలోనూ, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తులను చేసి పునరావాస కేంద్రాలకు తరలించడంలోనూ అందరూ నిమగ్నులైపోయారు.

హమ్మయ్య.. అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామని ఊపిరి పీల్చుకునేంతలో తుఫాను తీరాన్ని తాకనే తాకింది. అంతే, ఆ ఉద్ధృతానికి లోతట్టునున్న ఊళ్ళు ఊళ్ళే కొట్టుకు పోయాయి. అదృష్టవశాత్తు ఆ గ్రామాలనన్నిటిని ఖాళీ చేయించడం వలన ప్రాణ నష్టం లేకుండా నివారించగలిగారు. ఎడతెగని వానతో నదులు, వాగులు అన్నీ పొంగి పొర్లడంతో చాలా లంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. తుఫాను గాలికి ఎలెక్ట్రిక్ పోల్స్ అన్నీ పడిపోయి విద్యుత్ సరఫరా ఎప్పుడో ఆగిపోయింది. అవసరానికి ఏర్పాటు చేసుకున్న పడవలు ఉప్పెన ధాటికి కొట్టుకుపోయాయి. కేవలం వైర్లెస్ సెట్ల ద్వారా కంట్రోల్ సెంటర్ తో సమాచారం పంచుకోగలుగుతున్నారు.

తుఫాను తీరాన్ని తాకి అప్పుడే పన్నెండు గంటలయింది. అయినా ఈదురు గాళ్ల ఉధృతం కానీ, ఉప్పెనలాగా పొంగి పొరలుతున్న వరద నీళ్ళ ఉధృతం కానీ ఏ మాత్రం తగ్గ లేదు. ఇప్పటికే ముందుగా అమర్చుకున్న ఆహార పదార్థాలు, మంచి నీరు, ఇతర అత్యవసర వస్తువులు అన్నీ దాదాపు అయిపోయాయి. ఈ సాయంత్రానికల్లా బయట నుంచి సహాయం లభించకపోతే అందరూ చాలా కష్టపడవలసి వస్తుంది.

ఇప్పటివరకైతే ఏ సమస్యా రాకుండా అంతా సవ్యంగా చూడగలిగారు. అయితే

**"అదేమిటే! నిన్ననే కదా వచ్చావు. అప్పుడే వెళ్లిపోవడమేమిటే?" కస్సుమంది రేవతి.**

**"తుఫాను ప్రభావం చూస్తున్నావు కదమ్మా. సహాయక చర్యలు చేపట్టడానికి ఉద్యోగులందరూ అందుబాటులో ఉండాలని అందరి సెలవులు రద్దు చేసేశారు. నేను వెంటనే వెళ్లిపోవాలి" అంది.**

ఈ రాత్రికెలా సంబాళించుకోవాలో అర్థం కావటం లేదు. శశిరేఖ తన ఉద్యోగులందరినీ సమావేశపరచి వాళ్ళ సూచనలు కూడా తీసుకుంది. ముందుగా ఏర్పాటు చేసుకున్న కొందరు గజ ఈతగాళ్లను ఊళ్ళోకి పంపించింది ఎక్కడినుంచైనా ఏదైనా సహాయం అందుతుందేమోనని.

రెండు గంటల్లో వాళ్ళందరూ తిరిగొచ్చేశారు ఊళ్ళో పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా ఉందని చెబుతూ.

అప్పటికే చీకట్లు ముసురుకుంటున్నాయి. చలి తీవ్రత కూడా పెరగసాగింది. శశిరేఖ, ఆమె సిబ్బంది కేంద్రంలో తల దాచుకున్న బాధితులందరికి ధైర్యం చెప్పసాగారు. ఏ క్షణంలోనైనా బయట నుంచి సహాయం అందవచ్చు.. ధైర్యంగా ఉండమంటూ.

అందరూ ఆ చీకట్లో అలాగే ముడుచుకుని కూర్చొని కునికిపాట్లు పడుతున్నారు. దాదాపు అర్థరాత్రి అవుతున్న సమయంలో శశిరేఖ బయట కాపలాగా ఉంచిన ఉద్యోగి ఒకతను గట్టిగా అరిచాడు "మేడమ్, దూరంగా ఏదో లైట్ కనబడుతోంది".

వెంటనే శశిరేఖా మరికొందరు సిబ్బంది బయటకొచ్చి చూశారు.

ఆ ఉద్యోగి చెప్పినట్టే దూరంగా ఒక లైట్ కనబడుతోంది. శశిరేఖ వెంటనే తమ దగ్గర అత్యవసర పరిస్థితులకోసమని దాచిపెట్టిన ఎమర్జెన్సీ లాంప్ తీసి ఊపసాగింది. మరి కొద్దిసేపట్లో తమ సంకేతం అందినట్టు దూరం నుంచి ఒక పచ్చ దీపం ఊగసాగింది.

మరో పదిహేను నిమిషాల్లో ఒక


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

*sunmagvaartha@gmail.com*

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

మోటార్ బోట్ వాళ్ళ దగ్గరకొచ్చి ఆగింది. అందులో నుంచి పదిమంది యువకులు దిగి తమని పరిచయం చేసుకున్నారు.. తామందరూ తేజ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఉద్యోగులమనీ, తుఫాను బాధితులకు సహాయం చేయడం కోసం తిరుగుతున్నామని.

శశిరేఖ సిబ్బంది శశిరేఖని పరిచయం చేశారు మా డిప్యూటీ కలెక్టర్ గారంటూ.

వచ్చిన వాళ్ళల్లో మంచి ఒడ్డూ పొడుగుతో, పట్టుదలని సూచిస్తున్న చురుకైన కళ్ళతో, చెదరని చిరునవ్వుతో ఉన్న యువకుడు ఒకతను తనని పరిచయం చేసుకున్నాడు "నా పేరు యశస్వి. ఈ టీంకి లీడర్‌ని. మా కంపెనీ వాళ్ళమే అరడజను మోటార్ బోట్లు వేసుకుని తలా ఒక దిక్కు బయల్దేరాం సహాయక చర్యలు అందజేద్దామని" అన్నాడు.

ఆ తరువాత పనులన్నీ చకచకా జరిగిపోయాయి. యశస్వి అతని మనుషులు తాము తెచ్చిన తినుబండారాలు, మంచి నీటి బాటిల్స్, దుస్తులు అన్నీ అందరికీ పంచిపెట్టారు. అవసరమయిన వారికి కావలసిన మందులు అందజేశారు. కేంద్రంలో కొన్ని ఎమర్జెన్సీ లైట్లు ఏర్పాటు చేశారు. అందరితోనూ మాట్లాడి ధైర్యం చెప్పారు వాళ్ళ కష్టాలు తీర్చడానికి తామున్నామని.

తరువాత యశస్వి శశిరేఖతో మాట్లాడి ఊరి వాళ్ళ సంగతి తెలుసుకుని వాళ్ళకి కూడా సహాయం చేసి వస్తామని తన మనుషులను తీసుకుని బయలుదేరాడు.

"మీకు అభ్యంతరం లేకపోతే మీతో బాటు నేను కూడా వచ్చి మీ సహాయ కార్యక్రమాలలో పాల్గొంటాను" అని శశిరేఖ కోరింది.

యశస్వి ఆమోదం తెలపగానే మరో ఇద్దరు సిబ్బందితో కలిసి యశస్వి బృందంతో బయలుదేరింది.

ఆ రాత్రంతా ఆ బృందం బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న చిన్న గ్రామాలనెన్నింటినో చేరుకుని వారికి కావలసిన సహాయమందించారు.

మర్నాటి మధ్యాహ్నానికల్లా వాతావరణం కొంచెం తెరిపినిచ్చింది.

అప్పుడు రంగంలోకి దిగాయి ప్రభుత్వ సంస్థలు, కొన్ని వాలంటరీ సంస్థలు సహాయక చర్యలు అందించడానికి. అంతవరకు యశస్వి బృందమే బాధితులను ఆదుకున్నారు.

..................

పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి మరో మూడు నెలలు పట్టింది ప్రభుత్వ యంత్రాంగానికి. ఈ మూడు నెలలు అందరూ రాత్రింబగళ్లు కష్టబడి పని చేయాల్సి వచ్చింది.

పరిస్థితులు కొద్దిగా అదుపులోకొచ్చాక శశిరేఖ నాలుగు రోజులు సెలవు పెట్టి గతరాత్రే ఇంటికి వచ్చింది. పొద్దుట బ్రేక్‌ఫాస్ట్ అయిపోయాక తండ్రితో తుఫాను సమయంలో తన అనుభవాలను పంచుకోసాగింది.

వారి మాటలు ఎంతకూ తెమిలేలాగా లేకపోవటంతో రేవతి మధ్యలో కల్పించుకుంది "మీ మాటలు ఇప్పట్లో తెగేలాగా లేవు. ఇక ఆ విషయాలు ఆపేస్తే అసలు విషయం మాట్లాడుకుందాం" అంటూ.

ఆమె మాటలకు తండ్రీ కూతుళ్ళు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

వారి విస్మయం గమనించి రేవతే తిరిగి అడిగింది "అదేనండీ, మీ ముద్దుల కూతురు పెళ్లి విషయం. ఈ నాలుగు రోజులు గడిచిపోయి.. మళ్ళీ డ్యూటీలో జాయినయిందంటే ఇంతే సంగతులు. మీరూ, నేనూ ఒకరి మొహాలొకరం చూసుకుంటూ భజన చేయవలసిందే. అదున్నప్పుడే నాలుగైదు సంబంధాలు చూసుకుంటే ఏదో ఒకటి కుదరకపోదు. పేరయ్య శాస్త్రి గారికి కబురు పంపుతే ఆయనే సంబంధాలు చెబుతారు"

రాఘవరావు గారు ఆవిడ మాటలకు సమాధానం చెప్పేలోపలే వారి ఇంటి గేటు దగ్గర ఏదో కారు ఆగిన శబ్దమొచ్చింది.

ఎవరా? అనుకునేంతలో కాలింగ్ బెల్ మోగితే రాఘవరావు గారు ఎవరొచ్చారా? అని చూడడానికి బయటికొచ్చారు.

తెల్లటి ధోతీ, లాల్చీ ధరించి ఠీవిగా ఉన్న ఆరడుగుల ఆజానుబాహువొకాయన బయట ఉన్నారు.

రాఘవరావు గారిని చూడగానే ఆయన "నా పేరు ధర్మతేజ, వైజాగ్ నుండి వస్తున్నాను. మీతో కొంచెం మాట్లాడాలి" అన్నారు.

రాఘవరావు గారు ఆయనను లోపలికి ఆహ్వానించి భార్యని, కూతురిని పరిచయం చేశారు.

రేవతి తెచ్చిన కాఫీ తాగుతూ ఆ వచ్చిన వ్యక్తి చెప్పసాగారు.. "నా పేరు ధర్మతేజ. వైజాగ్‌లో ఉన్న తేజ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ గురించి మీరు వినే ఉంటారు. నేను దానికి ఫౌండర్ చైర్మన్‌ని.

తేజ గ్రూప్ పేరు వినగానే శశిరేఖ ఒక్కసారి ఉలిక్కిపడింది. ఆమె మనసులో ఏదో పొరలో నుంచి యశస్వి మొహం కదులాడింది.

"మీ సంస్థ గురించి నాకు బాగా తెలుసు. తుఫాను సమయంలో మీ సంస్థ మాకు అందించిన సహాయ సహకారాలు ఎన్నటికీ మరచిపోలేనివి" మనఃస్ఫూర్తిగా అంది శశిరేఖ.

"ఆ విషయానికే వస్తున్నాను. ఆ సమయంలో నీతో కలిసి పనిచేసిన యశస్వి అనే యువకుడు నీకు గుర్తున్నాడనుకుంటాను?" శశిరేఖనే చూస్తూ అడిగారు తేజ.

"ఓ ఆయన గుర్తులేకనేం. ఆ సమయంలో ఆయన, ఆయన సహచరులు అందించిన ఆపన్నహస్తం ఎన్నటికీ మరచిపోలేనిది. అందరినీ ప్రోత్సాహపరుస్తూ ధైర్యం చెప్పే ఆయన మాటలు చిరస్మరణీయాలు. ప్రభుత్వంలో ఇంతమందిమి ఉండి కూడా చేయలేని సహాయ కార్యక్రమాలు వారి బృందం చేస్తుంటే మాకు ఎంతో సిగ్గనిపించింది" నమ్రతగా అంది శశిరేఖ.

"ఆ యశస్వి మరెవరో కాదు. నా ఒక్కగానొక్క కొడుకు. హార్వర్డ్‌లో ఎంబీఏ



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

చేసి ప్రస్తుతం మా గ్రూప్ ఎండీగా పని చేస్తున్నాడు. నా తరువాత చైర్మన్ కావలసినవాడు."

ఆయన మాటలకు ఒక్కసారిగా విస్తుపోయింది శశిరేఖ "మీ అబ్బాయా.." అంటూ.

అప్పటివరకు వారిద్దరి మాటలు శ్రోతలాగా వింటున్న రాఘవరావు గారు అడిగారు "ఇంతకీ మీరొచ్చిన కారణం చెప్పనేలేదు?"

"ఆ విషయానికే వస్తున్నాను. మా అబ్బాయికి మీ అమ్మాయి ఎంతో బాగా నచ్చింది. విపత్తు సమయంలో ఆమె నిర్వహించిన పర్యవేక్షణ బాధ్యతలు, బాధితులపట్ల ఆమె కనబరచిన దయ, జాలి, విధి నిర్వహణ కోసం నిద్రాహారాలు లేకుండా ఆహోరాత్రాలు శ్రమించే తత్వం ఇవన్నీ చూసి మీ అమ్మాయి పట్ల మా యశస్వి ఎంతో ఆకర్షితుడయ్యాడు.

అయితే చదువు, అందం, మంచి ఉద్యోగం ఉన్న మీ అమ్మాయికి తను సరిపోతాడో లేదోనన్న సంశయంతో ముందుగా మిమ్మల్ని మీ అమ్మాయిని సంప్రదించి మీ అభిప్రాయం తెలుసుకోమన్నాడు. మీ అమ్మాయి

ఇంతకుముందే యశస్విని చూసింది. మీ కోసమని ఈ ఫోటో తెచ్చాను" అని యశస్వి ఫోటో ఒకటి రాఘవరావు గారికిచ్చారు.

హుందాతనం ఉట్టిపడుతూ, ఎంతో కళగా ఉన్న యశస్వి ఫోటో చూసిన రాఘవరావు గారు, రేవతులకు నోట మాట రాలేదు.

ఫోటోని శశిరేఖకిచ్చారు. ఇంతకు ముందు చూసినవాడే అయినా యశస్వి ఫోటో చూసేసరికి శశిరేఖ మొహం సిగ్గుతో అరుణ వర్ణం దాల్చింది.

"మిమ్మల్ని ఇప్పటికిప్పుడు మీ అభిప్రాయం చెప్పమనడం భావ్యం కాదు. మీ అమ్మాయిని కూడా సంప్రదించి త్వరలో ఏ విషయం చెబుతే సంతోషిస్తాను" అన్నారు తేజ.

ఆయన మాటలు పూర్తవకముందే రేవతి అడ్డు తగిలింది "అదేం మాట అన్నయ్య గారు. దేవుడే దిగి వచ్చి మీ కోరిక తీరుస్తానంటే వద్దనే మూర్ఖులమా మేము. మా శశిరేఖకి అన్ని విధాలా జోడైనవాడు ఇష్టపడ్డాడంటే కాదనగలమా. అనుకోని అదృష్టం మా ఇంటికొచ్చి తలుపు తడుతుంటే ఇంకా జాప్యం ఎలాగ చేయగలం"

"అది కాదమ్మా. అమ్మాయి ఇష్టం కూడా ఒకసారి తెలుసుకోవాలిగా" అన్నారు తేజ.

"ఏమమ్మా. నువ్వేమంటావు?" కూతురిని అడిగారు రాఘవరావు గారు.

యశస్వి నవ్వు మొహం కళ్ళల్లో కదులాడుతుండగా తనకు అంగీకారమేనన్నట్లు తలాడించింది.

"ఇంకెందుకు ఆలస్యం బావగారు. ముహూర్తాలు పెట్టుకోవడమే తరువాయి" అన్నారు తేజగారు.

"దానికి ముందు మా కుటుంబం

**"ఏమమ్మా. నువ్వేమంటావు?" కూతురిని అడిగారు రాఘవరావు గారు.**
**యశస్వి నవ్వు మొహం కళ్ళల్లో కదులాడుతుండగా తనకు అంగీకారమేనన్నట్లు తలాడించింది.**

గురించి, మా స్థితిగతుల గురించిన వివరాలు మీకు చెప్పాలి బావగారు" అన్నారు రాఘవరావు గారు.

"అవన్నీ ముందుగా తెలుసుకునే మీ ఇంటికి వచ్చాను బావగారు. మీ కుటుంబమెంత సంస్కారవంతమైనదో, మీ అమ్మాయిని మీరెంత క్రమశిక్షణతో పెంచారో నాకు బాగా తెలుసు.

మీ అమ్మాయిని కూడా ఇంతకుముందే వాళ్ళ ఆఫీసులో చూశాను. రెండు వేల కోట్ల టర్నోవర్ వున్న మా సంస్థని మున్ముందు చూసుకోవలసిన బాధ్యత మా అబ్బాయిది, కాబోయే కోడలిది. ఆ సామర్థ్యం, వివేకం మీ అమ్మాయికి, సారీ మా బంగారు కోడలికి ఉందని మనసారా నమ్ముతున్నాను కాబట్టే పనిగట్టుకుని మీ ఇంటికి వచ్చాను సంబంధం కలుపుకుందామని" శశిరేఖని మురిపెంగా చూస్తూ అన్నారు తేజ.

తేజగారి మాటలు విన్న శశిరేఖ అసంకల్పితంగా వెళ్ళి ఆయన పాదాలకు నమస్కరించింది.

ఆమె తల నిమురుతూ ఆశీర్వదించారు తేజా గారు.

ఆ సంతోషమిచ్చిన ఎనలేని తృప్తితో పొంగి పొరలుతున్న తమ ఆనంద భాష్పాలను తుడుచుకోసాగారు రేవతి, రాఘవరావు గార్లు. ■

## అవి... ఇవి..!

### రంగులు మారే సరస్సు

లాగూనా కొలరాడా అనే సరస్సు ఎరుపు, గులాబీ, గోధుమ రంగుల్లో కనిపిస్తుంది. ఇందులోని ఆల్గీ, ఖనిజాలు, సూర్యకాంతి ప్రభావం వల్ల సరస్సులో రంగులు మారుతుంటాయి.

### చెట్ల వేర్లతో వంతెనలు

మేఘాలయలోని అడవుల్లో రబ్బర్ చెట్ల వేర్లను సంవత్సరాల పాటు పెంచి సహజ వంతెనలుగా తయారు చేస్తారు. వీటిని 'లివింగ్ రూట్ బ్రిడ్జ్‌లు' అంటారు. కొన్ని వంతెనలు వంద సంవత్సరాలకు పైబడి ఉపయోగంలో ఉండటం విశేషంగా చెప్పుకోవచ్చు.



### చచ్చి బతికే కప్పలు

ఉడ్ ఫ్రాగ్ శీతాకాలంలో దాని శరీరంలో ఎక్కువ భాగం గడ్డకట్టిపోయినా, వసంత కాలంలో మళ్లీ సాధారణ స్థితికి వచ్చి తిరిగి జీవిస్తుంది. ప్రకృతిలోని అత్యంత ఆశ్చర్యకరమైన జీవన విధానాల్లో ఇది ఒకటని చెప్పవచ్చు.

### పడవలో ఉత్తరాలు బట్వాడా

కేరళ రాష్ట్రంలోని కట్టనాడ్ ప్రాంతంలో ఇప్పటికీ కొన్ని గ్రామాలకు పోస్ట్‌మ్యాన్ పడవలో ప్రయాణించి ఉత్తరాలు పంపిణీ చేస్తారు. ఈ ప్రాంతం కాలువలు, సరస్సులు, బ్యాక్ వాటర్స్‌తో నిండి ఉండటం వల్ల ఆయా గ్రామాలకు రోడ్డు సౌకర్యం పరిమితంగా ఉంది. అందువల్ల పోస్ట్‌మ్యాన్ చిన్న పడవలో ప్రయాణించి ఉత్తరాలు, పార్సిళ్ల అందచేస్తారు. ప్రపంచంలోనే అత్యంత ప్రత్యేకమైన పోస్టల్ సేవల్లో ఇది ఒకటిగా గుర్తింపు పొందింది. ■

# ఆదర్శ కుటుంబం

కథ

మనస్విని

వరండాలో కూర్చోని న్యూస్ పేపర్ చదువుతున్న మధుకు గేటు దగ్గర అలికిడి అవడంతో తలెత్తి, గేటు వైపు చూశాడు. ఒక మహిళ, ఒక పురుషుడు గేటు తీసుకొని లోపలకి వస్తున్నారు. మధు చదవుతున్న న్యూస్ పేపర్ తీసి పక్కన పెట్టి వాళ్ళ వైపు దృష్టి సారించాడు.

'సార్, ఇల్లు అద్దెకు ఉన్నది అని బోర్డు పెట్టారు. ఉన్నదా?` అడిగాడు వచ్చిన వ్యక్తి.

మీరు..!' అంటూ  అడిగాడు మధు. `సారీ సార్..! నా పేరు స్వరూప్, ఈవిడ మా ఆవిడ శాంతి. నేను గ్రూప్ 2 ఆఫీసర్‌ను. అద్దె ఇంటి కోసం తిరుగుతూ ఉంటే బోర్డు కనిపించింది అంటూ తనను తాను పరిచయం చేసుకున్నాడు స్వరూప్.

'రండి సార్..!' అంటూ కుర్చీ ఆఫర్ చేసి, తాను వేరే కుర్చీ లాక్కొని వారికి ఎదురుగా కూచున్నాడు మధు.

'సార్ మాదేమో చిన్న ఇల్లు, మీరేమో గ్రూప్ సర్వీస్ ఆఫీసర్ని అంటున్నారు. మీ హోదాకు మా ఇల్లు సరిపోదేమో..! అని అంటుండగా.. స్వరూప్ అడ్డుపడుతూ 'పరవాలేదు, మీకు ఇవ్వడం ఇష్టం అయితే మాకు ఇబ్బంది లేదు' అన్నాడు.

వీళ్ళు మాట్లాడుతూ ఉండగా కాఫీ తీసుకొని మేఘన వస్తూనే 'ఎవరెవరు ఉంటారు ?' అని అడిగింది.

'మేము, మా అత్తగారు, మాకు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి.` అని శాంతి చెబుతుండగా మధు అప్రయత్నంగా 'అత్తగారు కూడా మీతో కలసి ఉంటారా? ఎంత అదృష్టవంతురాలు ఆమె` అని అంటుండగా.. మేఘన ఒక్కసారి మధువైపు ఉరిమి చూడడంతో మధు టాపిక్ మారుస్తూ.. అద్దె వివరాలు చెప్పాడు.

రేపు సామాన్లతో వస్తాం అంటూ అడ్వాన్స్ ఇచ్చారు. మేఘన జోక్యం చేసుకుంటూ రేపు అంటున్నారు..! మంచి రోజు కాదు కదా..! ఆదివారం, పైగా అమావాస్య..!' అని మాట్లాడుతుండగా.. స్వరూప్ కల్పించుకొని `మాకు ఆ పట్టింపులు ఏమీ లేవండీ ! అంటూ తిరిగి సమాధానం కోసం వేచి చూడకుండానే వాళ్ళ దగ్గర సెలవు తీసుకొని బయలుదేరారు స్వరూప్ దంపతులు.

వాళ్ళు బయటకు నడవగానే 'కనీసం వాళ్ళ కులం ఏమిటో? గోత్రం ఏమిటో? ఏమి కనుక్కోకుండా అడ్వాన్స్ తీసుకున్నారు.` అంటూ  మేఘన ప్రశ్నల వర్షం కురిపించింది.

కులగోత్రాలతో పనేమిటి? చక్కగా వాళ్ళు ఇద్దరు, వాళ్ళకు ఇద్దరు, పైగా వాళ్ళ అమ్మగారు కూడా వాళ్ళతోనే ఉంటుంది. అది చాలదా? వాళ్ళు మంచి మనుషులు అని చెప్పడానికి, అంటూ మేఘన సమాధానం, స్పందన చూడకుండానే టక్కున లేచి లోపలికి వెళ్ళాడు మధు. `అవును మీ అమ్మ మంచిదే, నేను మాత్రమే గయ్యాళిని. తల్లితో కలసి ఉండడం అన్న ఒక్క విషయం నచ్చినట్లు ఉంది తమరికి. ప్రతి అంశంలోనూ అత్తగారి ప్రస్తావన రావాల్సిందే' అంటూ విసుక్కుంది మేఘన.

• • •



మధు ఒక స్కూల్ టీచర్. మధు, మేఘన దంపతులకు ఒక బాబు, ఒక పాప. జ్యోతి మధు తోబుట్టవు. తండ్రి మాధవరావు కాలం చేసిన తర్వాత వాళ్ళ ఊర్లో ఉన్న ఆస్తులను ఆయన అక్క, మధు ఇద్దరూ సరి సమానంగా పంచుకున్నారు. తన జీతం మీద లోన్ పెట్టి, పిత్రార్జితం కలిపి తన గ్రామానికి పక్కనే ఉన్న నగరంలో రెండు పోర్షన్ల ఇల్లు కట్టుకున్నాడు. తల్లి వైదేహి కూడా తనతో పాటు ఉంటూ వచ్చింది. ఆస్తి సమానంగా పంచుకున్న తర్వాత తల్లి ఇద్దరి దగ్గర సమానంగా ఉండాలి అనే లాజిక్ తో మేఘన మధుతో గొడవ పెట్టుకుంది. జ్యోతి అత్త కూడా జ్యోతి వాళ్ళతోనే ఉండడంతో వియ్యపురాళ్ళు ఇద్దరికీ సరిపడకపోవడంతో జ్యోతి తన తల్లిని తనతో ఉంచుకోలేని పరిస్థితి. ఈ గందరగోళ పరిస్థితి వల్ల తన తల్లిని అనివార్యంగా వృద్ధాశ్రమంలో చేర్చి, అప్పుడప్పుడు వెళ్ళి చూసి, వస్తూంటాడు మధు.

• • •

చెప్పిన ప్రకారం స్వరూప్, శాంతి, తల్లి, ఇద్దరు పిల్లలతో మధు వారి ఇంటిలో చేరారు. చాలా తక్కువ సామాన్లతో వచ్చారు. ఒక్క దేవుడి ఫోటో కూడా లేదు. కనీసం పాలు కూడా పొంగించలేదు. నేరుగా సామాన్లతో ఆదివారం, అమావాస్య రోజు వచ్చారు. అని మేఘన నసుగుడు మొదలుపెట్టింది. మధు మనకు కావలసింది అద్దె. ఇల్లు శుభ్రంగా ఉంచడం, ఇరుగు పొరుగుతో బాగుండడం, మిగిలిన విషయాలు మనకు ఎందుకు..?`అని మేఘనను వారించాడు మధు.

వారు ఇంట్లో చేరిన దగ్గర నుంచి ఒక క్రమ పద్ధతిలో వారి రోజువారీ కార్యక్రమాలు జరుగుతూ ఉండడం మధు దంపతులకు, పిల్లలకు చాలా ఆసక్తిని రేకెత్తించాయి. అయిదుగురు ఉదయాన్నే ఐదు గంటలకు లేచి, ఒక గంట అందరూ కలిసి వాకింగ్ చేస్తారు. అటు పైపనులను విభజన చేసుకొని, వారానికి ఇద్దరు చొప్పున చేసుకుంటారు. అందరూ అన్ని పనులూ చేస్తారు. ఒక వారం ఒక ఇద్దరు వంటపని చేస్తే, మరొక ఇద్దరు ఇంటిపని చేస్తారు. మరొకరు అనుబంధ పనులు చేస్తారు. అందరూ అన్ని పనులు చేయాల్సిందే. ఎవరికి ఇగోలు లేవు. ఉదయం టిఫిన్ అందరూ కలిసి చేస్తారు. మధ్యాహ్నం ఎవరి క్యారేజీ వారిదే. పిల్లలు దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలకు సైకిల్ మీద వెళతారు. స్వరూప్ తన ద్విచక్ర వాహనం మీద ఆఫీసుకు వెళతాడు. ఆయన హోదాకు ప్రభుత్వ వాహనం వాడే అవకాశం ఉన్నా, ఒక్క రోజు కూడా ప్రభుత్వ వాహనంలో ఇంటికి రావడం కానీ, ఆఫీసుకి పోవడం కానీ జరగలేదు. శాంతి, శాంతి అత్త ఇదరూ స్కూటీ మీద పిల్లలు వెళ్ళగానే వెళతారు. సాయంత్రం పిల్లలు వచ్చే సమయానికి ఇల్లు చేరుతారు. సాయంత్రం అందరూ కలిసి డిన్నర్ చేస్తారు.

వారి జీవన విధానం మేఘన, మధులోనే కాదు వాళ్ళ పిల్లలలో, చుట్టు పక్కల ఇళ్ళల్లో కూడా చర్చ జరగడానికి కారణం అయ్యింది. ఎవరిని ఏమి అడిగినా నవ్వుతూ సమాధానం ఇస్తారు.

అయిదుగురు మధ్య అద్భుతమైన పరస్పర అవగాహన. ప్రేమ, సమన్వయం. భార్య, భర్త అంటే ఇలా ఉండాలి, అత్త కోడలు అంటే ఇలా ఉండాలి, అన్నాచెల్లి అంటే ఇలా ఉండాలి, అమ్మకొడుకు అంటే ఇలా ఉండాలి. తల్లి తండ్రులు, పిల్లలు అంటే ఇలా ఉండాలి అనిపించేలా ఉంది వారి జీవన విధానం. అసలు ఆ కుటుంబమే ఒక కొత్త నమూనాగా ఉంది. రెండు మూడు నెలలు గడిచినా వారి జీవన విధానంలో ఎలాంటి మార్పులు కనపడలేదు. మధు, మేఘనలు కూడా వారి జీవన విధాన నమూనాను అనుకరించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. మధు కూడా ఇంతకు ముందులా కాకుండా మేఘనకు వంటపనిలో సహాయం చేయడం మొదలుపెట్టాడు. పిల్లలను కూడా ఇంటిపనిలో భాగస్వామి చేయడం మొదలు పెట్టారు. వీళ్ళలో మార్పుతో పాటు, స్వరూప్ కుటుంబం గురుంచి తెలుసుకోవాలనే తపన మధు, మేఘనలలో ఎక్కువ అయ్యింది. ఇరుగు పొరుగు వారు కూడా స్వరూప్ కుటుంబ వివరాల

తరువాయి 15 లో

4వ పేజీ నుంచి

## ఆడంబరాల్లేని ఆదర్శ కుటుంబం...

గురుంచి ఆరాలు తీయడం మొదలైంది. మధు తన పరిచయాల ద్వారా పిల్లల స్కూల్లో వివరాలు సేకరించడం మొదలుపెట్టారు. మేఘన శాంతి, వాళ్ళ అత్తతో మాటల మధ్య ప్రశ్నలు తొంగి చూస్తున్నాయి. పిల్లల చదువు, ఆటల మధ్య కూడా ఇదే పద్దతి. ఈ విషయాలు అన్నీ స్వరూప్ దృష్టికి వచ్చాయి. ఒక రోజు మధు, మేఘనలను కూర్చో బెట్టి స్వరూప్ తన జీవిత కథను చెప్పడం మొదలు పెట్టాడు.

● ● ●

నాది ఏ ఊరో, నా తల్లితండ్రులు ఎవరో నాకు తెలియదు. నాకు ఊహ తెలిసేసరికి నా అడ్రస్ కేరాఫ్ రైల్వే ప్లాట్ ఫామ్. కొంతమంది మా చేత బిక్షాటన, దొంగతనాలు చేయించి, మాకు ఆహారం పెట్టి మేము సంపాదించిన మొత్తాన్ని వాళ్ళు తీసుకునేవాళ్ళు. రాత్రి పూట మా నివాసం రైల్వే ప్లాట్ ఫామ్. మాలాంటి పిల్లల పరిస్థితి చూసి, శరత్ బాబు గారు అనే రైల్వే ఉద్యోగి మాకోసం నెల్లూరు జిల్లా, అల్లూరు మండలం, గొల్లపాలెం గ్రామంలో ఒక ఆశ్రమం నిర్మించారు. మా బ్యాచ్ పిల్లలను ఆయన అక్కడికి తీసుకెళ్లారు. ఆయన తన జీతంలో అధికభాగంతో పాటు, దాతలు ఇచ్చిన సహాయ సహకారాలతో మా లాంటి ప్లాట్ ఫామ్ పై తిరిగే పిల్లలకు ఆశ్రయం కల్పించారు. అక్కడ మా జీవితాన్ని ఒక క్రమ పద్దతిలో, క్రమశిక్షణతో సాగేలా చేశారు ఆ మహానుభావుడు. అక్కడ అందరం అన్ని పనులు చేయాలి. ప్రతి వారం ఒక్కొక్క టీం, ఒక్కొక్క బాధ్యత. అక్కడ జీవితం విలువ, విలువలతో జీవించడం ఆ మహానుభావుని నీడలో నేర్చుకున్నాం. ప్రభుత్వ పాఠశాల, కాలేజీలో చదువుకొని గ్రూప్ సర్వీసెస్ కు ఎంపిక అయ్యాను. నా మొదటి పోస్టింగ్ ఆఫీసు లో స్వీపర్ మా అమ్మ ఫాతిమా. ఆమెకు పిల్లలు లేరు. ఆమె భర్త మద్యానికి బానిస అయ్యి చనిపోయాడు. జీవనం కోసం అక్కడ రోజువారి కూలీగా ఆఫీసు ఊడ్చే పని చేస్తూ ఉండేది. ఆమె నాకు ఆ ప్రదేశంలో ఆశ్రయం ఇచ్చిన వ్యక్తి. ఇక నా భార్య శాంతి ఆమె ఒక అనాథ. ఆమె తండ్రి, తల్లిపై అనుమానంతో ఆమెను కడతేరిస్తే, ఆయన జైలు పాలయ్యాడు. బంధువులు ఎవరి దగ్గర ఆమెకు ఆశ్రయం దొరక్కపోవడంతో ఆమె మేనమామ ఆమెను అనాధ ఆశ్రమంలో చేర్చారు. ఆమె దూర విద్య పద్దతిలో ఎం.ఎ.ఇంగ్లీషు చదివింది. నేను నా విధి నిర్వహణలో భాగంగా అనాధ ఆశ్రమానికి వెళ్ళినప్పుడు ఆమె పరిచయం అయ్యారు. అక్కడ ఆశ్రమ నిర్వాహకుల ముందు ప్రతిపాదన పెట్టి, ఆమె అంగీకారంతో ఇద్దరం పిల్లలు వద్దు అనే షరతు మీద మేము రిజిస్టర్ పెళ్లి చేసుకున్నాం. మా అమ్మ ప్రస్తుతం శాంతి పార్ట్ టైమ్ ఉద్యోగం చేసే కాలేజీలోనే బి ఏ చదువుతూ ఉన్నది. ఈ పిల్లలు ఇద్దరూ మా పెళ్ళినాటికి అనాధ ఆశ్రమంలో చేరిన అనాధలు. చట్టప్రకారం వారి ఇద్దరినీ మేము దత్తత తీసికున్నాం. మేము ఎవరం ఏ కులమో, ఏ మతమో, ఎవరికి ఏమి అవుతామో అన్న ఆలోచన ఎప్పుడూ మా మధ్య రాదు. ఒకరి కోసం ఒకరం అందరం కలిసి జీవిస్తున్నాం. ఎవరికీ ఎవరి మీద అధికారం, ఆధిపత్యం లేదు. అందరం ప్రేమను పంచుకుంటూ, ప్రతి క్షణం ఒకరికి ఒకరం కృతజ్ఞతగా ఉంటూ అందరం కలిసి ఉంటాం. మాకు భవిష్యత్ మీద ఆశ తప్ప, ఆందోళన లేదు. మాకు వచ్చే ఆదాయంలో మా కుటుంబ కనీస అవసరాలు తీర్చుకుంటూ మిగిలిన మొత్తాలను సమాజానికి ఉపయోగిస్తాం. ' అంటూ తన గతాన్ని విన్పించాడు స్వరూప్. చెమర్చిన కళ్ళతో గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు మధు. మేఘన కూడా వర్షిస్తున్న కళ్ళతో చేతులు జోడించి మీ గురుంచి ఏమైనా తప్పుగా వ్యవహరించి ఉంటే క్షమించండి` అంటూ స్వరూప్ ముందు తల వంచి నిలబడింది. స్వరూప్ వారి భుజాల మీద చేయి వేసి, క్షమించండి, నేను ముందే ఈ విషయాలు చెప్పి ఉండవల్సింది. కానీ మీరు ఎలా అర్థం చేసుకుంటారో అని చెప్పలేదు అంటూ వారి దగ్గర నుంచి సెలవు తీసుకొని బయటకు నడిచాడు స్వరూప్. మధు, మేఘనలకు తాము విన్నది తామే నమ్మలేకపోతున్నారు. మేఘన మధు భుజం మీద చేయి వేసి 'అర్జెంట్ గా అత్తయ్య గారి దగ్గరకు తీసుకెళ్లండి. ఆమెకు క్షమాపణ చెప్పి మనతో తెచ్చుకుందాం, తెచ్చుకోవడమే కాదు, ఎప్పుడూ ఆమెను మనతోనే ఉంచుకుందాం`అంటూ తొందరపెట్టసాగింది. మేఘనలో వచ్చిన మార్పుకు స్వరూప్ కు మనసులో కృతజ్ఞతలు చెప్పుకుంటూ, స్వరూప్ నడుస్తున్న దారిలో తాము నడవాలి అని గట్టిగా అనుకుంటూ ఇద్దరూ బయలుదేరారు వృద్ధాశ్రమానికి.

✦

## పరోపకారం

అనగనగా భీమాపురం గ్రామంలో చందు అనే ఒక పేద పిల్లవాడు ఉండేవాడు. అతడికి తల్లిదండ్రులు, బంధువులెవ్వరూ లేరు. చందు చాలా తెలివైన పిల్లవాడు. ఆయనకు తల్లిదండ్రులు రెండు మడిసెక్కలు ఇచ్చారు. చందు తన నాన్నగారు ఇచ్చిన రెండు మడిసెక్కలను చూసుకుంటూ బడికి వెళ్లి చదువుకునేవాడు. చందు పొలం చూసుకోవడంలో సరిగ్గా బడికి వెళ్లలేకపోయేవాడు. పైగా తమ దగ్గర పుస్తకాలు, బట్టలు కొనేందుకు తగిన డబ్బులు కూడా ఉండేవి కావు. తిండి ఒక పూట తింటే ఇంకొక పూట పస్తులు ఉండాల్సి వచ్చేది. అందుకే చదువుతో ఎవరో స్నేహం కూడా చేసేవారు కాదు. పైగా అందరూ పేదవాడని హేళన చేసేవారు. చందు అవేవీ పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటూ చదువుకునేవాడు.

ఒకరోజు చందు పొలం పని చేసుకుని బడికి వెళ్తుండగా దారిలో గిరిజ అనే అమ్మాయి పరిచయమైంది. ఇద్దరూ అతి తక్కువకాలంలోనే స్నేహితులయ్యారు. చదువు విషయంలో సబ్జెక్టు అంశాలు కూడా బాగా చర్చించుకునేవారు. ఇద్దరూ చదువుకునేవారు. గిరిజ తన పుస్తకాలను చందుతో పంచుకుంది. గిరిజ ప్రధానోపాధ్యాయుల కూతురు. ఆ విషయం చందుకి తెలియదు. ఒకరోజు చందు పొలం పని చేసుకోవడంతో బడికి రాలేకపోయాడు. గిరిజ ఆ విషయం తెలియక తరగతి గదిలో దిగులుగా కూర్చుని చందు కోసం ఎదురుచూస్తోంది. ఎంతసేపటికి చందు బడికి రాకపోయేసరికి గిరిజ తన నాన్నగారైన ప్రధానోపాధ్యాయుల దగ్గరకు వెళ్ళింది. నాన్న చందు ఈరోజు బడికి రాలేదు ఎందుకని అడిగింది. సరే తల్లి మనం చందు ఇంటికి వెళదాం అన్నారు. అప్పుడు గిరిజ సంతోషంగా చందు ఇంటికి వెళ్ళింది. కానీ చందు ఇంటిదగ్గర లేడు. గిరిజ వాళ్ల నాన్నగారు పక్కింటి వారిని అడిగితే ఇలా అన్నారు. "ఆ... చందుగాడా? వాడు పొలానికి వెళ్ళాడు"అని చెప్పారు. వెంటనే గిరిజ వాళ్ళ నాన్నగారు కలిసి చందు పొలం దగ్గరకు వెళ్లారు. గిరిజ చందుతో ఇలా అంది. 'చందు ఈరోజు నువ్వు బడికి ఎందుకు రాలేదు అని అడిగింది'. 'నాకు తల్లిదండ్రులు, బంధువులెవ్వరూ లేరు. మా నాన్న ఇచ్చిన ఈ పొలం చేసుకుంటూ బడికి వస్తున్నాను' అని చందు అన్నాడు. 'మరి నాకు ఇదంతా ఎందుకు చెప్పలేదు' అని గిరిజ అడిగింది. చందు కాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. గిరిజ వాళ్ళ నాన్నతో ఇలా అంది. 'నాన్న మన దగ్గర సోమయ్య ఉన్నాడు కదా అతనికి ఈ పొలం చూసుకోమని చెప్పు. చందు మనతోనే మన ఇంట్లోనే ఉంటాడు' అని గిరిజ తండ్రితో చెప్పింది. 'సరే తల్లి అలాగే మన ఇంట్లోనే చందుని ఉంచుదాం' అని తండ్రి బదులిచ్చాడు. ఇంక సంతోషంగా ఇంటికి వెళ్ళింది. ఆ తర్వాత చందును కూడా వారింటికి తీసుకెళ్లారు. ఇక అప్పటినుండి ఇద్దరూ కష్టపడి బాగా చదువుకున్నారు. ప్రయోజకులు అయ్యారు.

**బి.గీత**



**8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పారసాం, నెల్లిమర్ల మండలం, విజయనగరం జిల్లా.**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి






## ఈ వారం కథ

# పరివర్తన

సిరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతిరావు గారికి ఆ ఊరంటే ఒక మమకారం, ఆ స్కూలంటే ఒక దేవాలయం. ఆయన ఉద్యోగ విరమణకు మరో ఆరు నెలలే ఉంది. "నేను వెళ్ళిపోయినా, నా పిల్లలు సమాజంలో తల ఎత్తుకుని బ్రతికేలా కొన్ని విలువలనైనా నేర్పాలి" అనేది ఆయన నిత్య తపన.

కానీ, ఆ ఊరి సర్పంచ్ శ్రీపతి గారి ఏకైక పుత్రరత్నం సూర్యం మాత్రం దానికి పూర్తి భిన్నం. క్లాసులు ఎగ్గొట్టడం, తోటి పిల్లల బ్యాగుల్లోంచి పెన్నులు దాచడం, అడిగితే 'నాకేం తెలీదు' అని బుకాయించడం వాడికి అలవాటు.సర్పంచ్ కొడుకుననే అహంకారంతో టీచర్ల మాటల్ని కూడా నవ్వుతూ తేలికగా తీసుకునేవాడు.

ఆ శనివారం సాయంత్రం కూడా తిరుపతి రావు గారు క్లాసు ముగిసే ముందు నల్లబల్లపై తెల్లటి చాక్పీస్తో ఒక వాక్యం రాశారు: "నిజాయితీ అంటే... ఎవరూ చూడనప్పుడు కూడా మనం సరైన మార్గంలోనే నడవడం."

సూర్యం దాన్ని చూసి పక్కనున్న వాడితో ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ, "ఎవరూ చూడనప్పుడు నడిస్తే ఏంటి, పరిగెడితే ఏంటి? ముసలాయనకి పద్యాలు ఎక్కువైపోయాయి" అని గిలకరింతలు పెట్టాడు.తిరుపతి రావు గారు అన్నీ గమనిస్తూనే నిట్టూర్చారు.

మరుసటి వారం స్కూల్లో ఇన్స్పెక్షన్ (అధికారుల తనిఖీ) ఉండటంతో వాతావరణం కాస్త హడావిడిగా ఉంది. అదే రోజు ఉదయం ఊరి సర్పంచ్ గారు స్కూలుకొచ్చారు. డ్రాయర్ సర్దుకుంటున్న తిరుపతి రావు గారి ముందు ఒక తెల్లటి కవరు పెట్టారు.

"ఏంటి సర్పంచ్ గారూ ఇది?" అడిగారు తిరుపతి రావు గారు.

"ఏం లేదు మాస్టారూ, మన స్కూల్లో కంప్యూటర్ల రిపేర్ల కోసం నా వంతుగా ఒక పాతిక వేల రూపాయల విరాళం. మీరే దగ్గరుండి చేయించండి" అంటూ కవరు అందించి వెళ్ళిపోయారు. ఆ హడావిడిలో తిరుపతి రావు గారు ఆ డబ్బుల కవరును టేబుల్ డ్రాయర్లో వేసి, తాళం పెట్టడం మర్చిపోయి క్లాసు రూముల వైపు పరిగెత్తారు.

సరిగ్గా అదే సమయంలో... సూర్యం క్లాసులో బోర్ కొట్టి, పర్మిషన్ లేకుండా బయటకొచ్చాడు. దాహం వేసి స్టాఫ్ రూమ్ వైపు వెళ్లడం, అక్కడ కాసేపు అటు ఇటు తిరగడం కొందరు తోటి విద్యార్థులు చూశారు.

సాయంత్రం నాలుగు గంటలు. ఇన్స్పెక్షన్ ముగిసింది. అలసిపోయిన తిరుపతి రావు గారు తన గదిలోకి వచ్చి, డబ్బుల కవరు తీసి బీరువాలో పెడదామని డ్రాయర్ తెరిచారు.

అంతే... ఆయన గుండె ఒక్కక్షణం ఆగినంత పనైంది. డ్రాయర్ ఖాళీగా ఉంది! పాతిక వేల రూపాయల కవరు మాయమైంది!

"రామచంద్రా! ఎంతపని జరిగింది?" అంటూ ఆయన గట్టిగా పిలిచేసరికి మిగతా టీచర్లు కంగారుగా పరిగెత్తుకుంటూ వచ్చారు. విషయం తెలియగానే స్కూలంతా అల్లకల్లోలమైంది.

"సార్... లంచ్ బెల్లు ముందే సూర్యం గాడు ఒక్కడే స్టాఫ్ రూమ్ వైపు తిరగడం నేను చూశాను సార్!" అన్నాడు క్లాస్ లీడర్ రాము భయపడుతూనే.

మరో టీచర్ పరమేశ్వరం గారు అందుకున్నారు, "నాకూ నమ్మకమే సార్. నిన్ననే వాడు కొత్త గేర్ల సైకిల్ కావాలని వాళ్ల నాన్నను అడిగితే ఆయన అందరిముందూ తిట్టారు. ఆ కోపంలో, డబ్బులు చూసి లాగేసుంటాడు. ప్రెసిడెంట్ కొడుకైతే మాత్రం ఇంత పెద్ద దొంగతనాన్ని ఊరుకుందామా?" అన్నారు ఆవేశంగా.

తిరుపతి రావు గారు సూర్యాన్ని ఆఫీస్ రూముకు పిలిపించారు. వాడు దేనికీ లొంగకుండా, "నేను తీయలేదు సార్... దాహం వేసి ఫిల్టర్ దగ్గరకు నీళ్లు తాగడానికి వచ్చాను, అంతే!" అని గట్టిగానే వాదించాడు. కానీ, వాడి పాత ప్రవర్తన వల్ల ఎవ్వరికీ వాడి మీద నమ్మకం కలగలేదు.

విషయం తెలిసి సర్పంచ్ గారు ఉగ్రుడై స్కూలుకు వచ్చారు. కొడుకు కాలర్ పట్టుకుని ఊగేశారు. "ఒరేయ్! నా డబ్బునే నా పరువు తీయడానికి దొంగతనం చేస్తావా? ఎక్కడ పెట్టావురా డబ్బు?" అంటూ అందరి ముందూ రెండు లాగారు.

సూర్యం కళ్లల్లోంచి నీళ్లు తిరిగాయి. "నిజంగా నేను తీయలేదు నాన్నా... నమ్మండి" అని ఎంత ఏడ్చినా ఆ అరణ్యరోదనం ఎవరూ వినలేదు. వాడి బ్యాగ్ వెతికినా ఏమీ దొరకలేదు. "ఎక్కడో దాచేసి ఉంటాడు" అని తేల్చేసారు

.ఆ అవమానం భరించలేక సూర్యం మరుసటి రోజు నుండి స్కూల్కు రావడం మానేశాడు. ఊరి జనం కూడా వాడిని చూసి 'దొంగ సూర్యం' అని గుసగుసలాడటం మొదలుపెట్టారు. దాంతో వాడు ఇల్లు కదలకుండా, ఎవరితోనూ మాట్లాడకుండా గదిలోనే ఉండిపోయాడు.

రెండు రోజుల తర్వాత... ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ వార్డు. రాము తల్లికి కాస్త స్పృహ వచ్చింది. సెలైన్ బాటిల్ వైపు శూన్యంగా చూస్తున్న ఆమెకు, పక్కనే తలదించుకుని కూర్చున్న రాము కనిపించాడు. వాడి చేతిలో నలిగిపోతున్న ఆ తెల్లటి కవరును, అందులోని నోట్ల కట్టలను ఆమె గమనించింది.

రాము వైపు దీనంగా చూస్తూ, ఎండిపోయిన పెదవులతో...

"రాము... ఏంట్రా ఆ కవ్ఁ? అంత డబ్బు ఎక్కడిది నాయనా?" అంది నీరసంగా.

రాము కంగారుగా కన్నీళ్లు తుడుచుకుంటూ, "అది... అది... ప్రెసిడెంట్ గారు మన కష్టాలు చూసి మన కోసమే హాస్పిటల్ ఖర్చులకి ఇచ్చారమ్మా! నువ్వేం భయపడకు, ఆపరేషన్ అయి-ఁపోతుంది" అని అబద్ధం చెప్పి తలదించుకున్నాడు.

ఆ తల్లి కాసేపు కొడుకు ముఖాన్ని తీక్షణంగా చూసింది. ఆమె కళ్లల్లో అనుమానం రేకెత్తింది. రాము చేయి పట్టుకుని తన వైపు తిప్పుకుంది.

"రాము... పొద్దున వార్డులో ఉన్న పక్కూరి లక్ష్మమ్మ చెప్పిందిరా... ప్రెసిడెంట్ గారు స్కూలు కంప్యూటర్ల కోసం పాతిక వేల రూపాయల విరాళం కవరులో పెట్టి హెడ్మాస్టర్ గారికి ఇచ్చారని, ఆ కవరు స్కూల్లో ఎవరో దొంగిలించారని ఊరంతా చెప్పుకుంటున్నారట. ఇప్పుడు నీ చేతిలో ఉన్న కవరు చూస్తుంటే... నా గుండె గుభేలుమంటోందిరా! నిజం చెప్పు... ప్రెసిడెంట్ గారు స్కూలుకిచ్చిన ఆ సొమ్ము నీ చేతికి ఎలా వచ్చింది? నా కళ్లల్లోకి చూసి చెప్పు రాము!" ఆమె గొంతు వణికింది.

రాము ఒక్కసారిగా స్తంభించిపోయాడు. తల్లి ముందు తన అబద్ధం తేలిపోవడంతో వాడి గుండె వేగంగా కొట్టుకుంది.

ఆమె కళ్లల్లో నీళ్లతో ఇలా అంది... "నాయనా, పేదరికంలో బ్రతకడం తప్పు కాదురా, కానీ పరుల సొమ్ము ఆశించడం మహాపాపం. ఒకవేళ నా ప్రాణం కాపాడటం కోసం నువ్వు నీ నీతిని వదులుకుంటే... ఆ బ్రతుకు నాకు వద్దురా. మనల్ని నమ్మి అక్షరాలు నేర్పే గురువుల నమ్మకాన్ని చంపేసి, నేను బ్రతికినా ఒక్కటే, చచ్చినా ఒక్కటే. ఆ డబ్బులు ఎవరివో, ఎక్కడివో రేపు పొద్దున్నే తిరిగి ఇచ్చేయ్. నా ప్రాణం ఆ దేవుడు రాసినంత వరకే ఉంటుంది, కానీ నీ విలువలు మాత్రం నీ జీవితాంతం ఉండాలిరా!" అంది.

తల్లి మాటల్లోని ఆ పవిత్రత రాము గుండెను పిండేశాయి. ఆ రాత్రంతా వాడు నిద్రపోలేదు. శనివారం మాస్టారు బోర్డు మీద రాసిన ముక్కే వాడి మైండ్లో తిరుగుతూ ఉంది... "ఎవరూ చూడనప్పుడు కూడా నిజాయితీగా ఉండడమే విలువ." ఇక్కడ తన తప్పును లోకం చూడలేదు సూర్యాన్నే దొంగ అనుకుంది, కానీ తన తల్లి సంస్కారం ముందు తను నేరస్థుడిగా నిలబడలేకపోయాడు.

మరుసటి రోజు ఉదయం...

తిరుపతి రావు గారు స్కూల్ రికార్డులు రాసుకుంటుండగా, రాము నిశ్శబ్దంగా లోపలికి వచ్చాడు. వాడి ముఖం విరబోసినట్టుంది. వణుకుతున్న చేతులతో తన జేబులోంచి ఆ తెల్లటి కవరును తీసి తిరుపతి రావు గారి టేబుల్ మీద పెట్టాడు.

తిరుపతి రావు గారు ఒక్కసారిగా కుర్చీలోంచి లేచారు. "రాము! ఏంటిది? ఆ కవరు నీ దగ్గర ఎలా ఉంది?"

రాము టేబుల్ మీద మోకరిల్లి, మాస్టారి కాళ్లు పట్టుకుని వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు. "నన్ను క్షమించండి సార్... ఆ రోజు ఆఫీస్ రూమ్ ఖాళీగా ఉండేసరికి, మా అమ్మ ఆపరేషన్ కోసం నా బుద్ధి గడ్డితిని నేనే ఆ డబ్బులు దొంగిలించాను సార్... కానీ మా అమ్మ నన్ను నిలదీసింది సార్. నా వల్ల సూర్యం తప్పు చేయకపోయినా నింద పడ్డాడు. నా అంతరాత్మ నన్ను బ్రతకనివ్వడం లేదు. నన్ను పోలీసులకు అప్పగించండి సార్..." అంటూ ఏడ్చాడు.

రఘురామయ్య గారి కళ్లు చెమర్చాయి. రాము చేసిన తప్పు కంటే, వాడు చూపిన పశ్చాత్తాపం, వాడి తల్లి సంస్కారం ఆయనను కదిలించాయి. ఆయన రాము భుజం తట్టి, "నువ్వు దొంగవి కావురా రాము, క్షణికావేశంలో తప్పు చేసినా, నీలోని విలువలను బ్రతికించుకున్న విజేతవి. నీ అమ్మ ఆపరేషన్కు నేను వ్యక్తిగతంగా సాయం చేస్తాను, నువ్వేం భయపడకు" అని ఓదార్చారు.

కానీ, కథ అక్కడితో అయిపోలేదు.తిరుపతి రావు గారి మనసు సూర్యం వైపు లాగింది.

వెంటనే ఆయన సర్పంచ్ గారి ఇంటికి వెళ్లారు. గదిలో ఒంటరిగా కూర్చుని ఏడుస్తున్న సూర్యం దగ్గరకు నడిచారు.సర్పంచ్ గారు కూడా అక్కడే ఉన్నారు.

తిరుపతి రావు గారు సూర్యం తలపై చేయి వేశారు. సూర్యం ఉలిక్కిపడి చూశాడు.

"నన్ను క్షమించు సూర్యం... తప్పు నీది కాదు. డబ్బు దొరికింది, దొంగ దొరికాడు. నువ్వు ఏ తప్పు చేయలేదు. నిన్ను నమ్మకుండా అందరి ముందూ అవమానించినందుకు ఈ మాస్టార్ని క్షమించు నాయనా..." అన్నారు తిరుపతి రావు గారు కళ్లల్లో నీళ్లతో.

సూర్యం స్తంభించిపోయాడు. ఎప్పుడూ తను క్లాసులో అల్లరి చేస్తే తిట్టే హెడ్మాస్టర్ గారు... తన దగ్గరకు వచ్చి, తప్పు ఒప్పుకుని, అంత పెద్ద మనసుతో క్షమాపణ అడుగుతుంటే వాడి గుండె కరిగిపోయింది. వాడి కళ్లల్లోంచి కన్నీళ్లు ధారగా కరిగాయి. ఎప్పుడూ ఎవరికీ తలవంచని సూర్యం... టక్కున లేచి తిరుపతి రావు గారిని గట్టిగా హత్తుకున్నాడు.

"లేదు సార్... నా పాత బుద్ధుల వల్లే కదా అందరూ నన్ను అనుమానించారు. ఇకపై నేను ఎప్పుడూ అబద్ధం చెప్పను సార్... మంచిగా చదువుకుంటాను..." అన్నాడు సూర్యం వెక్కిళ్ల మధ్య.

సర్పంచ్ గారు ఆ దృశ్యం చూసి ఆశ్చర్యపోయారు. కొడుకును తను కొట్టినా మారని వాడు, మాస్టారు చూపిన ఒక్క నమ్మకానికి, విలువైన మాటలకి మారిపోవడం ఆయన కళ్లారా చూశారు.

ఆ మరుసటి రోజు నుండి సిరిపురం స్కూల్లో సూర్యం అల్లరి పిల్లోడిగా కాదు... అందరికంటే క్రమశిక్షణ గల విద్యార్థిగా క్లాసు రూపులో అడుగుపెట్టాడు. బోర్డు మీద తిరుపతి రావు గారు రాసిన ఆ ఒక్క విలువల అక్షరం... ఇద్దరు పిల్లల జీవితాలను శాశ్వతంగా మార్చేసింది.

**-మర్రాపు వసుంధరా దేవి,**
**9441467660**

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గాని సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



● మల్లాది వెంకట కృష్ణమూర్తి

# గుడ్డు

"నువ్వు ఇంటికి తిరిగి వెళ్తుండగా మరణించావు."

"నీకు పిచ్చా?" వెంటనే అడిగాను.

"అదో కారు ప్రమాదంలో జరిగింది. నువ్వు నీ భార్యని, ఇద్దరు పిల్లలని వదిలి ఇక్కడికి వచ్చావు. నీది బాధలేని తక్షణ మరణం."

"నేను... నేను నిజంగా చచ్చిపోయానా?"

"అవును."

నేను చుట్టూ చూశాను. అంతా శూన్యం. ఆశ్చర్యంగా భూమి కాని, ఆకాశం కాని కనపడలేదు. కేవలం అతను, నేను మాత్రమే ఉన్నామని గ్రహించాను.

"ఈ ప్రదేశం ఏమిటి? ఇదేనా మరణానంతర జీవితం?" అడిగాను.

"అవును." అతను చెప్పాడు.

"నువ్వు దేవుడా?"

"అవును. నేను దేవుడిని." అతను బదులు చెప్పాడు.

నేను ఆసక్తిగా చూశాను. అతను దేవుడిలా కనిపించలేదు. సర్వశక్తిమంతుడిలా కూడా కాదు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిలా కనిపించాడు.

"నా భార్య, పిల్లలు నా గురించి ఏడుస్తున్నారా?"

"నీ భార్య పైకి ఏడుస్తూ లోపల ఉపశమనం పొందుతోంది. ఐతే నీకు ఊరటని ఇచ్చేది, ఉపశమనం పొందినందుకు ఆమెలో చాలా అపరాధభావం ఉంది."

"ఇప్పుడు నేను స్వర్గానికో, నరకానికో లేక ఇంకెక్కడికైనా వెళ్తానా?" అడిగాను.

"రెండూ కాదు. నువ్వు పునర్జన్మ ఎత్తుతావు."

"అంటే భగవద్గీతలో చెప్పింది నిజమే అన్నమాట."

"ప్రతి మతం దాన్నే తనదైన పద్ధతిలో చెప్పింది."

"నేను మళ్ళీ జన్మించాక ఓ ఖాళీ పలకలా ఉంటానా? పసిబిడ్డలా. ఈ జీవితంలో నేను నేర్చుకున్నవి, నా అనుభవాలు ఏవీ నాతో రావా?"

"నీ గత జన్మలన్నింటి జ్ఞానం నీలో ఉంది. కాని అవి నీకు ఇప్పుడు గుర్తులేవు. నీ ఆత్మ ఎంత అద్భుతమైందో, విశాలమైందో నీకు తెలీదు. నీ మనసు నీలోని అత్యంత చిన్న భాగాన్ని మాత్రమే ఇముడ్చుకోగలదు. అది నీళ్ళు వేడిగా ఉన్నాయో, చల్లగా ఉన్నాయో చూడటానికి గ్లాసు నీళ్ళలో వేలు ముంచడం లాంటిది. దాన్ని తిరిగి బయటకి తీసినప్పుడు, అది పొందిన అనుభవాలన్నీ నీలో నిక్షిప్తమవుతాయి. నువ్వు ఇంకా విస్తరించలేదు. నీ అపారమైన చైతన్యంలోని మిగిలినవన్నీ నువ్వు అనుభూతి చెందలేదు."

"నేను ఎన్నిసార్లు పునర్జన్మ ఎత్తాను?"

"చాలాసార్లు. ఎన్నో రకాల జీవితాల్లోకి ప్రవేశించావు. సాంకేతికంగా చెప్పాలంటే నీకు తెలిసిన కాలం నువ్వు జీవించిన విశ్వంలో మాత్రమే ఉంటుంది. కాని కాలం నిజం కాదు. నాలాంటి వాళ్ళు చాలామంది ఉన్నారు. అది నీకు చెప్పినా ఇప్పుడు అర్థం కాదు."

"నేను గతంలో మరణించినప్పుడల్లా నీతో ఇలా సంభాషించానా?"

"అవును. అది ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. నువ్వు గుడ్డు మాత్రమే కాబట్టి అది



> నీ ఆత్మ ఎంత అద్భుతమైందో, విశాలమైందో నీకు తెలీదు. నీ మనసు నీలోని అత్యంత చిన్న భాగాన్ని మాత్రమే ఇముడ్చుకోగలదు.

నీకు గుర్తు లేదు."

"దీని ప్రయోజనం?"

"నేను ఈ విశ్వాన్ని సృష్టించడానికి కారణం, నువ్వు పరిణతి చెందడమే."

"నేను మాత్రమేనా? లేక మానవాళి మొత్తం పరిణతి చెందాలనా?"

"లేదు. కేవలం నువ్వు మాత్రమే. నేను ఈ విశ్వాన్ని నీ కోసమే సృష్టించాను. ప్రతి కొత్త జీవితంలో నువ్వు ఎదుగుతూ, పరిణతి చెందుతూ మరింతగా విస్తరిస్తావు."

"నేనేనా? అంతానా?"

"మరెవరూ లేరు. ఈ విశ్వంలో నువ్వు మాత్రమే ఉన్నావు."

నేను అతని వంక పిచ్చివాడిని చూసినట్లుగా చూశాను.

"భూమి మీది ప్రజలందరి మాటేమిటి?"

"అంతా నువ్వే. అవన్నీ నీ విభిన్న అవతారాలు."

"ఆగాగు. నేను అందరినా !?"

"ఇప్పుడు నీకు అర్థమవుతోంది."

"ఇప్పటివరకు జీవించిన ప్రతి మానవుడినీ నేనే?" తెల్లబోతూ అడిగాను.

"అవును."

"నేను గాంధీనా?"

"నువ్వు గాడ్సేవి కూడా."

"నేనే హిట్లర్‌నా?" దిగ్భ్రాంతిగా అడిగాను.

"అతను చంపిన లక్షలాదిమంది కూడా నువ్వే. నువ్వు ఎవరినైనా బాధించిన ప్రతిసారీ, నువ్వు నిన్నే బాధించావు. నువ్వు ఇతరులకి చేసిన ప్రతి మంచి పనీ నీకోసమే చేసుకున్నావు. ఏ మనిషైనా అనుభవించిన ప్రతీ సంతోషం, ప్రతీ బాధ నువ్వే అనుభవించావు, ఇకపైనా అనుభవిస్తావు." అతను చెప్పాడు.

"ఇదంతా ఎందుకు?"

"ఎందుకంటే ఏదో రోజు నువ్వు నాలా మారడానికి. నువ్వు నాలాంటి వాడివే. నిజానికి నువ్వే నేను. నేనే నువ్వు."

"అంటే నేను కూడా దేవుడినా?"

"ఇంకా కాదు. నువ్వు నా ఊహవి. నేను నీ ఊహని. నువ్వు ఇంకా ఎదుగుతున్నావు. సకల కాలాల్లోని ప్రతి మానవ జీవితాన్నీ నువ్వు గడిపిన తర్వాత, ప్రతీ జన్మలోనూ ఎదుగుతూంటావు."

"ఐతే నేనో గుడ్డుని అన్నమాట." నేను చెప్పాను.

"అవును. నేను కూడా నీ గుడ్డుని. ఇప్పుడు నువ్వు నీ తర్వాతి జీవితానికి వెళ్ళే సమయం వచ్చింది." అతను చెప్పాడు.

●

**'ఫన్‌డే'లో ప్రచురితమయ్యే**

**ఈ శీర్షికలో మల్లాది కథలు రాయడమే కాదు, మిమ్మల్ని కూడా భాగస్వాములను చేస్తున్నారు. మీరైతే ఈ కథకు ఏ పేరు పెడతారో ఈ కింది మెయిల్‌కు పంపండి.**

**kathakalisakshi@gmail.com**

14 వ పేజీలో..
19-06-2026 సంచిక 'కథాకళి'కి పేరు సూచించిన పాఠకుల పేర్లు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# విజయానికి ధైర్యమే ఆయుధం



"ఒకసారి నేను వారణాసిలో ఉన్నప్పుడు, ఒక వైపు పెద్ద నీటి ట్యాంక్, మరో వైపు ఎత్తైన గోడ ఉన్న ప్రదేశం గుండా వెళ్తున్నాను. ఆ ప్రాంతంలో కోతులు ఎక్కువగా ఉంటాయి. వారణాసిలో ఉండే కోతులు చాలా పెద్దవి, క్రూరమైనవి. కొన్నిసార్లు మొరటుగా కూడా ఉంటాయి. నన్ను అటువైపు వెళ్ళనివ్వకూడదని అవి నిర్ణయించుకున్నాయి, అందుకే నేను వెళ్తుండగా అవి అరుస్తూ, కేకలు వేస్తూ నా కాళ్లను పట్టుకున్నాయి.

అవి మరింత దగ్గరకు వస్తుండగా, నేను పరుగెత్తడం మొదలు పెట్టాను. నేను ఎంత వేగంగా పరుగెత్తితే, కోతులు అంత వేగంగా వచ్చి నన్ను కరవడం మొదలుపెట్టాయి. తప్పించుకోవడం అసాధ్యం అనిపించింది, సరిగ్గా అప్పుడే నాకు ఒక అపరిచితుడు ఎదురయ్యాడు. అతను నన్ను పిలిచి, ''ఆ కోతులను ఎదుర్కోవాలే కాని పరుగులు తీయకూడదు'' అన్నాడు. నేను వెనక్కి తిరిగి కోతులను ఎదుర్కొన్నాను, అవి వెనక్కి తగ్గి చివరకు పారిపోయాయి. అది జీవితం మొత్తానికి ఒక పాఠంలా అనిపించింది. భయంకరమైన దాన్ని ఎదుర్కోవాలి. ధైర్యంగా ఎదుర్కోండి. మనం జీవితంలోని కష్టాల నుండి దూరంగా పారిపోవడం మానేసినప్పుడు, అవి వెనక్కి తగ్గుతాయి. మనం ఎప్పుడైనా స్వేచ్ఛను పొందాలంటే, అది ప్రకృతిని జయించడం ద్వారానే సాధ్యం. పారిపోవడం ద్వారా మాత్రం కానేకాదు. పిరికివాళ్ళు ఎప్పుడూ విజయాలు సాధించరు. అందుకే పిరికితనాన్ని విడనాడాలంటే... భయం - కష్టాలు - అజ్ఞానం... వీటితో పోరాడాలి'' అంటారు స్వామి వివేకానందులు.

ధైర్యంగా జీవించడం అలవాటు చేసుకోవాలని వివేకానందుడు జాతిని ఉద్దేశించి పలుమార్లు పలికారు. 'బాగా తినండి, బాగా ఆడండి' అంటూ ఉత్తేజపరిచారు.

అంతర్జాతీయ సదస్సులో మాట్లాడటానికి స్వామి వివేకానందకు అవకాశం కలగలేదు. కాని ధైర్యాన్ని విడిచిపెట్టకుండా ప్రయత్నించాడు. చివరకు ఆయనకు కేవలం అయిదు నిమిషాలు మాత్రమే మాట్లాడటానికి అవకాశం ఇచ్చారు. ఆయన తన ఉపన్యాసం ప్రారంభించారు. ఐదు నిమిషాలు మాత్రమే అనుకున్నది.. నెలల తరబడి ఆయన ఉపన్యాసాలు కొనసాగాయి. వివేకానందుని ధైర్యమే ఆయనను ప్రపంచం గుర్తించేలా చేసింది. తాను ధైర్యవంతునిగా ఉంటూ, మనకు కూడా ధైర్యవంతులుగా ఉండమని బోధించాడు.

**మన ఇతిహాసాలైన రామాయణ–మహాభారతాలను పరిశీలిస్తే..**

రామాయణంలో సీత, మహాభారతంలో కుంతి, పాండవులు, ద్రౌపది, అభిమన్యుడు, ఉపపాండవులు.. ధైర్యానికి మారుపేరుగా కనిపిస్తారు.

కైకేయి కోరిన వరాల కారణంగా శ్రీరాముడు అరణ్యవాసానికి బయలుదేరతాడు. రాముని వెంట వస్తానంది సీతమ్మ. అడవిలో పులులు, సింహాలు వంటి క్రూరమృగాలు ఉంటాయని, రాక్షసులు సంచరిస్తుంటారని, కటిక నేలమీద పరుండవలసి వస్తుందని రాముడు పలికాడు. రాముని మాటలకు ఏ మాత్రం జంకలేదు సీతమ్మ. 'రాముని వెంటే సీత' అని పలికి, అరణ్యవాసానికి బయలుదేరింది. అడవిలో శూర్పణఖను చూసింది. ఏ మాత్రం బెదరలేదు. రామలక్ష్మణులు కుటీరంలో లేని సమయంలో రావణుడు వచ్చి సీతమ్మను అపహరించి, లంకలో అశోకవనంలో ఉంచాడు. సీతమ్మ చుట్టూ ఎంతోమంది రాక్షసులు. వారు నిరంతరం భయంకరమైన పలుకులు పలుకుతున్నప్పటికీ, సీతమ్మ ఏ మాత్రం ధైర్యం విడిచిపెట్టలేదు. ఏనాటికైనా రాముడు వచ్చి, తనను రక్షిస్తాడనే నమ్మకంతో ఉంది. ఒకనాడు రావణుడు సీత దగ్గరకు వచ్చి, 'నువ్వు నా మాట వినకపోతే, నిన్ను ఉదయపు ఫలహారంగా భుజిస్తాను' అని బెదిరించినా బెదరలేదు సీతమ్మ. ఆమె ధైర్యమే ఆమెను రక్షించింది. ఎట్టకేలకు శ్రీరాముడు వచ్చి, రావణుడిని సంహరించి, సీతమ్మను తీసుకెళ్లాడు. అంతమంది రాక్షసుల మధ్య ఒంటరిగా ఉన్న సీతమ్మకు.. ధైర్యమే ఆభరణం, ఆయుధం కూడా.

**మహాభారతంలో –**

కౌరవులతో జరిగిన కపట ద్యూతంలో పాండవులు ఓడిపోయారు. సర్వసంపదలు కోల్పోయారు. ద్రౌపదితో కలిసి పాండవులు అరణ్యాలకు బయలుదేరారు. కుంతీదేవి.. దాయాదులైన కౌరవుల ఇంట్లోనే ఉండవలసి వచ్చింది. ఏనాటికైనా పాండవులు తిరిగి వచ్చి, రాజ్యాభిషిక్తులవుతారనే ధైర్యంతో జీవించింది కుంతి. పాండవులతో అరణ్యవాసానికి వెళ్లిన ద్రౌపది కూడా ధైర్యాన్ని విడిచిపెట్టలేదు. అజ్ఞాతవాస సమయంలో విరాటుని కొలువులో సైరంధ్రిగా జీవించవలసి వచ్చినప్పుడు కూడా ధైర్యాన్ని విడిచిపెట్టలేదు. కీచకుడు చెరపట్టడానికి వచ్చినప్పుడు సైతం ధైర్యాన్ని వీడలేదు. ఎలాగైనా కీచకుడిని హతమార్చాలనుకుని పంతం పట్టింది. ఆ విషయాన్ని భీమునికి తెలియపరిచింది. కీచకుడిని సంహరించి, ద్రౌపది పంతాన్ని నెరవేర్చాడు భీముడు.

ధైర్యంతో జీవించేవారికి ఓటమి ఉండదని స్వామి వివేకానందుడు చెప్పిన మాటలు అనుసరణీయం, ఆచరణీయం.

- డా. పురాణపండ వైజయంతి

బాలజ్యోతి

# పరిష్కారం

ఒకరోజు కాలేజీకి వెళ్లకుండా ఇంటి ముందు అరుగు మీద విచారంగా కూర్చున్నాడు రామం. ఆ రోజు వాళ్లింట్లో వంట చెయ్యలేదు. చెయ్యడానికి అవసరమైన సరుకులు లేవు. రామం తండ్రిని పనిలో నుంచి తీసేశారు.

అప్పుడే పక్కింట్లో నివసించే సూర్యం వచ్చాడు. సూర్యం ఏడవ తరగతి చదువుతున్నాడు. వచ్చీరాగానే “నాకు లెక్కల హోంవర్క్ ఇచ్చారు. ఎలా చెయ్యాలో తెలియడం లేదు. కొంచెం చెపుతావా?” అని బతిమాలాడు.

ఆకలితో ఉన్న రామానికి ఒళ్ళు మండి పోయింది. “నాకు వేరే పనేం లేదా? వెళ్ళు, వెళ్ళు!” అని కసురుకున్నాడు.

బిక్కమొహం వేసుకుని సూర్యం వెళ్ళిపోయాడు. అలా వెళ్ళిన సూర్యం, కాసేపటికే వాళ్ళమ్మని వెంటబెట్టుకుని వచ్చాడు. “బాబూ రామం! కాస్త మా పిల్లాడికి లెక్కలు చెప్పు బాబూ! నీకు పుణ్యం ఉంటుంది” అని బతిమాలింది. మొహమాటం వల్ల రామానికి తప్పలేదు. ‘సరే’ అని సూర్యాన్ని కూర్చోమన్నాడు.

“ఇంతకీ ఏ లెక్కలు నీకు రావడం లేదు?” అనడిగాడు రామం.

“బీజ గణితం. ఆ లెక్కలంటేనే నాకు గుండె గాభరా” అన్నాడు సూర్యం భయంగా.

“అదేం లేదులే! శ్రద్ధగా లెక్కలు చేస్తే, సులభమే” అంటూ ధైర్యం చెప్పాడు రామం. లెక్కలు నేర్పించడం మొదలు పెట్టిన కాసేపటికే తన ఆకలి బాధను మరిచి పోయాడు రామం.



సూర్యం లెక్కలు నేర్చుకుని సంతోషంగా ఇంటికి వెళ్ళిపోయాడు. కొంతసేపటికి సూర్యం ఒక పెద్ద గిన్నెతో వచ్చాడు. రామం తల్లి “ఏంటి?” అని అడిగింది.

“ఇంట్లో ఇవాళ మా అమ్మ పులిహోర చేసింది. రామం నాకు లెక్కలు బాగా చెప్పావు. అందుకే ఈ పులిహోరను మీకిచ్చి రమ్మని, అమ్మ నన్ను పంపింది” అన్నాడు సూర్యం. ఆ పూటకి రామం కుటుంబసభ్యులు పులిహోరతో ఆకలిని తీర్చుకున్నారు.

అప్పుడే రామానికి ఒక ఆలోచన తట్టింది. పరిస్థితులను తిట్టుకుంటూ కూర్చోవడం తెలివితక్కువగా అనిపించింది. ఆ రోజే ఇంటి చుట్టుపక్కల పిల్లలకి ట్యూషన్ చెబుతాననీ, ఏదో కొంత ఫీజుగా ఇస్తే చాలుననీ వినయంగా చెప్పాడు.

సూర్యం వాళ్ళమ్మ వెంటనే మొదలు పెట్టమనీ, సూర్యాన్ని పంపుతాననీ చెప్పేసింది. రామానికి మంచి పేరు ఉండటంతో మరో నాలుగిళ్లవాళ్ళు కూడా పిల్లల్ని ట్యూషన్‌కు పంపడానికి ఒప్పుకొన్నారు. ఆ డబ్బులతో రామం గడ్డుకాలంలో ఉన్న తన కుటుంబాన్ని కొంతవరకు ఆదుకోగలిగాడు. కొంతకాలానికి రామం తండ్రికి మరో ఉద్యోగం దొరకడంతో సమస్యలు తీరిపోయాయి.

కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోకుండా ఆత్మ విశ్వాసంతో ప్రయత్నిస్తే సమస్యకు పరిష్కారం తప్పక దొరుకుతుందని రామం గ్రహించాడు.

- లంకా సుజాత

## పదాల పజిల్

కీటకాల పేర్లు పజిల్‌లో ఎక్కడున్నాయో వెతకండి.



Cute Insects

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| D | O | N | K | O | Y | P | D | I | P | S | A |
| R | B | R | T | E | R | M | I | T | E | I | N |
| A | O | L | C | S | A | T | G | K | M | A | T |
| G | R | A | S | S | H | O | P | P | E | R | D |
| O | B | D | A | G | E | S | N | L | R | N | C |
| N | P | Y | L | A | R | B | E | A | T | P | E |
| F | O | B | U | T | T | E | R | F | L | Y | I |
| L | N | I | U | O | M | E | O | L | E | R | M |
| Y | G | R | S | G | W | H | A | Y | A | K | O |
| F | U | D | L | R | U | B | E | A | G | E | T |
| K | I | L | C | O | C | K | R | O | A | C | H |
| R | N | P | N | G | Y | M | T | N | E | K | W |

## దారి చూపండి



## చుక్కలు కలపండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# వ్యాపారస్తుడు



రంగాపురం అనే గ్రామంలో రామంజి అనే వ్యాపారస్తుదు ఉండేవాడు. ఊరూరా తిరిగి సరుకులు అమ్మి సాయంత్రానికి ఇల్లు చేరుకునేవాడు. చాలా పిసినారి, పైగా అతితెలివిగలవాడు. సొంత గ్రామంలో ఇతని దగ్గర ప్రజలు నిత్యావసర వస్తువులు కొనేవారు కాదు.

వ్యాపార నిమిత్తం పక్క గ్రామానికి వెళ్లిన రామంజి మధ్యాహ్నం వేళ వచ్చేదారిలో సరుకు సంచి దించి చెట్టు కింద సేదతీరాడు. బాగా ఎండ కాస్తోంది అదే సమయంలో అటుగా వెళుతున్న కిష్టయ్య అనే వ్యక్తి వ్యాపారస్తుణ్ని చూసి "వ్యాపారం బాగా సాగుతోందా ?" అని అడిగాడు. "బాగానే సాగుతోంది" చాలా చురుగ్గా సమాధానం ఇచ్చాడు రామంజి. "నాణ్యమైన సరుకే అమ్ముతున్నావా?" అనడిగాడు కిష్టయ్య. ఈ మాటకు గట్టిగా నవ్వేశాడు రామంజి.

"దేనికి నవ్వుతున్నారు ?" అని ప్రశ్నించాడు కిష్టయ్య. "నాణ్యత ఎక్కడ వుందని చెప్తున్నావు తినే తిండి దగ్గర నుంచి కట్టే బట్ట వరకూ నాణ్యత లేదు" అని నవ్వుతూ సమాధానం ఇచ్చాడు రామంజి. "పొరబడుతున్నావు నాణ్యత లోపానికి కారణం మనమే. ఎక్కువ లాభం గడించాలనే పేరాశతో మంచి సరుకును కూడా కల్తీ చేసి అమ్ముతున్నాం, నువ్వు కూడా ఈ పని చేసేదాంట్లో మొదట ఉన్నావని తెలిసింది" అన్నాడు కిష్టయ్య. మళ్లీ గట్టిగా నవ్వేశాడు రామంజి. "నా సరుకు మొత్తంగా అమ్ముడుపోతోంది వచ్చిన పని చూసుకుని వెళ్లండి" అని కటువుగా సమాధానం ఇచ్చాడు రామంజి. కిష్టయ్య అక్కడి నుంచి లేచి వెళ్లిపోయాడు.

కొన్నాళ్లు జరిగిపోయింది రామంజికి సరుకు రావడం తగ్గిపోయింది. ఆరోగ్యం కుంటుపడింది. కుటుంబానికి సరిపడా వస్తువులు కూడా రావడం లేదు. దినుసుల కోసం పక్క ఊరిలో ఉన్న తన మిత్రుడు రామయ్య దగ్గరకు వెళ్లాడు రామంజి. వెళ్లి అడగ్గానే "మీరిచ్చిన దినుసులు అమ్ముడుపోలేదు. మీ కోసమే మిగిలినట్టున్నాయి తీసుకోండి" అని దినుసులు మూట చేతిలో పెట్టాడు రామయ్య. పైకం ఇవ్వబోతే "అప్పే వద్దులెండి నేనే మీకు బాకీ పడతాను తీసుకెళ్లండి" అన్నాడు రామయ్య. దినుసుల మూట తీసుకుని ఊరికి బయలుదేరాడు రామంజి.

మరుసటిరోజు రామయ్యకు రంగాపురం నుంచి కబురొచ్చింది రామంజికి తన భార్య బిడ్డలకు ఆరోగ్యం కుంటుపడిందని చాలా నీరసంతో మంచాన పడ్డారని తెలిసింది. పరుగుతో అక్కడికి వెళ్లాడు రామయ్య. కళ్లలో నీళ్లు పెట్టుకున్నాడు రామంజి "చూశావా రామంజి.. మనం అమ్మిన కల్తీ సరుకు అంతా చుట్టుకుని తిరిగి మన దగ్గరకే వచ్చింది. మనం చేసిన పాపం పని మనకే చుట్టుకుంది. నీ వ్యాపారం కోసం నీ రాబడి కోసం ఇంకొకరిని మోసం చేయాలని చూశావు. నీ స్వార్థం నీకే బుద్ధి చెప్పింది. కల్తీ సరుకు అమ్మడమంటే మనల్ని మనం మోసం చేసుకున్నట్లే.. ఒకరికి చెడు చేయాలనే ఆలోచన మనలో ఉన్నంతవరకు మనకు మంచి జరగదు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని నిజాయితీగా జీవించు" అని హితవు చెప్పి రామంజి కుటుంబాన్ని వైద్యుని దగ్గరకు తీసుకెళ్లాడు రామంజి. అప్పటినుంచి నీతిగా బతకడం నేర్చుకున్నాడు రామంజి.

- నరెద్దుల రాజారెడ్డి

# నిజాయతీ

• ఎన్.వి.శ్రీధర శర్మ



పిల్లల కథ

కోసల రాజ్యంలోని ముకుందపురం గ్రామంలో కేశవుడు అనే వ్యక్తి ఉండేవాడు. అతడు చిన్న చిన్న కూలి పనులు చేసుకుంటూ బతికేవాడు. పగలంతా కూలి పనులు చేసుకుంటూ రాత్రి ఊరి గుడి దగ్గర అరుగు మీద పడుకునేవాడు. చిన్ననాటి నుంచి గుడి పూజారి దగ్గర ధర్మబద్ధంగా జీవితం ఎలా గడపాలో నేర్చుకున్నాడు. తను ఒక చోట కూలీ పనికి ఒప్పుకుంటే మరొకరు వచ్చి ఎక్కువ కూలీ ఇస్తామన్నా ససేమిరా ఒప్పుకునే వాడు కాదు. ఊరి వాళ్ళు, తోటి కూలీలు ఇతని నిజాయతీని చూసి నవ్వుకునే వాళ్ళు. కేశవుడు మాత్రం ధర్మం, నిజాయతీ ఎప్పటికైనా గెలుస్తాయని నమ్మేవాడు.

ఒకరోజు కోసల రాజు విక్రమసేనుని ఉద్యానవనంలో తోటపని చేయడానికి ముకుందపురం నుంచి కూలీలతో పాటు కేశవుడు కూడా వెళ్ళాడు.

కేశవుడు తోటలో పని చేస్తున్నప్పుడు ఒక రంగురాయి దొరకటంతో దాని గురించి ఎవరికీ చెప్పకుండా బొడ్లో జాగ్రత్తగా దాచుకున్నాడు. సాయంత్రం వరకు తోటలో పనిచేసి, కూలి డబ్బులు తీసుకున్నాడు. ఇంటికి బయలుదేరుతూ, మెల్లగా రాజప్రాసాదంవైపు అడుగులు వేశాడు. సింహద్వారం వద్ద భటులతో తను రాజుగారిని కలవాలి అని చెప్పాడు. విషయం ఏమిటని భటులు ప్రశ్నిస్తే విషయం కేవలం రాజుగారికి మాత్రమే చెబుతాను అనటంతో ఒక భటుడు అంతఃపురంలోకి వెళ్ళి వచ్చి, ''రేపు ఉదయం వరకు రాజుగారిని కలవటం కుదరదు, పొద్దున్నే రాపో'' అని చెప్పారు.

కేశవుడు చేసేది లేక ఊరికి వెళ్లకుండా, సింహద్వారం పక్కగా ఒక చోట ఒదిగి కూర్చొని రాత్రంతా అక్కడే గడిపాడు. అలసిపోయి అక్కడే పడుకున్న కేశవుడిని ఉదయాన్నే ఒక భటుడు నిద్రలేపి, ''రాజుగారు పిలుస్తున్నారు'' అని చెప్పటంతో భయం భయంగా కోటలోకి అడుగు పెట్టాడు.

కోసల రాజు విక్రమసేనుడు కేశవుడిని చూసి ''నన్ను ఎందుకు కలవాలనుకున్నావు?'' అని అడిగాడు.

కేశవుడు రాజుగారికి నమస్కరించి, ''మహారాజా! నిన్న తమరి తోటలో పనిచేస్తుంటే, నాకు ఈ రంగురాయి దొరికింది. తమరి వస్తువు తమరికే అప్పగించి పోదామని వచ్చాను'' అని చెప్పి, తన బొడ్లో జాగ్రత్తగా దాచుకున్న రంగురాయిని విక్రమసేనుడికి అప్పగించాడు.

రంగురాయిని తీసుకున్న విక్రమసేనుడు ''దీని విలువ ఎంతో నీకు తెలుసునా?'' అని అడిగాడు.

''నాది కాని వస్తువు విలువ ఎంత అయితే నాకెందుకు మహారాజా!'' అన్నాడు కేశవుడు వినయంగా.

ఇంతలో అక్కడకు వచ్చిన మహామంత్రి సూరవర్మ ''ప్రభూ! మన ఖజానాలో పని చేయటానికి నిజాయతీ గల వ్యక్తి కావాలన్నారు కదా, అందుకు ఇతనే సరైన వ్యక్తి. నిజాయతీ గల వ్యక్తి కోసం వెదుకులాటలో భాగంగా తమరి తోటలో చాలా రంగు రాళ్లని నేనే కావాలని భూమిలో పాతించి, కూలీలను అందులో పనికి పురమాయించి, దూరం నుంచి గమనిస్తూనే వున్నాను. ఇతనితో పాటు మరికొందరికి ఈ రంగురాళ్ళు దొరికాయి. ఇవి విలువ చేయని రంగురాళ్ళు అని తెలియక మిగతా అందరూ లోలోపల సంతోషపడుతూ వాటిని తీసుకుని వెళ్లిపోయారు. కాని, ఇతను మాత్రం ఆశకు లోను కాకుండా నిజాయతీగా ఈ రంగురాయిని తమకు అప్పగించడానికి వచ్చాడు. నిన్న రాత్రి కూడా నేను కావాలనే ఇతనికి తమ దర్శన భాగ్యం కలిగించలేదు. ఆ రంగురాయి ఒక రాత్రంతా ఇతని దగ్గర వుంటే ఇతని మనసు ఏమైనా చాంచల్యానికి లోనవుతుందేమో అనుకున్నాను. అయినా, ఇతను తన నిజాయతీని కోల్పోలేదు'' అని చెప్పాడు.

''మహామంత్రీ! మీరు చెప్పింది నిజమే, తక్షణమే ఇతనిని మన ఖజానా ఉద్యోగిగా నియమించండి. వెంటనే ఇతని నివాసానికి రాజోద్యోగుల భవంతిని ఒకటి సిద్ధం చేయండి'' అని చెప్పి విక్రమసేన మహారాజు లోనికి వెళ్లిపోయాడు.

• • •

ముకుందపురం చేరుకున్న కేశవుడు గుడి పూజారిని కలుసుకొని, తనకు వచ్చిన కొలువు గురించి చెప్పి, పాదాలకు నమస్కరించాడు.

''నీ నిజాయతీనే నిన్ను కాపాడింది. లే నాయనా!'' అని కేశవుడిని లేవదీసి, ఆలింగనం చేసుకున్నాడు పూజారి.

## హితవచనం

**అపూజ్యా యత్ర పూజ్యన్తే పూజ్యానాం తు విమాననా**
**త్రీణి తత్ర ప్రవర్తన్తే దుర్భిక్షం మరణం భయమ్**

**అనర్హులను గౌరవించే చోట, గౌరవించతగిన వాళ్లను అవమానించే చోట దుర్భిక్షం, అకాల మరణం, ఉపద్రవం తప్పవు.**

## అలాగా!



బ్రిటిష్ రచయిత సర్ ఆర్థర్ కానన్ డాయల్ రచయితగా, 'షెర్లాక్ హోమ్స్' పాత్ర సృష్టికర్తగా సుప్రసిద్ధుడు. వృత్తిపరంగా వైద్యుడైన ఆయన విరివిగా రచనలు చేశాడన్న సంగతి చాలామందికి తెలిసినదే! అయితే, ఆయన ఫుట్‌బాల్ క్రీడాకారుడు కూడా! పోర్ట్స్‌మౌత్ అసోసియేషన్ ఫుట్‌బాల్ క్లబ్ తరఫున పలు మ్యాచ్‌లలో గోల్‌కీపర్‌గా ఆడేవాడు.

# అల్లరి

ALLARI



## జతచేయండి



పై బొమ్మలను వాటి సరైన నీడలతో జతచేయండి

## దారి చూపండి



పైన ఉన్న లక్కీకి తన కారు దగ్గరికి వెళ్లే దారి చూపండి.

## చెప్పుకోండి

A box of biscuits, a box of mixed biscuits, and a biscuit mixer



# తాత చేసిన సాయం

**నరసింహపురంలో** రామయ్య తాత ఉండేవాడు. అతను ఇతరులకు సాయం చేస్తూ పరోపకారి అని పేరు తెచ్చుకున్నాడు. ఒకసారి రామయ్య తాత దారిలో వెళ్తుండగా కొందరు పిల్లలు కనబడి.. 'రామయ్య తాతా! మాకు కొన్ని పండ్లు ఇప్పించవా! ఆ తోట యజమాని శరభయ్య మేము ఎంత అడిగినా ఇవ్వడం లేదు. పైగా మమ్మల్ని దూషిస్తున్నాడు కూడా! మేము డబ్బులు ఇస్తే అవి తీసుకొని.. ఇవ్వలేదని అబద్ధాలు ఆడుతున్నాడు. మాకు ఏం చేయాలో అర్థం కావడం లేదు' అని చెప్పారు. అది విన్న రామయ్య.. 'పిల్లలూ! నేను అడిగితే ఆ శరభయ్య ఇవ్వనే ఇవ్వడు! మీరే వెళ్లి ఆయనను ప్రాధేయపడండి' అని అన్నాడు. దానికి వాళ్లు.. 'అయ్యో! మేము ఎంత ప్రాధేయపడినా ఆ శరభయ్య పండ్లను ఇవ్వడం లేదు. అందుకే మీకు చెప్పాం. ఎంతో మందికి ఉపకారం చేసే మీరు.. మాకు ఆ పండ్లను ఎలాగైనా ఇప్పించి సాయపడండి' అని వేడుకున్నారు. అప్పుడు రామయ్య దూరంగా ఉన్న శరభయ్య వద్దకు వెళ్లి.. ' ఏయ్ శరభయ్యా! ఈ పిల్లలకు నువ్వు ఒక్కపండు కూడా ఇవ్వవద్దు. ఇది నా ఆజ్ఞ. నా ఆజ్ఞను పాటించకుంటే నేను ఊరుకోను. నా సంగతి తెలుసుగా!' అని బెదిరించినట్లుగా అన్నాడు. అది విన్న శరభయ్య రెచ్చిపోయి కోపంతో.. 'నువ్వు నన్ను ఆజ్ఞాపించడం ఏమిటి! నేను వారికి తప్పకుండా పండ్లను ఇస్తాను' అంటూ వెంటనే ఆ పిల్లలకు కొన్ని పండ్లను తెచ్చి ఇచ్చాడు. తర్వాత ఆ శరభయ్య అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అప్పుడు పిల్లలు.. 'ఇదేంటి రామయ్య తాతా! నువ్వు ఆ పండ్లను ఇప్పించమంటే మాట సాయం చేయకపోగా.. ఆయనతోని మా ముందే ఇవ్వవద్దని చెప్పావు. ఇది నీకు న్యాయమేనా!' అని అడిగారు. అప్పుడు రామయ్య.. 'అదేం లేదు! ఈ శరభయ్య ఎప్పుడూ అందరితో వ్యతిరేకంగా ప్రవర్తిస్తాడు. నేను పండ్లను ఇమ్మంటే ఇవ్వడు. ఇవ్వవద్దు అంటే ఇస్తాడు. అందుకే నేను అలా మాట్లాడాను. ఏమైతేనేం మీకు న్యాయంగా రావాల్సిన పండ్లు లభించాయి' అని అన్నాడు. రామయ్య తాత తెలివికి, సాయానికి పిల్లలు ఎంతో సంతోషించారు.

...✍ సంగనభట్ల చిన్న రామకిష్టయ్య



## పెద్దల మాట

అసాధ్యమైన కార్యాన్ని కూడా ఓర్పుతో సుసాధ్యం చేయవచ్చు

**- స్వామి వివేకానంద.**



## చెప్పుకోండి

- కొండ మీద బండరాయి. రాయి మీద లోతు బావి. బావిలోపల ఊరే జల.. ఆడే పాము?

  **- తల, నోరు, ఉమ్మి, నాలుక**

- చెయ్యని కుండ. పొయ్యని నీళ్లు. వెయ్యని సున్నం. తియ్యగ ఉండు?

  **- కొబ్బరికాయ**

- మూడు కండ్ల ముసలిదాన్ని. నేనెవరిని?

  **- తాటి ముంజ**

## పూరించండి




**బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.**

## పద్యం - భావం

**తనువులోని యాత్మ తత్వ మెఱుంగక**
**వేరె కలడటంచు వెదుక డెపుడు**
**భానుడుండ దివ్వె పట్టుక వెదుకునా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**తాత్పర్యం:** 'దేహో దేవాలయః ప్రోక్తో జీవో దేవస్సనాతనః' అన్నారు ఆర్యులు. దేహంలోనే దేవుడు ఉన్నాడని గ్రహించిన విద్వాంసులు.. తమలోనే ఆత్మస్వరూపాన్ని చూస్తారేగానీ వేరొక చోట వెతకరు. కోటి ప్రభలలో సూర్యుడు ప్రకాశిస్తుండగా.. గుడ్డిదీపంతో వస్తువులను అన్వేషించడం అజ్ఞానం కదా!

# నెమలీక



- టి. కళ్యాణ్ రామ్
10 వ తరగతి, గురుకుల పాఠశాల
దేవరకద్ర, మహబూబ్ నగర్

## జాతి కన్నా స్నేహం గొప్ప



ఒక అడవిలో ఏనుగుల గుంపు, తోడేళ్ల గుంపు ఉండేది. ఏనుగుల గుంపులో ఒక ఏనుగు పిల్ల పేరు మహి, తోడేళ్ల గుంపులో ఒక తోడేలు పిల్ల పేరు హిమ. అవి రోజూ ఆ అడవిలో ఉన్న చెరువు దగ్గరికి నీళ్ళు తాగడానికి వెళ్ళేవి. ఏనుగులంటే తోడేళ్లకు కోపం, తోడేళ్లంటే ఏనుగులకు కూడా పడదు. ఏనుగులు కనబడినప్పుడల్లా తోడేళ్లు వాటిని కరవడానికి ప్రయత్నం చేసేవి, ఏనుగులు తోడేళ్లను తొండంతో విసిరేయ్యడానికి చూసేవి. కానీ వేటికవి తప్పించుకునేవి. అలా ఒకరంటే ఒకరు నచ్చకుండా ఉండేవి. కానీ చిన్నపిల్లలైన మహి, హిమ మాత్రం ఎప్పుడైనా కలిసినప్పుడు ఆడుకుంటూ ఉండేవి. అలా కలవొద్దని వాటితో స్నేహం చెయ్యొద్దని ఏనుగులు మహికి, తోడేళ్లు హిమకు చెప్పేవి. కానీ వాటికి పెద్దవాళ్ళు చెప్పిన మాటలు నచ్చేవి కాదు.

ఒకసారి మహి తప్పిపోయి ఇంటికి వెళ్లలేక హిమ దగ్గరే ఉండిపోతుంది. అది చూసిన హిమ తల్లిదండ్రులు మహిని చంపడానికి చూస్తాయి. అది గమనించిన మహి, హిమను ఏమీ చెయ్యకండి మేమిద్దరం స్నేహితులం. మహిని ఏమైనా చేస్తే నేను ఉండలేను అంటుంది. చేసేదేం లేక ఇష్టం లేకపోయినా ఎవరూ ఏమీ అనరు. అప్పటినుండి హిమ, మహి హాయిగా ఆడుకుంటూ ఉండేవి. అలా పెరిగి పెద్దవుతాయి.

అనుకోకుండా ఒకనాడు ఒక పులి తోడేళ్లమీదికి దాడికి వస్తుంది. తోడేళ్లు తప్పించుకుంటాయి. కానీ పులి దాడికి గాయపడిన హిమ అక్కడే పడిపోతుంది. దాన్ని కాపాడటానికి భయపడి ఎవరూ ముందుకు వెళ్ళరు. కానీ మహి భయంకరమైన శబ్దాన్ని చేస్తూ తన దంతంతో పులిని పొడవటానికి ముందుకెళ్తుంది. అది ఊహించని పులి ఒక్కసారిగా భయపడి పారిపోతుంది. తోడేళ్ళన్నీ ఊపిరి పీల్చుకుంటాయి. ఇంతలో మహి చేసిన అరుపు విని తమ జాతి అయిన ఏనుగు మహికి ఏమయ్యిందో అని ఏనుగుల గుంపు కూడా అక్కడికి చేరుకుంటుంది. పులిని భయపెట్టిన మహిని చూసి ఆశ్చర్యపోతాయి. తోడేళ్లు కూడా హిమను కాపాడిన మహిని మెచ్చుకుంటాయి. ఇన్నిరోజులు మహిని దూరం పెట్టి బాధ పెట్టినందుకు సిగ్గుపడతాయి. మహి, హిమ స్నేహంతో ఉండటం వల్ల ఒకరికొకరు ఎలా సాయం చేసుకోవొచ్చు అని అక్కడున్న తోడేళ్లు, ఏనుగులు అన్నీ తెలుసుకుంటాయి. అప్పటినుండి జంతువులు అన్నీ కలిసిమెలిసి ఉంటాయి.

---




### దారి దొరికిందా

ఈ మిక్కీ మౌజ్ కిందున్న మొక్కజొన్న కంకి దగ్గరికి వెళ్లడానికి దారి చెప్పండి.



### కనిపెట్టారా?

ఇక్కడ అన్నీ ఒకటే రకం పండ్లు వున్నాయి కానీ మధ్యలో రెండు వేరే పండ్లు కూడా వున్నాయి. అవి ఏవి?

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# స్వేచ్ఛ

జి.పి. రామ్ చంద్
98495 31202

కోసల రాజుకు పశుపక్ష్యాదులు అంటే చాలా ఇష్టం. రాజు ఉద్యానవనంలో విహరిస్తుండగా ఒక అరుదైన పక్షి ఆ తోటలో చిత్ర విచిత్ర స్వరాలతో సుస్వరాలు పలుకుతూ చెట్లపై నుంచి ఎగురుతూ కనిపించింది. దాన్ని చూసి ముచ్చటపడ్డ రాజు వెంటనే దాన్ని బంధించి, తన మందిరంలో అలంకారప్రాయంగా పంజరంలో పెట్టాడు. దానికి ప్రపంచంలో దొరికే రకరకాల పండ్లను పెట్టేవాడు. అది అంత ఆనందంగా ఆ పళ్ళని తినేది కాదు. కొన్ని రోజులు గడిచాయి.

ఒకరోజు రాజు సేద గృహంలో సేద తీరుతుండగా సేనాధిపతి పరుగు పరుగున వచ్చి "రాజా! మన రాజ్యంపై అంగరాజు దండెత్తి వస్తున్నాడు" అని చెప్పాడు. రాజుకు చాలా కోపం వచ్చింది.

"ఆ అంగరాజుకు మన పైనే దండెత్తి వచ్చేంత బలం ఎక్కడి నుంచి వచ్చింది?" అని ప్రశ్నించాడు.

"రాజా! అతనికి మన శత్రురాజు సహాయం చేస్తున్నాడు. ఆ బలం చూసుకునే మనపై దండెత్తి వచ్చే ప్రయత్నం చేస్తున్నాడు" అన్నాడు. కోసల రాజు తీవ్ర స్వరంతో "ఆ రాజుకు తగిన బుద్ధి చెబుదాం.... వెంటనే యుద్ధాన్ని ప్రకటించండి" అన్నాడు.

సేనాధిపతి యుద్ధ సన్నాహాలు ప్రారంభించాడు. యుద్ధ ఢంకా మోగించారు. శంఖం పూరించారు. భీకరంగా రెండు రాజ్యాల సైన్యం పది రోజులపాటు యుద్ధాన్ని కొనసాగించాయి. ఆ యుద్ధంలో కోసలరాజు ఓడిపోయాడు. అతన్ని బంధించి అంగరాజు ముందు ప్రవేశపెట్టారు. అతడు అతన్ని చెరసాలలో బంధించమన్నాడు. అయితే అతనికి ఒక రాజుకు పెట్టగలిగే స్థాయిలోనే భోజనాన్ని అందించమన్నాడు. రాజును చెరసాలలో బంధించి ప్రతిరోజూ, అతనికి ఇష్టమైన ఆహారాన్ని అందించసాగారు. అలా

కొన్నిరోజులు గడిచిన తర్వాత ఒకరోజు ఉదయం తన చెరసాల పైన ఉన్న గవాక్షం గుండా పక్షుల కిలకిల రావాలు వినిపించాయి. అప్పుడు రాజుకు హఠాత్తుగా తన మందిరంలో ఉన్న ఆ పక్షి గుర్తుకు వచ్చింది. తాను రకరకాల పండ్లను దానికి అందించినా అది ఎందుకు అయిష్టంగా ఉండేదో తనకు ఇప్పుడు అర్థమవుతూ ఉంది.

బాల కథ

కారణం 'సుఖం కంటే స్వేచ్ఛ చాలా గొప్పది' అని అనుకున్నాడు. బహుశా అందువల్లనే ఆ పక్షికి తాను ఎన్ని రకాల పండ్లు పెట్టినా దానికి రుచించేది కాదనిపించింది. రాజుకు పశ్చాత్తాపం మొదలైంది. ఎలాగైనా ఆ పక్షిని వదిలేయాలి అనుకున్నాడు. అయితే 'తానేమో చెరసాలలో ఉన్నాడు ఎలా' అని ఆలోచించాడు. ఆ పక్షి బాగోగులు చూసుకునే ఒకప్పటి భటుడు ఇప్పుడు ఈ చెరసాలలో ఉండటం గమనించాడు. తనకు అనుకూలమైన ఆ భటునికి రహస్యంగా తన మందిరంలో ఉన్న పక్షికి విముక్తి కలిగించమన్నాడు. ఆ భటుడు రాజమందిరంలోకి ప్రవేశిస్తుండగా అక్కడ ఉన్న భటులు అతన్ని బంధించారు. అంగరాజు ముందు ప్రవేశపెట్టారు.

ఆ భటున్ని అడిగాడు "నువ్వెందుకు రాజు మందిరంలోకి ప్రవేశించావు . అక్కడ దొంగతనం చేయడానికా"! అన్నాడు.

అందుకు ఆ భటుడు సమాధానం ఇస్తూ "మహారాజా! నేను దొంగతనానికి వెళ్ళలేదు. కోసలరాజు గారి ఆదేశానుసారం వారి మందిరంలో ఉన్న పంజరంలోని పక్షిని విడిపించడానికి వెళ్లాను" అన్నాడు.

అంగరాజు కాసేపు ఆలోచించి కోసలరాజు ఉన్న చెరసాల వైపు నడిచాడు. అక్కడ రాజు పంజరంలో పక్షిలా ముడుచుకుపోయి ఉన్నాడు. అంగరాజును చూసి కోసల రాజు ఇలా అన్నాడు, 'రాజా! రాజభోగాల మధ్య ఉన్నా స్వేచ్ఛ లేకపోతే ఈ జీవితం శూన్యమని నాకు అర్థమైంది. నా అహంకారంతో ఒక అమాయక పక్షిని పంజరంలో బంధించాను. నన్ను శిక్షించు, కానీ ఆ పక్షికి విముక్తి ప్రసాదించు' అని వేడుకున్నాడు. శత్రు రాజులోని ఆ పరివర్తన, స్వేచ్ఛ పట్ల అతనికి కలిగిన గౌరవం చూసి అంగరాజు చలించిపోయాడు. వెంటనే సంకెళ్లు విప్పించి, 'స్వేచ్ఛ విలువ తెలిసిన వాడే నిజమైన పాలకుడు. మనం ఎన్ని సంపదలు ఉన్నా స్వేచ్ఛ లేకపోతే అది ఎంత దుర్భరంగా ఉంటుందో అర్థమైంది. స్వేచ్ఛకు మించిన ఆనందం ఏ సుఖములోనూ లేదని తెలుసుకున్నాను. మిమ్మల్ని బంధించే అర్హత నాకు లేదు' అంటూ సగర్వంగా విడిచిపెట్టాడు."

---

చిరుమువ్వలు

# నో బ్యాగ్ డే.. సంతోషాల హేల

**హాయ్ ఫ్రెండ్స్**

ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి 'శనివారం.. నో బ్యాగ్ డే'గా పాటిస్తుండటం మా కెంతో ఆనందంగా ఉంది. ఆరోజున మేము బడులకు బ్యాగులు తీసుకురావాల్సిన అవసరం లేదు. ఆ రోజు ప్రతిరోజూ నిర్వహించే తరగతులకు బదులుగా ఇతరత్రా పోటీలు నిర్వహిస్తుండటంతో మేమంతా ఆసక్తిగా పాల్గొంటున్నాం. కొత్తదనం ఉండేలా క్విజ్‌లు, సమకాలీన అంశాలపై డిబేట్లు, సదస్సులు, వృత్తి విద్య అంశాలపై అవగాహన, క్రీడలు, రాజ్యాంగంపై మౌఖిక ప్రశ్నల పోటీలు లాంటివి నిర్వహిస్తుండటం చాలా బాగుంది. రోజంతా చేతిపనులు, ఆటలు, చిత్రలేఖనం లేదా జట్టు వ్యాయామాలు వంటి కార్యకలాపాలకు కేటాయించటం కూడా మరో కొత్త అనుభూతి. మాలో కొందరు మట్టితో బొమ్మలు లేదా విత్తనపు ఉండలు తయారుచేస్తుండగా, ఇంకొందరం కాగితాన్ని కత్తిరించి బొమ్మలు, పడవలు, కాగితపు పూలగుత్తులు తయారుచేస్తున్నాం. మా జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు గారు 'నో బ్యాగ్ డే' సందర్భంగా కలర్ పేపర్ తో కుందేలు ఫింగర్ పప్పెట్లను మా అందరి చేత తయారు చేయించారు. వీటిని ఉపయోగించి మేము కథలను కూడా చెప్పడం జరిగింది.



**కొంజెర్ల అక్షర, 6వ తరగతి, చెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , గొల్లప్రోలు మండలం, కాకినాడ జిల్లా.**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



మానవ మాత్రునికి భగవంతుని గురించి పూర్తిగా వర్ణించటం సాధ్యపడితే నానిర్ణయం ప్రకారం భగవంతుడు అనగా సత్యం. కాని తర్వాత మరో అడుగు ముందుకు వేసి సత్యమే భగవంతుడు అని చెప్పగలను. ☛ గాంధీజీ








కథ

# శివన్న కోరిక

వానలు లేక చెరువు, బావులు ఎండిపోవడంతో కూలీ పనికోసం కిష్టడు పట్టణానికి వెళ్లాలనుకొన్నాడు. వెళ్తున్నప్పుడు భార్య, కొడుకును తీసుకొని పట్టణానికి వెళ్లాడు. పట్టణం బయటవున్న ఖాళీ స్థలంలో అక్కడి వారి అనుమతితో ఒక గుడిసె వేసుకొన్నాడు. కొడుకు శివన్నను దగ్గరలోనున్న ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతిలో చేర్పించాడు.

గ్రామం నుండి వస్తున్నప్పుడు శివన్న చదువుతున్న బడి నుంచి టీసీ తీసుకొనిరావడం వలన బడిలో సులభంగా చేర్పించగలిగాడు.

కిష్టడికి ప్రతిరోజూ ఏదో ఒక పని దొరకడం వలన బతుకు సాఫీగా జరుగసాగింది.

అన్నిరోజులూ ఒకేలా వుండవుగా... ఒకరోజు వచ్చిన వర్షం వలన గుడిసెలన్నీ కొట్టుకొని పోయి నీటితో నిండిపోయింది. కొన్ని గంటల తరువాత నీరంతా తగ్గ ప్రాంతానికి వెళ్లగానే బురదతో నున్న తమ తమ ఖాళీ స్థలములలో బాధగా చూస్తూ నిలబడ్డారు.

ప్రభుత్వం వారు మూడురోజులు ఆహార పొట్లాలు ఇచ్చారు. మరలా ఇలాంటి ప్రమాదం జరగకుండా ఇండ్లు కట్టే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

సేవాసంస్థ వారు గుడిసె బదులు టెంటు వేయడానికి కావలసినవి పంచారు. వాటితో పాటు దుప్పట్లు, పాత్రలు, వంట సామాగ్రి పంచడంతో అందరూ తమ కష్టాలనుంచి బయటపడ్డామన్న తృప్తి కలిగింది. మొత్తం మీద అక్కడ గుడిసెల స్థానంలో టెంట్లు వచ్చాయి. పదిహేను రోజులు గడిచింది.

వర్షం వచ్చినరోజు నుండి శివన్నలో బాధాకరమైన ముఖం తప్ప నవ్వు కనబడలేదని తల్లితండ్రులు గమనించారు. కుటుంబ ఖర్చుల కోసం కూలీపని కోసం భార్యను పిలుచుకొని వెళ్లాడు కిష్టడు.

సాయంత్రం టెంటు దగ్గరకు రాగానే ఉత్సాహంతో, సంతోషంతో తల్లితండ్రుల దగ్గరకు వచ్చి 'అమ్మా, నాయనా రేపటి నుంచి నేను బడికి పోతాను.' అంటూ ఎగురుతూ చెప్పాడు.

'శివన్నా, ఇన్నిరోజులు నీ ముఖాన నవ్వు ఎందుకు కనబడలేదో ఇప్పుడు తెలుసుకొన్నాము. బడికి పోవాలంటే పుస్తకాలు, సంచి కావాలి. రెండురోజుల్లో మేమే కొనాలనుకొన్నాము.' అన్నాడు కిష్టడు.

'వద్దు నాన్నా, ఇంతకుముందు ఆ సేవాసంస్థ వారు నాకు కావలసిన పుస్తకములు, పెన్ను, పుస్తకాల సంచి ఇచ్చారు ' అంటూ చెప్పాడు.

మరుసటి రోజు శివన్న బడికి వెళ్లాడు.



మూడవ పీరియడ్ నందు జయరాం మాస్టారు వచ్చారు.

ఆ రోజు చెప్పవలసిన పాఠం ముగిసాక ఇంకా సమయం ఉండటంతో 'మీరు చదువుకొన్నాక ఏం కావాలనుకొంటున్నారు' అనడిగారు.

కలెక్టర, డాక్టరు, పోలీసు ఆఫీసర్ కావాలన్న కోరిక ... అలా ఒక్కొక్కరు చెబుతున్న సమయాన శివన్న లేచి నిలబడి ' సార్, నా కోరిక ఏమిటంటే, నేనొక సేవా సంస్థ స్థాపించి బీద విద్యార్థులు చదువుకోనడానికి పుస్తకాలు, దుస్తులు పంచుతాను.' అన్నాడు శివన్న.

ఓట్ర ప్రకాష్‌రావు,
టెలిగ్రామ్ నంబరు, 09787446026

# చదువు విలువ



కథ

రామచంద్రాపురం పచ్చని చెట్లతో, పంట పొలాలతో అందంగా చాలా ప్రశాంతంగా ఉండే గ్రామం. ఆడ,మగ తేడా లేకుండా అందరూ పనులకు వెళ్తుంటారు. చిన్న చిన్న పిల్లలు ఆనందంగా ఆడుకుంటూ గెంతులు వేస్తున్నారు. బడి పిల్లలు కలిసిమెలిసి పాఠశాలకు వెళ్తున్నారు.

కానీ రిషికి మాత్రం పాఠశాలకు వెళ్లడం అసలు ఇష్టం లేదు. బడికి వెళ్తే పంతులుగారు కొడతారని, గదిలో ఖైదీల లాగా ఉండాల్సి వస్తుందని, వెళ్లడానికి ఏమాత్రం ఇష్టపడడు.

ఉదయం ఎనిమిది గంటలకు లేచి సోమరిగా మెల్లగా కళ్లు రుద్దుకుంటూ ఇంటి బయటికి వచ్చాడు. తనతోటి విద్యార్థులు పాఠశాలకు పోవడం చూసి తనను రమ్మని పిలుస్తారని గబగబా ఇంట్లోకి వెళ్లాడు.

రిషి అమ్మ రాధ 'మూడు రోజుల నుంచి బడికి వెళ్లట్లేదు. ఈరోజు కచ్చితంగా వెళ్లాలి' అంది. చేసేది లేక మెల్లగా తయారై వెళ్లసాగాడు.

పాఠశాలకు వెళ్లబుద్ధి కాక దారి మధ్యలో చెట్టుకింద పెద్ద బండ మీద కూర్చున్నాడు. దూరంగా పనిచేస్తున్న వారిని చూడసాగాడు.

అప్పటి నుంచి అక్కడే మూటలు మోస్తున్న కృష్ణయ్య గమనించి రిషి దగ్గరికి వచ్చాడు. 'ఏంటి బాబు పాఠశాలకు వెళ్లకుండా ఇక్కడ కూర్చున్నావు' అని సున్నితంగా ప్రశ్నించాడు.

'నాకు వెళ్లబుద్ధి కావడం లేదు. చదువంటే ఇష్టం లేదు'. అన్నాడు రిషి.

'ఇలా రా బాబు నీకు ఒకటి చూపిస్తా' అంటూ పనిచేసే దగ్గరకు తీసుకొనివెళ్లి ఇక్కడ వీరు ఏం చేస్తున్నారు' అని అడిగాడు కృష్ణయ్య.

'కూరగాయలు అమ్ముతున్నారు, మూటలు మోస్తున్నారు, పాచీపని చేస్తున్నారు' అని చెప్పాడు.

మరొక చోటుకు తీసుకొని వెళ్లి 'వీళ్లు ఏం చేస్తున్నారు' అన్నాడు.

'ఆఫీసులో పనిచేస్తున్నారు' అన్నాడు రిషి.

'వీళ్లలో ఎవరి పని బాగుంది' అడిగాడు.

'ఆఫీసులో పనిచేసే వాళ్లపని హాయిగా ఉంది' అన్నాడు రిషి.

'వారు ఎలా ఈ స్థాయిలో ఉన్నారు' అన్నాడు కృష్ణయ్య.

తడుముకోకుండా 'బాగా చదువు కున్నారు కాబట్టి అంత పెద్ద స్థాయిలో ఉన్నారని' చెప్పాడు.

'మరి ఇంతలా ఎండలో, వానలో తిండి మానేసి పనిచేయడం కన్నా చదివితే మేలు కదా!' అన్నాడు కృష్ణయ్య.

'అవును నాకు చదువు విలువ ఇప్పుడు తెలిసింది. నేను కూడా ఇప్పటి నుండి బాగా చదువుకుని మా అమ్మ నాన్నలను చక్కగా చూసుకుంటాను. సరే బెల్ కొట్టే సమయమైంది. నేను వెళ్తాను' అని రిషి పాఠశాలకు పరుగు తీశాడు. ఆరోజు నుండి రిషి క్రమం తప్పకుండా రోజూ పాఠశాలకు వెళ్లాడు. అది చూసి రాధ చాలా మురిసిపోయింది.

షేక్ సుమయ్య, 10వ తరగతి
ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ), కర్నూలు
9963350973





## తేడాలను గుర్తించండి!

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో కొన్ని తేడాలున్నాయి. అవేమిటో గుర్తించండి!

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథ

# చాణుక్య లౌక్యం

చంపకవనం అనే అడవిలో ఓ గున్న ఏనుగు ఆహారం కోసం వెతుక్కుంటుండగా కొందరు వేటగాళ్ళు వలవేసి పట్టి జంతుప్రదర్శనశాలకు అమ్మేశారు. ప్రదర్శనశాల నిర్వాహకులు దానికి చాణుక్య అని పేరు పెట్టారు. ఊహ తెలిసేకొద్దీ దానికి చిన్నప్పుడు స్వేచ్ఛగా తిరిగిన పచ్చని పరిసరాలు గుర్తొస్తుంటే సొంతగూటికి చేరాలన్న తపన ఎక్కువై ఒకరోజు కాపలావాళ్ళ కళ్ళుకప్పి బైటపడి అడవిబాట పట్టింది. దారిలో ఒక పులి, సింహం ఎదురు పడ్డాయ్. పులి సింహంకేసి గుర్రుగా చూస్తూ "చంపకవనంలో అన్నీ సాధు జంతువులేనని తెలిసి వాటికి రాజును కావాలన్న ఆశతో చాలా దూరం నుంచి వస్తున్నాను. నువ్వు నాకు పోటీగా రావద్దు, వెళ్ళిపొమ్మని" గాండ్రించడం, వెంటనే సింహం జూలు విదిలించి "నువ్వు ఎక్కణ్ణుంచో వచ్చావ్, నాది ఈ పక్క అడవే, నేనుండగా నువ్వెలా రాజువౌతావంటూ" గర్జించడం గమనించి ఆ క్రూరమృగాల బారి నుంచి తన ఆప్తులను కాపాడేందుకు వాటి దగ్గరకొచ్చి నవ్వుతూ "ఇక్కడ నివసించే జంతువులన్నీ చాలా తెలివి మీరిపోయాయ్, మన ఇష్టం వచ్చినట్లు పెత్తనం చెలాయిస్తామంటే ఒప్పుకోవు. ఎన్నికలు జరిపి తమ నాయకుణ్ణి ఎన్నుకోవాలనుకుంటున్నాయ్. కాబట్టి నా మాట విని ఎన్నికల్లో నిలబడండి, వాటిలో అధిక శాతం ఎవరిని ఎన్నుకుంటే వారే ఈ అడవికి రాజు. అందుకు ఇష్టపడితే వెంటనే చాటింపు వేసి సమావేశం ఏర్పాటు చెయ్యమని" ఒప్పించింది.



చాటింపు విని అక్కడ నివసించే లేళ్ళు, కుందేళ్ళు ఎంతో ఆసక్తితో బిలబిలమంటూ ఒకచోట చేరాయ్. ముందుగా పులి వినయంగా పంజాలు జోడించి " నేస్తాలూ, అధికారం నా చేతికిస్తే ఈ రోజు నుంచి మాంసాహారం మానేసి ఆకులు అలములు తింటూ మిమ్మల్ని కన్న బిడ్డల్లా చూసుకుంటానని" హామీ ఇచ్చింది. మరుక్షణమే సింహం లేచి "మిత్రులారా, అబద్ధపు హామీలు ఇవ్వదల్చుకోలేదు, ఆకలేస్తే పొరుగు అడవి జంతువుని చంపి తింటానే తప్ప మీ జోలికి రాను. నన్ను రాజుని చేస్తేనే మీరు ఈ అడవిలో నిర్భయంగా సంచరించగలరని" హెచ్చరించింది. ఆ అమాయక ప్రాణులు ఇద్దరిలో ఎవరిని నమ్మాలో అర్థంకాక అయోమయంలో పడ్డం చూసి చాణుక్య ముందుకొచ్చి "ప్రియ బంధువులారా, మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా సంతోషంగా వుంది. ఎందుకంటే నేను పుట్టిందీ ఈ అడవిలోనే. బాల్యంలోనే తల్లిని పోగొట్టుకున్న నన్ను కొందరు దుండగులు జంతు ప్రదర్శనశాలలో బందీని చేశారు. ఇన్నేళ్ళ తరువాత అక్కణ్ణించి ఎలాగో తప్పించుకుని తిరిగి ఇక్కడికి రాగలిగాను, నన్ను మీ తోబుట్టువుగా భావించి ఈ అడవితల్లినీ, మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకునే భాగ్యం కలిగించమని" వినయంగా అభ్యర్థించింది.

దాని మాటలు నిజమో కాదో తెలియక జంతువున్నీ అనుమానంగా చూస్తుండగా ఓ ముసలి ఎలుగుబంటి చాణుక్యను ఒక్క క్షణం తేరిపారా చూసి వెంటనే "ఔనర్రా, ఇది నా కళ్ళ ముందే పుట్టింది. ఆ తోక మీద తెల్లటి మచ్చ చూశాక కానీ నాకు గుర్తుకు రాలేదు. పాపం ..తల్లి చనిపోయాక ఎన్నో కష్టాలు పడి ఇన్నాళ్ళకు మన మీద ప్రేమతో వెతుక్కుంటూ తిరిగొచ్చింది, కాబట్టి చాణుక్యనే మనం రాజుగా ఎన్నుకుందాం. సాధు స్వభావం కలదైనా ఇది గొప్ప బలశాలి కాబట్టి క్రూరమృగాలు ఇటువైపు కన్నెత్తి చూడ్డానికి జంకుతాయ్, మనం నిశ్చింతగా బతగ్గలం" అని చెప్పింది. దాని మాటలు వినగానే సాధుజంతువు లన్నీ సంబరపడిపోతూ చాణుక్యను చంపకవనానికి రాజుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి.

అధికారం చేజిక్కించుకోవాలని ఆశగా వచ్చిన పులి, సింహం చాణుక్య ఎంతో లౌక్యంగా తమని మోసం చేసిందని అర్థమై చేసేది లేక వెంటనే తోకముడిచాయ్.

– నందిరాజు కృష్ణకుమారి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# బుడత



## బాలల కథ

## మంత్రి తెలివి



కౌశాంబీ రాజ్యాన్ని కీర్తిసేనుడనే మహారాజు పరిపాలించేవాడు. అతనికి మహామంత్రిగా సుబుద్ధి ఉండేవాడు. అతడు చాలా తెలివైనవాడు .

ఒకసారి రాజుగారి అంతఃపురంలో ఒక బంగారు హారం దొంగిలించబడింది. అది అంతపురంలో పనిచేసే పరిచారకులతో పాటు ఆ భటులే ఈ పని చేశారని రాజు భావించాడు. వెంటనే మహా మంత్రికి అంతఃపురం పరువు మర్యాదలకు భంగం కలగకుండా దొంగను పట్టుకోమని సూచించాడు.

మంత్రి సుబుద్ధి వారందరినీ పిలిచి మర్యాదగా ఆ దొంగతనం చేసింది ఎవరో చెప్పమన్నాడు. ఒకవేళ వారు నిజం చెప్పకుంటే శిక్ష తీవ్రంగా ఉంటుందని వారిని హెచ్చరించాడు కూడా! అయినా మంత్రి మాటలు విని ఎవ్వరూ మాట్లాడలేదు. మంత్రి ఒక్కొక్కరినే ప్రశ్నిస్తే అందరూ కూడా తాము తీయలేదంటే తాము తీయలేదని అన్నారు. అప్పుడు మహామంత్రి ఒక గది చూపించి వారందరినీ అందులోకి వెళ్ళమన్నాడు . వారందరూ వరుసగా ఆ గదిలోనికి వెళ్లారు. అక్కడ ఒక బంగారు గిన్నెను ఉంచారు. దానిని కళ్లార్పకుండా చూస్తూ అందర్నీ ముందుకు కదలమని మంత్రి సూచించాడు.

ఆ భటులు, పరిచారకులు అందరూ వరుసగా ఆ బంగారు గిన్నెను చూస్తూ ముందుకు కదిలారు. ఇంతలో ఒక భటుణ్ణి చూసిన మంత్రి తన భటులతో అతనిని బంధించమని చెప్పాడు . వెంటనే వారు ఆ భటుని బంధించారు. మంత్రి అతనితో " ఏమోయ్! నీవే ఆ బంగారు హారాన్ని దొంగిలించావు. అంతేకదూ ! నిజం చెప్పు" అని గద్దించాడు. ఆ భటుడు తన తప్పును ఒప్పుకొని మన్నించమని మంత్రిని వేడుకున్నాడు. మంత్రి అతనిని కారాగారంలో బంధించమన్నాడు .

ఇది గమనించిన రాజు మంత్రి తో "ఆ భటుడు భయంతో ఆ బంగారు గిన్నెను చూడలేదనుకుంటాను. కదూ !మంత్రిగారూ!"అని ప్రశ్నించాడు. " అయ్యో! ఆ గిన్నెను చూశాడు మహాప్రభూ !"అన్నాడు మంత్రి. "మరి అతడే దొంగ అని ఎలా కనిపెట్టారు?" అని రాజు ప్రశ్నించాడు. అప్పుడు మంత్రి " ఏముంది మహారాజా! అంతఃపురంలో ఇదివరకే కొన్ని విలువైన చిన్న చిన్న వస్తువులు పోతున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఆ దొంగను ఎలాగైనా పట్టుకోవాలని నేనే అనుకున్నాను. ఇంతలోనే ఒక పెద్ద బంగారు హారం కూడా దొంగిలించబడింది. ఆ దొంగ వీరిలోనే ఉన్నారని నేను ఊహించాను. నా ఊహ నిజమైంది. అందుకే ఈ పథకం వేశాను. ఆ బంగారు వస్తువును చూడగానే ఆ దొంగ రెండు చేతులు ఆకస్మికంగా అలవాటు చొప్పున అతనికి తెలియకుండానే దానిని దొంగిలించుటకు ముందుకు వచ్చాయి . అది రహస్యంగా నేను చాటునుండి గమనించాను. అతడే దొంగ అని నేను నిర్ధారణకు వచ్చాను. అందువల్ల అతనికున్న ఆ చెడు అలవాటే అతనిని పట్టి ఇచ్చింది "అని అన్నాడు. మంత్రి తెలివితేటలకు రాజు ఎంతో సంతోషించాడు.

సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535












